నవరత్నాల సభకు విష్ణు, వంటేరు డుమ్మా 7

యూరియా ధరకు రెక్కలు


ఎమ్మార్పీ రూ.295, విక్రయం రూ.330

- వివరాలు 9లో...

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శ్రీ పొట్టిశ్రీరాములు 16 నెల్లూరు
బుధవారం 30 ఆగస్టు 2017



'సోమశిల'కు వరద ప్రవాహం



- రబీలో 5 లక్షల ఎకరాల సాగు
- గత ఏడాది కన్నా ఇన్‌ఫ్లో మెరుగు
- 98.2 శాతం పెరిగిన వర్షపాతం
- అయినా.. చెరువుల్లో కానరాని నీరు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- వివరాలు 9వ పేజీలో



అన్నదాత.. ప్రాణదాత

- వివరాలు మెయిన్‌లో..

- తీవ్ర తలనొప్పితో బ్రెయిన్‌డెత్
- అవయవదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం
- కిడ్నీ, నేత్రాలు సేకరించిన 'సింహపురి' వైద్యులు

ఇప్పటిదాకా రైతు అంటే వ్యవసాయం చేసి పది మందికి అన్నం పెట్టే వ్యక్తిగానే మనకు తెలుసు. కానీ, ఈ అన్నదాత మాత్రం తాను మరణిస్తూ ఇంకొందరికి ప్రాణం పోసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు. విడవలూరుకు చెందిన వెంకటేశ్వర్లు రెడ్డి తీవ్రమైన తలనొప్పితో నెల్లూరులోని 'సింహపురి' ఆసుపత్రిలో చేరారు. బ్రెయిన్‌డెత్‌కు గురైనట్లు తెలుసుకున్న వైద్యులు కుటుంబ సభ్యుల అంగీకారంతో కిడ్నీలు, కళ్లను సేకరించారు.



వెంకటేశ్వర్లు రెడ్డి కిడ్నీలను భద్రపరుస్తున్న వైద్య సిబ్బంది

సిమెంట్ రోడ్డు ఇలాగేనా!?



సీతారామపురం : నాలుగు నెలల క్రితం వేసిన సిమెంటు రోడ్డు ఇలా కంకర తేలి...

- సిసీ రోడ్ల నిర్మాణంలో ఇష్టారాజ్యం
- మూన్నాళ్లకే పగుళ్లిచ్చి, రాళ్లు తేలి...
- అడుగడుగునా పర్సంటేజీలు
- ఉదయగిరి ప్రాంతంలో అడ్డగోలు దోపిడీ
- పట్టించుకోని అధికారులు

- వివరాలు 7లో..

'దానిమ్మ పరిహారం'

బంద్!

అది 30 ఏళ్ల కిందటి మాట!. కండలేరు ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో సందడే సందడి!. సంప్రదాయ నిమ్మ, మామిడి తోటలకు బదులుగా ఎటుచూసినా దానిమ్మ తోటలే. ముంపు పరిహారం ఇతర చెట్ల కన్నా దానిమ్మకు బాగా ఎక్కువగా ఉండడమే అందుకు కారణం. అంతెత్తున పెరిగిన చెట్లను ఎక్కడో కొనుక్కొచ్చి హడావుడిగా మెట్టభూముల్లో నాటేవారు.. చెట్ల లెక్కింపు పూర్తయిన గ్రామాల్లో వేర్లతో సహా పెకలించి ఎన్యూమరేషన్ పూర్తికాని గ్రామాల్లో నాటేవారు.. ఈ అక్రమ తోటలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అప్పట్లో దానిమ్మ చెట్లకు పరిహారం పంపిణీ ఆపేసి సీబీసీఐడీ విచారణకు ఆదేశించారు. ఆ విచారణ ఇంకా కొనసాగుతుండగా... గత ఏడాది రూ.8 కోట్ల మేర పరిహారం పంపిణీ చేయడంపై ఇప్పుడు మళ్లీ విచారణ మొదలయింది. దీంతో తాజాగా విడుదలైన రూ.2 కోట్ల పంపిణీకి బ్రేక్ పడనుంది.



- 30 ఏళ్ల నాటి విచారణ మళ్లీ మొదటికి
- విచారణాధికారిగా టీజీపీ స్పెషల్ కలెక్టర్
- 2- 3 రోజుల్లో ప్రాథమిక నివేదిక సమర్పణ
- 'కండలేరు' ముంపు గ్రామాల్లో కలకలం
- దానిమ్మ తోటలకు పరిహారంలో అక్రమాలు
- ఫిర్యాదులపై విచారణ చేపట్టిన సీబీసీఐడీ
- 30 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్న విచారణ
- అయినా.. ఇటీవల 8 కోట్ల పరిహారం పంపిణీ
- తాజాగా మరో రూ.2 కోట్లు విడుదల
- పంపిణీ నిలుపుదలకు అధికారుల నిర్ణయం!

- వివరాలు 8వ పేజీలో



పీఎస్‌ఎల్‌వీ-సీ39కి

నేడు కౌంట్‌డౌన్!

- ప్రయోగానికి శాస్త్రవేత్తల సంసిద్ధత
- రేపు రాత్రి 7 గంటలకు ప్రయోగం
- ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని తీసుకెళ్లనున్న రాకెట్
- నేడు షార్‌కు ఇస్రో ఛైర్మన్

- వివరాలు మెయిన్‌లో..



8

పోలీసు కస్టడీకి

క్రికెట్ బుకీ కృష్ణసింగ్

- మరో ప్రధాన బుకీ డీటీఎస్ రమేష్ కూడా
- కావలి ప్రధాన బుకీల కేసు నెల్లూరు కోర్టుకు
- ఆ నలుగురి కస్టడీకి పోలీసుల పిటిషన్
- త్వరలో ఎమ్మెల్యే అనిల్ రెండో దఫా విచారణ

మద్యం వ్యాపారులకు ఊరట!

- పురపాలికల్లో ఎక్కడైనా షాపులు పెట్టుకోవచ్చన్న 'సుప్రీం'
- నెల్లూరులో మినీ బైపాస్‌కు లైన్‌క్లియర్!
- 3, 4 రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు
- ఊపిరి పీల్చుకున్న వ్యాపారులు
- అద్దె గదుల వేటలో తలమునకలు

2లో..

వర్షాకాలం.. మీ బైకు భద్రం!



❑ కొద్ది పాటి జాగ్రత్త చర్యలు పాటిస్తే మేలు

చినుకుపడితే చిత్తడయ్యే రోడ్లు.. అడుగడుగునా బురద, గోతులు.. వర్షాకాలం వచ్చిందంటే చాలు ద్విచక్రవాహనాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. నిండా బురదతో అధ్వానంగా తయారవుతాయి. చాలా మంది ఆ బురదను తేలిగ్గా తీసుకుంటారు. కానీ ఇది సరికాదంటున్నారు మన మెకానిక్‌లు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ కాలం మన్నుతాయని చెబుతున్నారు.

◆ నెల్లూరు

● చిన్న చిన్న విడిభాగాల్లో సమస్యలు...

- వర్షం కారణంగా వీల్స్ బేరింగ్‌లో నీరు చేరే ప్రమాదం ఉంది. నీళ్లు అరిపోయాక బేరింగ్‌లో అయిల్ పోయడం మంచిది. రోడ్డపై ఏర్పడే గుంతల్లో వాహనాలు వేగంగా వెళితే ఈ బేరింగ్స్‌లోని బాల్స్ దెబ్బ తింటాయి.
- చైన్ ప్యాకెట్ కవర్ ఉన్నా లోనికి నీరు చేరే ప్రమాదముంది. దీంతో గడగడ శబ్దం వస్తుంది. వెంటనే గ్రీస్ రాయాలి. అయిల్ పోయాలి. దీన్ని ఉపేక్షిస్తే చైన్ వదులుగా మారి, ఆపై చెడిపోతుంది.
- షాక్‌అబ్జల్ దెబ్బతింటే షాకింగ్, అబ్జార్బింగ్‌లలో ఇబ్బందులు తప్పవు.

● చిన్న చిన్న విడిభాగాల్లో సమస్యలు...

- వర్షంలో బయటకు వెళ్లివచ్చాక ఒక్కసారి శుభ్రంగా తుడవాలి.
- వాహనం టైర్లలో గాలిని తరుచూ చెక్ చేయించుకోవాలి.
- గుంతల్లోంచి జాగ్రత్తగా వెళ్లాలి. లేదంటే పడిపోయే ప్రమాదముంది.
- ఇంజిన్‌లోకి నీరు చేరకుండా చూసుకోవాలి.
- సైలెన్సర్‌పై పడే బురద మరకలను వెంటనే తుడిచేయాలి.
- వర్షం నీరు కారణంగా బ్రేకులు, కిక్‌రాడ్లు, క్లచ్, గేర్లు జామ్ అయ్యే ప్రమాదముంది. సర్వీసింగ్‌కు ఇచ్చి, ఆయిల్, గ్రీస్ వేయించాలి.
- వాహనం బయట పార్క్ చేయాల్సి వస్తే వర్షం నేరుగా ఇంజిన్‌పై పడకుండా, మధ్య స్టాండ్ వేయాలి.

● ఇంజిన్ జర భద్రం...

ఏ వాహనానికైనా ఇంజిన్ గుండెకాయలాంటిది. ఇది దెబ్బతింటే వేలకువేలు పెట్టాల్సిందే! వర్షాలతో రోడ్లపై పెద్దమొత్తంలో నీరు నిల్వడం సహజం. అందులోంచి దూసుకుపోయినప్పుడు సైలెన్సర్‌లోకి నీరు చేరుతుంది. వెంటనే ప్రభావం చూపకున్నా రెండు రోజుల తర్వాత గరగర శబ్దం మొదలై, ఆ ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది. నీటిలో తడిచి ఆయిల్‌సీల్స్ సహా పలు విడిభాగాలు దెబ్బతింటాయి. అందువల్ల సైలెన్సర్ మునిగే నీళ్లలోంచి వెళ్లకపోవడమే మంచిది.



● సైలెన్సర్‌ను తుడిచేద్దాం..

వర్షాలకు త్వరగా దెబ్బతినే విడిభాగం సైలెన్సర్. నికెల్ కోటింగ్‌తో ఉండే సైలెన్సర్‌కు మట్టి, బురద అంటినప్పుడు శుభ్రం చేయకుంటే ఆ కోటింగ్ దెబ్బతింటుంది. అందువల్ల సైలెన్సర్‌కు అంటిన బురదను ఎప్పటికప్పుడు తుడిచివేయాలి. లేకపోతే రంధ్రాలు పడి, గరగర శబ్దం వస్తుంది. ఆ తర్వాత కొత్తది కొనక తప్పదు. ప్రస్తుతం మార్కెట్లో కొత్త సైలెన్సర్ ధరలు రూ. 1600 నుంచి రూ.1800 వరకు ఉన్నాయి. 150సీసీ బైక్‌లకైతే రూ.2 వేలపైగానే ఉంటున్నది. అందువల్ల సైలెన్సర్‌ను ఎప్పటికప్పుడు తుడుచుకోవడం ఉత్తమం.



● మడ్‌గార్డ్, రీములు

బురదతో దెబ్బతినే విడిభాగాల్లో రీములు, మడ్‌గార్డ్‌లు ముఖ్యమైనవి. బురద అంటినప్పుడు ఎక్కువ కాలం వాటర్ సర్వీసింగ్ చేయించకుండా ఉంటే ఫైబర్ మడ్‌గార్డు, నికెల్ కోటింగ్ ఉన్న ఉక్కు రీములైనా, స్టీల్ రీములైనా దెబ్బతింటాయి. అందువల్ల వర్షంలో తడిసినా, బురద పట్టినా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. లేదా సర్వీసింగ్ చేయించాలి.



● పెట్రోల్ ట్యాంక్ జాగ్రత్త..

పెట్రోల్‌ట్యాంక్‌కు ఎంత పకడ్బందీ మూత ఉన్నా వర్షం జోరందుకుంటే నీరు లోనికిపోతుంది. అది పెట్రోల్‌తో సహా కార్బ్యురేటర్‌లోకి చేరుతుంది. వెంటనే వాహనం మొరాయిస్తుంది. కార్బ్యురేటర్ నుంచి వెళ్లే వాల్వ్ ద్వారా ఇంజిన్‌కు నీరు చేరితే మరమ్మతులు తప్పవు. భారీ వర్షం కురిసినప్పుడు వర్షంలో ఉంచకపోవడమే మంచిది.



మినీ బైపాస్‌కు లైన్‌క్లియర్!

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : నగర మద్యం వ్యాపారులకు గొప్ప ఊరట లభించింది. మినీ బైపాస్ రోడ్డులో దుకాణాల ఏర్పాటుకు అనుమతిపై వారు చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కింది. ఈ రోడ్డులో ఎక్కడైనా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించే విధంగా సుప్రీంకోర్టు ఆదేశాలు వెలువరించింది. దేశంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారులు వెళుతున్నా వాటి వెంబడి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని తీర్పునిచ్చింది. దీంతో ఈ వ్యవహారంపై రెండు నెలలుగా వివిధ కోర్టుల చుట్టూ తిరుగుతున్న నెల్లూరు మద్యం వ్యాపారులకు లైన్ క్లియరైంది. నగరాలు, పట్టణాలలో లారీలు తిరగవు కనుక ఈ ప్రాంతాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరుతూ చెన్నైకి చెందిన మద్యం వ్యాపారులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పును వెలువరించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పు కాపీలు రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరో మూడు, నాలుగు రోజుల్లో దీనిపై అనుమతి ఉత్తర్వులు జారీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీంతో మినీబైపాస్‌లో గతంలో మాదిరి యథావిధిగా షాపులు, బార్‌లు ఏర్పాటు చేసుకునేందుకు వ్యాపారులు సన్నాహాలు చేసుకుంటున్నారు. మినీబైపాస్ విషయమై నెల్లూరు వ్యాపారులు ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ వేసి ఉన్నారు. దీనిపై కూడా త్వరలోనే తీర్పు వెలువడనుంది.

2017- 19 సంవత్సరాలకు సంబంధించి ఆబ్కారీ శాఖ సుప్రీంకోర్టు ఆదేశాల అనుసారం కొత్త మద్యం పాలసీని అమల్లోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్లు లోపు మద్యం షాపులు, బార్‌లు ఏర్పాటు చేసుకునే వీలు లేకుండా పోయింది. జూలై నుంచి ఈ పాలసీ అమల్లోకి రావడంతో గందరగోళం నెలకొంది. రహదారుల పక్కన షాపులు, బార్‌లు పెట్టేందుకు వీలు లేకుండా పోగా, జనావాసాల మధ్యన పెడితే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో అప్పటికే లైసెన్సులు దక్కించుకున్న వ్యాపారులు నానా ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో కొన్నిరోజుల పాటు పలుచోట్ల మద్యం షాపులు తెరుచుకోలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల గుండా వెళ్లే రాష్ట్ర రహదారులను జిల్లా ప్రధాన రహదారులు (ఎండీఆర్)గా డీనోటిఫై చేసింది. దీంతో కొంతవరకు షాపులు తెరుచుకున్నాయి. అయితే నెల్లూరు నగరంలో ప్రధానమైన మినీబైపాస్ జాతీయ రహదారి కావడంతో మద్యం వ్యాపారులకు ఇబ్బందులు తప్పలేదు. గతంలో మినీబైపాస్

● పురపాలికల్లో మద్యం షాపులు ఎక్కడైనా పెట్టుకోవచ్చన్న 'సుప్రీం'

వెంబడి సుమారు 25 మద్యం షాపులు, బార్‌లు ఉండేవి. ఇప్పుడు అవన్నీ రోడ్డుకు అర కిలోమీటరు ఆవలికి జరగాల్సి రావడంతో చాలా మంది వ్యాపారులు అనువైన స్థలం దొరకక మిన్నకుండిపోయారు. లైసెన్స్ ఫీజులు చెల్లించి కూడా వ్యాపారం చేసుకోలేక పోయారు. జాతీయ రహదారిని డీనోటిఫై చేయడం కేంద్రం పరిధిలోని అంశం కావడంతో ఆ దిశగా వ్యాపారులంతా ప్రయత్నాలు చేశారు. ఇదే సమయంలో హైకోర్టును కూడా ఆశ్రయించారు. అయితే ఇప్పుడు సుప్రీం కోర్టే పట్టణ, నగర పరిధిలోని జాతీయ రహదారులపై కూడా షాపులు, బార్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పడంతో వీరంతా ఆ పనిలో నిమగ్నమయ్యారు. కొందరైతే ఇప్పటికే దూరంగా ఏర్పాటు చేసి ఉన్న షాపులను మళ్లీ మినీ బైపాస్‌పైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

వ్యాబ్ నుంచి ప్రయోగ వేదిక పైకి..



వాహన అనుసంధాన భవనం నుంచి ప్రయోగ వేదికపైకి తరలింపు ప్రక్రియకు పచ్చజెండా ఊపుతున్న షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్

శ్రీ ఎస్‌ఎల్‌వీ-సీ39 రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు పచ్చజెండా ఊపడంతో ఇప్పుడు అందరి దృష్టి షార్‌పైనే పడింది. బుధవారం మధ్యాహ్నం కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుండగా, గురువారం రాత్రి 7 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మేరకు వాహన అనుసంధాన భవనంలో సిద్ధం చేసిన రాకెట్‌ను ఇదిగో ఇలా రెండో ప్రయోగవేదికపైకి మంగళవారం తరలించారు.

\- శ్రీహరికోట (సూళ్లూరుపేట)



ఇక రెడీ..!



రెండో ప్రయోగ వేదికపైకి పయనిస్తూ..

సగటు వర్షపాతం 14.6 మి.మీ.

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో మంగళవారం సగటు వర్షపాతం 14.6 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 40 మి.మీ. అత్యల్పంగా దొరవారిసత్రంలో ఒక మి.మీ. వర్షం కురిసింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. సీతారామపురం 18.2, వరికుంటపాడు 16.8, కొండాపురం 22.0, జలదంకి 17.6, కావలి 36.2, బోగోలు 16.2, కలిగిరి 18.2, వింజమూరు 17.8, దుత్తలూరు 6, ఉదయగిరి 10, మర్రిపాడు 6.2, ఆత్మకూరు 11.2, ఏఎస్‌పేట 12.8, దగదర్తి 23, అల్లూరు 20, విడవలూరు 28.6, కొడవలూరు 23.6, బుచ్చి 21.2, సంగం 25.4, చేజర్ల 16.2, అనంతసాగరం 20.2, కలువాయి 18.2, రాపూరు 9.8, నెల్లూరు 29.2, కోవూరు 29, ఇందుకూరుపేట 24.6, టిపిగూడూరు 17.2, ముత్తుకూరు 1.8, వెంకటాచలం 24.2, మనుబోలు 5.4, గూడూరు 9.6, సైదాపురం 1.0.6, డక్కిలి 12.6, వెంకటగిరి 14.8, బాలాయపల్లి 16.8, ఓజిలి 2.8, చిల్లకూరు 1.2, కోట 2.8, వాకాడు 4.8, చిట్టమూరు 4.2, నాయుడుపేటలో 5.4 మి.మీ. వంతున వర్షపాతం నమోదైంది.

అమరావతి కళాశాల అనుమతి రద్దు

● ఆర్ఐవో బాబుజాకబ్

వెంకటగిరి: పట్టణంలో రాణీపేట వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన అమరావతి జూనియర్ కళాశాల షిఫ్టింగ్ అనుమతి రద్దు చేసినట్టు ఆర్ఐవో బాబుజాకబ్ తెలిపారు. మంగళవారం వెంకటగిరికి వచ్చిన ఆయన 5వ వార్డు కాలేజీమిట్టలోని విశ్వోదయ జూనియర్ కళాశాలలో విలేఖరులతో మాట్లాడారు. ఆ కళాశాల అనుమతులు రద్దు చేసినట్టు కళాశాల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చినా కళాశాల నడుపుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. కళాశాలలోని విద్యార్థులకు కూడా అనుమతులు రద్దు చేసిన విషయం తెలియజేశామన్నారు. ఈనెల 31వ తేది లోపు కళాశాలలోని విద్యార్థులను వేరే కళాశాలల్లో ఆన్‌లైన్ ఎన్‌రోల్ మెంట్ చేయించుకోవాలని సూచించారు. కళాశాల నిర్వాహకులకు నోటీసులు అందచేసిన ఆయన మరో సారి కళాశాల నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన కళాశాల బోర్డును తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది 30 వేల మంది విద్యార్థులు కళాశాలల్లో చేరినట్టు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో డీవీఈవో బీ వెంకయ్యతో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ శేషు తదితరులు ఉన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న ఆర్ఐవో బాబుజాకబ్(కుడివైపు) పక్కన డీవీఈవో బీ వెంకయ్య



బలరామరెడ్డికి రేపు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

● సినీనటి వై విజయ రాక

నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి) : పారిశ్రామికవేత్త, కళాపోషకుడు కొండా బలరామరెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నట్టు ఏపీ ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీ కోట గురుబ్రహ్మం తెలిపారు. మంగళవారం స్థానిక యష్‌పార్క్ హోటల్‌లో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం టౌనుహాలులో ఈ వేడుక జరుగుతుందన్నారు. ప్రముఖ సినీనటి వై విజయ, రాష్ట్రమంత్రులు పీ నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. సంగీత, నృత్య విభావరి ఉంటుందని చెప్పార. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు టంగుటూరు రామకృష్ణ, వాకాటి విజయకుమార్ రెడ్డి, అమరావతి కృష్ణారెడ్డి, బయ్యా రవి హాజరవుతారని చెప్పారు. అనంతరం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆచార్య ఆదిత్య, కేతా సుబ్బారావు, బలరామరెడ్డి పాల్గొన్నారు.



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న గురుబ్రహ్మం తదితరులు



పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్

మాతృభాషలో బోధనతో సృజన వృద్ధి



కొండాపురం : మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య

కొండాపురం: మాతృభాషలో బోధిస్తే విద్యార్థులలో సృజన పెరుగుతుందని గొట్టిగుండాల బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య పేర్కొన్నారు. తెలుగుభాష దినోత్సవాన్ని మంగళవారం పాఠశాలలో జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ మాతృ భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి సేవలను విద్యార్థులకు వివరించారు. పరభాషాజ్ఞానాన్ని పెంపొందించుకోవడం తప్పుకాదని సంబోధనా పరంగా మాతృభాషనే ఉపయోగించాలన్నారు. తెలుగు భాషలోని స్పష్టత, నేర్పు, భావం, కూర్పు అందంగా ఉంటాయన్నారు. మాతృభాషపై విద్యార్థులకు చక్కటి అవగాహన కల్పించి భాషను ప్రేమించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

క్రీడలు ఆహ్లాదాన్నిస్తాయి

హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఏటా ఆగస్టు 29వ తేదీని జాతీయ క్రీడాదినోత్సవంగా ప్రభుత్వం జరుపుతోందని మాలకొండయ్య అన్నారు. ఒలంపిక్ క్రీడల్లో ధ్యాన్‌చంద్ వరుసగా మూడేళ్లు బంగారు పతకాలు సాధించి భారతదేశ కీర్తిని ప్రపంచదేశాలలో చాటాడన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి తనకిష్టమైన ఆటలలో రాణిస్తే ఉత్తమ భవిత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, శ్రీనివాసరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కావలిటౌన్: తెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సాయికో-ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో తెలుగుభాషాదినోత్సవం జరిగింది. సమితి అధ్యక్షుడు బీవీ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 1వ వార్డు కౌన్సిలర్ పులి రజని సామాజిక కార్యకర్త సీ శారద తెలుగు తల్లి, గిడుగు రామూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నారాయణ మాట్లాడుతూ తెలుగు సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలని భావి తరాలకు తెలుగు ఔనత్యం, ప్రాముఖ్యాన్ని అందిచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

నారాయణ జూనియర్ కళాశాలలో తెలుగు జ్ఞానపీఠ ఆధ్వర్యంలో తెలుగుభాష వ్యాప్తికి అవగాహన సదస్సు నిర్వహించారు. పీఠం అధ్యక్షుడు డాక్టరు జిల్లా శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులనాయుడు తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగుభాష అభివృద్ధి కోసం అందరుపాటు పడాలని సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. మాతృభాష మృత భాష కాకుండా చూడాలన్నారు.

వస్త్ర వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన

నెల్లూరు (సాంస్కృతికం) : వస్త్ర వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన సదస్సు మంగళవారం నెల్లూరులోని ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ద్వారా దేశమంతా పన్నుల విధానంలో సంస్కరణలు తెచ్చిందని, క్రమశిక్షణ కలిగిన వ్యాపారం చేసే వారికి ఈ చట్టం ఎంతో శ్రేయస్కరమన్నారు. వస్త్ర వ్యాపారానికి పన్ను కొత్తేమి కాదన్నారు. వినియోగదారుల నుంచి వసూలు చేసిన పన్నులు సక్రమంగా ప్రభుత్వానికి అందనందునే జీఎస్టీ అమలులోకి వచ్చిందన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం రిటన్స్ ఎలా వేయాలి అనే విషయాన్ని విశదీకరించారు. పన్ను ఎగవేతకు పాల్పడితే రెండింతల పన్ను, జరిమానా, జైలు ఉంటాయని హెచ్చరించారు. వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఎన్ కామేశ్వరరావు, ఏపీ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఆకుల వెంకటేశ్వర్లు, జీఎస్టీఎన్ కమిటీ సభ్యుడు సీఏ సుబ్బారావు, ఏపీ సేల్స్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీఎస్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని అన్నపూర్ణ క్లాత్ మార్కెట్

విస్తరణ వివాదం

- పట్టువీడని వస్త్రవ్యాపారులు
- సయోధ్య కోసం బీఎంఆర్ చర్చలు



అన్నపూర్ణ క్లాత్ మార్కెట్ సముదాయం

కావలి: స్థానిక అన్నపూర్ణ క్లాత్ మార్కెట్ సముదాయాన్ని మరికొంత విస్తరించాలనే విషయమై ఆ మార్కెట్‌లోని ఇరు వర్గాల వస్త్రవ్యాపారుల మధ్య ఏర్పడిన వివాదం ఒక కొలిక్కిరాలేదు. ఈ వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి సమస్య పరిష్కరించడానికి సీఆర్‌డీఏ సభ్యుడు బీద మస్తాన్‌రావు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ఫలించలేదు. సుమారు ఎనిమిది నెలల నుంచి ఈ వివాదం కొనసాగుతూ ఉంది. ఈ విషయం కేంద్ర రాష్ట్ర మంత్రుల దృష్టికి కూడ వస్త్రవ్యాపార వర్గాల్లో ఒక వర్గానికి నాయకత్వం వహిస్తున్న బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కందుకూరి వెంకట సత్యనారాయణ తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ సూచనల మేరకు కావలి ఆర్డీవో మార్కెట్ విస్తరణలో గోడ వివాదాన్ని పరిశీలించి నివేదిక అందజేశారు. బీద మస్తాన్‌రావు ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ఇరు వర్గాల మధ్య సయోధ్యకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఆ ఇరువర్గాలు పట్టు వీడక, మెట్టు దిగక పోండంతో ఆ సమస్య పరిష్కారం జాప్యమవుతోంది.

ఏపీసీ మార్కెట్‌కు నైరుతీ దిశలో దక్షిణం, కొంత భాగంలో పడమర ప్రహరీ ఆవలివైపున ఉన్న దుకాణాలను మార్కెట్‌లో కలుపుకుని విస్తరించాలని ఒక వర్గం పట్టుబట్టింది. దానిని మరొక వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తూ వచ్చింది. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌తో సంబంధంలేని దుకాణాలను కలుపుకొని దారి వసతి కల్పించేందుకు కొంత నగదు ఇస్తామని గోడకు ఆవలివైపున ఉన్న దుకాణదారులకు మద్దతు ఇస్తున్న ఒక వర్గం ప్రయత్నించింది. ఆ ప్రయత్నం ఫలించకపోగా మార్కెట్‌లో ప్రస్తుతం నిర్వహణలో ఉన్న అసోసియేషన్‌కు వ్యతిరేకంగా మరొక అసోసియేషన్ ఏర్పాటు చేసి దానికి బీజేపీ నాయకుడు కందుకూరి వెంకటసత్యనారాయణకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇరువర్గాలు మార్కెట్ అసోసియేషన్‌కు ఎవ్వరివారు తామే అధ్యక్షులమని ప్రకటిం చుకున్న తరుణంలో సుమారు ఎనిమిది నెలల కిందట మార్కెట్ పడమర వైపున ఉన్న గోడను ఒక వర్గం సహకారంతో అర్ధరాత్రి కూల్చివేశారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో అప్పటిలో తాత్కాలికంగా సమస్యను సర్దుబాటు చేసి మరల రాజీ ప్రయత్నాలు మొదలెట్టారు. ఈ ప్రయత్నాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా అందరికి న్యాయం జరిగేలా చూడాలని పలు దఫాలు చర్చించారు. ఎట్టకేలకు చర్చలు ఫలించినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. మార్కెట్ ప్రహరీ ఆవలి వైపున ఉన్న దుకాణాలను మార్కెట్‌లో కలుపుకొనేందుకు ఆరు దుకాణాల విలువను మార్కెట్ సభ్యులకు ఇవ్వాలనే ప్రతిపాదనను ఇరు వర్గాలు ఆమోదించాయి. అయితే పూర్తిగా నగదు చెల్లించిన వెంటనే అక్కడ ఉన్న గోడను పగలగొట్టాలని ఒక వర్గం పట్టుబట్టగా మరొక వర్గం గోడ పగలగొట్టకపోతే దుకాణాలు కొనేందుకు ఎవ్వరు ముందుకు రారని, దీంతో గోడను పగలగొట్టిన తక్షణమే ఒప్పందం ప్రకారం పూర్తి నగదు చెల్లిస్తామంటున్నారు. ఈ ఒప్పందంపై ఇరువర్గాలు ఒకరినొకరు నమ్మక పోవడంతో సమస్య అలాగే కొనసాగుతూ ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు సోమవారం బీద మస్తార్‌రావు వ్యాపారవర్గాల మధ్య చర్చలు జరిపి దుకాణాలు కొనేవారు ముందుగా కొంత అడ్వాన్సు చెల్లిస్తే ఆ మొత్తం మార్కెట్‌కు చెల్లించి గోడ పగలగొట్టిన తరువాత మిగతా నగదు చెల్లించాలనే విషయమై చర్చించారు. ఇందులో భాగంగా సోమవారం మంచి రోజని గోడ పగలగొట్టేందుకు మూహూర్తం బాగున్నదని ఎక్కడైన ఒక మూల మట్టి పెళ్లను తీసే ప్రయత్నం ఒక వర్గం చేపట్టింది. ఆ సమయంలో బీజేపీ నేత కందుకూరి వెంకట సత్యనాయరణ కావలిలో లేకపోవడంతో ఆయన వర్గం మనుషులు ఆయనకు సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే జిల్లా ఎస్పీతో మాట్లాడారు. క్షణాల్లో అక్కడికి పోలీసులు వెళ్లడంతో గోడ తొలంచేందుకు ఏర్పాటు చేసుకున్న మూహూర్తం కూడా వాయిదా పడింది. దీంతో అక్కడ గోడ సమస్య పరిష్కారం అవుతుందా లేదా అనేది వ్యాపారవర్గాల మధ్య చర్చినీయాంశమైంది.

ఆదాయ వనరుగా చెత్త నుంచి సంపద కేంద్రాలు

కావలిరూరల్: గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మార్చుకోవచ్చని ఆర్‌సీపాలెం సర్పంచు గుంటూరు మల్లికార్జున్ పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం రాజువారి చింతలపాలెంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచు మల్లికార్జున్, జిల్లా రీసోర్స్ పర్సన్ షఫి, కార్యదర్శి సమద్ మాట్లాడుతూ గ్రామాల్లోని తడి చెత్తను సేకరించి ఆ చెత్త నుంచి వర్మి ఎరువును తయారీ చేసి రైతులకు అందించడం జరుగుతుందన్నారు. రసాయన ఎరువుల బదులుగా సేంద్రియ ఎరువులు, కషాయాలతో వరి, ఆకుకూరలు సాగు చేసిన తీరును సేంద్రియ ఎరువుల లాభాలను వివరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ కార్యక్రమంలో కొండాపురం జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, కావలి, జలదంకి, కొండాపురం మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీని వివరిస్తున్న సర్పంచు గుంటూరు మల్లికార్జున్

నగదు రహిత లావాదేవీలకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతి అందుకుటున్న వినియోగదారుడు

కావలి: చౌకదుకాణాల్లో నగదు రహిత లావాదేవీలు నెరపి న వినియోగదారులకు ప్రభుత్వం ప్రోత్సాహ బహుమతులు అందజేస్తోంది కావలిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నగదు రహిత లావాదేవీలు జరిపిన వినియోగదారులు షేక్ షమీ, షేక్ నూర్జహాన్, పీ లక్ష్మయ్య, ఎం శేషయ్య, కె నాగమ్మలకు స్మార్ట్ సెల్‌ఫోన్లను అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి తహసీల్దార్ కృష్ణారావు, పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జీ ఉపతహసీల్దార్ మలిశెట్టి సురేష్‌బాబు వినియోగదారులకు సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసే ఈ ప్రోత్సాహకాలను ప్రతి ఒక్కరు సద్వినియెగం చేసుకోవాలని వారు కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

కావలి(క్రైం): అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని అగ్నిమాపకదళ అధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కేఎంహెచ్ వైద్యశాల ఆవరణలో వైద్యులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే విధానంపై సిబ్బందితో కలిసి శిక్షణ ఇచ్చారు. నీరు, కార్బన్‌డైఆక్సైడ్, ఇసుక, తడి దుస్తులతో ప్రమాదాల నివారణను ప్రయోగాత్మకంగా వివరించారు. మంట మండేందుకు ముఖ్యంగా గాలి, ఏదైన పదార్థం అవసరమని ఈ రెండింటిలో ఏది లేకపోయినా మంట ఆరిపోతుందన్నారు. అందువల్ల గాలిని నియంత్రించగలిగాలన్నారు.. అగ్ని ప్రమాద సమయంలో ముఖ్యంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యుడు బాబుకిరణ్, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది జీజి భాస్కర్, శ్రీహరి, రామకృష్ణ, మధు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక విధానాలను వివరిస్తున్న శ్రీనివాసులురెడ్డి

9,195 మంది పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్లు

బిట్రగుంట: బోగోలు మండలంలోని పంచాయతీలలో మంగళవారం వరకు 9195 మంది పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్లు అందచేశామని కోవూరుపల్లి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పులికం శ్రీహరిరెడ్డి అన్నారు. ముంగమూరు, కోవూరుపల్లి, బీఎంఆర్‌కాలనీ సబ్‌సెంటర్లలో ఈ వ్యాక్సిన్లు పిల్లలకు అందచేశారు. ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే ఈ వ్యాక్సిన్‌ను తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సురేంద్రబాబు, ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండాపురం : నిమజ్జనానికి తరలుతున్న బొజ్జగణపయ్య



కావలి మానస సెంటర్‌లో గణేశుడికి విశేష పూజలు



కావలి : అన్న సంతర్పణ ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి



బిట్రగుంట : గ్రామోత్సవంలో గణనాథుడు



కావలిరూరల్ : చిట్టి గణపయ్యతో చిన్నారుల కేరింతలు



మహిళలకు బహుమతులు అందిస్తున్న అమరా దంపతులు

కోలాహలంగా గణేశ నిమజ్జనం

• విశేష అలంకరణలు • బాజాభజంత్రీలు • యువత కేరింతలు • డీజే సెట్టింగులు • భారీ అన్నదానాలు

కావలిటౌన్: కావలి మానస సెంటర్ కలుగోళమ్మపేట ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి శతకలశ మహాభిషేకం, గణపతి, రుద్రహోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గణేష్ క్యాటరింగ్ నిర్వాహకుడు రాము వేలంలో రూ. 99వేలకు లడ్డు ప్రసాదం దక్కించుకున్నాడు. ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ, భారీ డీజె సౌండ్‌సిస్టమ్‌తో బాణా సంచ పేల్చుకుంటూ యువత రంగులు చల్లుకుంటూ గణేష్ మహరాజ్‌కే జై అంటూ నినాదాలు చేస్తె ట్రంకరోడ్డు మీదుగా నిర్వహించిన గ్రామోత్సవం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయ, కర్పూరం సమర్పించారు. అనంతరం విగ్రహాన్ని ముసునూరు మందాడి చెరువులో నిమజ్జనం చేశారు. అన్నసంతర్పణలో ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి, టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, గుత్తికొండ కిషోర్, ఏగూరి చంద్రశేఖర్, ఊసా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అనేక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. యువత రంగులు చల్లుకుంటూ బాణ సంచా పేల్చుకుంటూ ఉత్సాహంగా సముద్రతీరానికి తరలివెళ్ళారు. 33వ వార్డు ఆనాలవారి వీధిలో యువత ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆటపాటల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా స్థానిక కౌన్సిలర్ అమరా విజయలక్ష్మి, టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి పాల్గొని పూజలు నిర్వహించి మహిళలకు, యువతకు సొంత నిధులతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవ్వా సుబ్బారావు, కమర్‌బాబు, యువత పాల్గొన్నారు.

రూపాయ మిద్దె కూడలి వద్ద ముసునూరు పాతూరులో మర్రిచెట్టు కాలనీలో పట్టణ పాతూరు, గాయత్రినగర్ తదితర ప్రాంతాల నుంచి విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్ళాయి.

కొండాపురం: మండలపరిధిలో వినాయకచవితి సందర్భంగా కొలువుదీర్చిన గణనాధులను ఐదో రోజు సందర్భంగా మంగళవారం పలుగ్రామాలలో నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు. నేకునాంపేట, కొండాపురం, కొమ్మి పంచాయతీ రామానుజపురం, సాయిపేట ఎస్సీకాలనీ, ఇస్కదామెర్ల పంచాయతీ పొట్టిపల్లి తదితర గ్రామాలలో విగ్రహాలను నిమంజ్జనం చేశారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా ప్రతిఒక్కరూ గణనాథుడి ఊరేగింపులో చిందులేశారు.



వైకుంతపురం గణేశ్ ఊరేగిపులో శివపార్వతుల వేషధారులు

కావలిరూరల్: వినాయక చవితి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసిన గణనాథుడి విగ్రహాలను మంగళవారం నిమజ్జనానికి సాగర తీరానికి తరలించారు. కావలి పట్టణ, రూరల్ మండలంలోని గ్రామాలతో పాటు జలదంకి, కలిగిరి, కొండాపురం, వింజమూరు మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం సముద్ర తీరానికి తరలించారు. గ్రామాల్లో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి విగ్రహాలతో తరలివెళ్లడం కనిపించింది. వైకుంఠపురంలోని వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న వాహనంలో శివపార్వతుల వేషధారులు ఆకట్టుకున్నారు.

బిట్రగుంట: బోగోలు మండలంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదో రోజైన మంగళవారం నిమజ్జనానికి తరలించారు. బోగోలు హరిజనవాడలో వినాయక విగ్రహాన్ని కుమ్మరివీధి గిరిజనకాలనీలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహాన్ని మేళతాళాలతో పురవీధులలో ఊరేగించారు. బాణసంచాకాలుస్తూ వినాయకుని వాహనం ఎదుట యువత నృత్యాలు చేశారు. సమాధి రమణయ్య గిరిజన కాలనీలోని ఉత్సవానికి ఉభయకర్తగా వ్యవహరించారు.

కౌలు రైతులకు ధ్రువీకరణలు ఇస్తాం

కొండాపురం: కౌలురైతులందరికీ సాగు ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని మండల వ్యవసాయ అధికారిణి సుధారాణి అన్నారు. పొలంపిలుస్తోందిలో భాగంగా మంగళవారం మండలంలోని గరిమెనపెంట పంచాయతీ చల్లవారిపల్లె, కోవివారిపల్లె గ్రామాలలో ఆమె మాట్లాడుతూ భూసార పరీక్ష కార్డులున్న రైతులకు నూరు శాతం రాయితీతో జింకు, జిప్సం పంపిణీ చేస్తామన్నారు. సాగు ధ్రువీకరణ పత్రాలతో కౌలు రైతు రాయితీపై విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణం పొందవచ్చన్నారు. గ్రామాలలో సాగుచేసిన మిశ్రమ పంటలైన కంది, సజ్జలను పరిశీలించి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఈశ్వరాచారి, మనోహర్, చెన్నుపాటి శ్రీనివాసులు, మన్నం యలమందయ్య, నంద మాచెర్ల పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న సుధారాణి

ఎంఆర్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

కలిగిరి: మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అదనంగా అవసరమైన పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి మంగళవారం వచ్చాయని ఎంఈవో షేక్ అబ్దుల్‌రజాక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులు, కొంతమందికి అన్ని పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు అందలేదన్నారు. అవసరమైన పాఠ్యపుస్తకాల వివరాలను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తమకు అందించడం జరిగిందన్నారు. అదనంగా పాఠ్యపుస్తకాలకు వివరాలు అందించిన ఉపాధ్యాయులు ఎంఆర్సీకి వచ్చి తీసుకెళ్ళాలని ఎంఈవోవో తెలిపారు.

ఆర్‌సీఎమ్‌లో ధ్వజస్తంభ ప్రారంభోత్సవం

బిట్రగుంట: బోగోలు ఆర్‌సీఎమ్ చర్చి ఆవరణంలోని వేళాంగణీ మాత మందిర ఎదుట ఎఫ్ ఆరోగ్యనాధన్, .ధార్యడోమ్మిక్(యుఎస్‌ఏ), బాలు కుటుంబ సభ్యులు ధ్వజస్తంభాన్ని ఏర్పాటుచేయగా కావలికి చెందిన పాదర్ వై. డీ హృదయరాజ్ తాళ్లపాలెంకు చెందిన ఫాదర్ న్యావీకుమార్ ప్రారంభించారు. స్థానిక చర్చి ఫాదర్ మరియాజోషప్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ప్రార్ధనలు బలిపూజ కార్యక్రమం జరిగాయి. అధిక సంఖ్యలో క్రైస్తవ, ఇతర మతాల సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఫాదర్లు మాట్లాడుతూ వేళాంగణీ మాత జన్మదిన సందర్భంగా నవదిన ప్రత్యేక ప్రార్ధనలు తొమ్మిదో రోజు ఊరేగింపు ఉంటుందన్నారు.



ధ్వజస్తంభాన్ని ప్రారంభిస్తున్న హృదయరాజ్

రూ. 100, 50 నోట్లు చెల్లవని వదంతులు

● వాట్సప్ మెసేజ్‌తో ఆందోళన ● బ్యాంక్‌లకు పరుగులు తీసిన జనం



నోట్లు రద్దు అయ్యాయంటూ వాట్సప్ హల్‌చల్ చేసిన ఫోటో

తడ : 100, 50 రూపాయల నోట్లు రద్దయ్యాయి.. రేపు ఉదయం నుంచి వాటిని బ్యాంక్‌లలో తప్ప మరెక్కడా తీసుకోరంటూ ఓవార్త వాట్సాప్‌లో హల్‌చల్ చేసి జనాలను గందరగోళంలో పడవేసింది. సోమవారం సాయంత్రం సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి 100, 50నోట్ల రద్దు ప్రకటించారని సెల్‌ఫోన్‌ల్లోని వాట్సప్‌లకు మెసేజ్ వచ్చింది. దీంతో ఈ మెసేజ్‌ను ఒకరి నుంచి మరొకరికి నిమిషాల వ్యవధిలో చేరిపోయింది. దీంతో ఒక్కసారిగా జనం కంగారుపడ్డారు. దీనికి తోడు ఓ టీవీ చానల్ నోట్ల రద్దుపై ప్రధాన మంత్రి ఫోటోతో కలిపిన క్లిపింగ్‌ను వాట్సప్‌లో ఉండడంతో ఒకరికొకరు నిజమేనా అంటూ మాట్లాడుకోవడం కన్పించింది. మూడు రోజుల క్రితమే 50.. 100 రూపాయల కొత్తనోట్లు చెన్నై బిజినెస్ సెంటర్‌లో విడుదల అయ్యాయని తద్వారా పాత 100, 50 రూపాయల నోట్లను ఇక రద్దుచేసినట్లేనన్నట్లుగా జనం మాట్లాడసాగారు. 200 రూపాయల నోట్లు రెండు రోజుల క్రితం బహిరంగ మార్కెట్‌లోకి విడుదల చేసిన ఆర్‌బీఐ వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందించకుండా ఇంత ఆకస్మాత్తుగా రద్దు చేస్తున్నారంటూ వారు ఆవేశంగా మాట్లాడుకోవడం కన్పించింది. మంగళవారం ఉదయం కొందరు బ్యాంకులకు సైతం వెళ్లి దీనిపై ఆరాతీయడం కన్పించింది. దీంతో బ్యాంక్ అధికారులు తమకు అటువంటి సమాచారం లేదని ఇప్పటివరకు ఆ పాత నోట్లు చలామణిలోనే ఉన్నాయని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. మరి కొంద రైతే ఇవేమీ పట్టించుకోకుండా 100.. 50 రూపాయల నోట్లను బ్యాంక్‌లో డిపాజిట్ చేయడం జరిగింది. తీరా చూస్తే ఎవరో ఆకతాయిలు వాట్సాప్‌లో అబద్ధ ప్రచారం చేశారని గతంలో 500, 1000 రూపాయల నోట్ల రద్దు సమయంలో టీవీలలో ప్రచారమైనా క్లిపింగ్‌లు 500 నుంచి ఒక సున్నాను.. 1000లో నుంచి ఒక సున్నాను తొలగించి, దానిని వాట్సాప్‌లలో పెట్టి జనాన్ని గందరగోళం పరిచారని తేలింది.



ఖాతాదారులతో కిటకిటలాడుతున్న బ్యాంక్

రాపూరులో కలకలం

● పోలీసు స్టేషన్ ఆవరణలో పేలుడు
● రెండు పందులు మృతి
● బాంబు కాదు.. బాణసంచా

రాపూరు: రాపూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం మందుగుండు సామగ్రి పేలుడు కలకలం సృష్టించింది. అర గంట వ్యవధిలో రెండు సార్లు పెద్ద శబ్దంతో పేలుళ్లు జరగడంతో పట్టణ వాసులు భయాందోళన చెందారు. పట్టణ ప్రధానవీధిలో ఒక్కసారిగా బాంబు పేలుడు శబ్దం రావడంతో ఏం జరిగిందో తెలియక జనం పరుగులు తీశారు. వెంకటగిరి సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. రెండు రోజుల క్రితం వినాయక చవితి నిమజ్జనోత్సవాల్లో భాగంగా బాణసంచా పేలుళ్లు జరిగాయి. ఈ సందర్భంగా కొన్ని పేలని ఆకాశ జువ్వలు, ఔట్లును చెత్తకుండీల్లో పడేశారు. దీంతో పట్టణంలోని పందులు ఆ చెత్తకుండీల వద్దనున్న మందుగుండు సామగ్రిని కొరకడంతో ఒక్కసారిగే పేలుడు సంభవించి పంది తల భాగం (నోరు) పేలిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. ఇది జరిగిన 20 నిముషాల వ్యవధిలో అదేప్రాంతంలో మరో పంది పిల్ల సైతం ఇదేరీతిలో తీవ్రంగా గాయపడి కొద్దిసేపటికి మృతి చెందింది. సమాచారం అందుకున్న వెంకటగిరి సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పేలుడు జరిగిన తీరును, మందుగుండు సామగ్రిని పరిశీలించారు. చివరి వరకూ పోలీసులు సైతం నాటుబాంబు పేలిందనే అనుమానాలను వ్యక్తం చేశారు. దీంతో సమాచారాన్ని బాంబ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బందికి తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి బాణసంచా అని తేల్చడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



తనిఖీ చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

నాటుబాంబులంటూ కలకలం

కచేరి ప్రాంగణంలో సంభవించిన మందుగుండు సామగ్రి పేలుడు నాటుబాంబులు పేలాయంటూ కలకలం సృష్టించింది. పోలీస్ స్టేషన్ సమీపంలోనే బాంబులు పేలాయనే వార్త దావానంలా వ్యాపించింది. పెద్దసంఖ్యలో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణ నడిబొడ్డులో ఉన్న స్టేషన్ ప్రాంగణంలో ఈ సంఘటన జరగడంతో చుట్టుపక్కల దుకాణం దారులు భయాందోళన చెందారు.



పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు

బాలికపై తండ్రే కాదు...
మరో ముగ్గురి లైంగిక దాడి

● విలేఖర్ల సమావేశంలో సీఐ రత్తయ్య వెల్లడి



మాట్లాడుతున్న సీఐ రత్తయ్య, ఎస్ఐ రవినాయక్

నాయుడుపేటరూరల్ : కంటి పాపలా చూసుకోవాల్సిన తండ్రి తన కామదాహానికి కన్నకూతుర్నే బలి చేశాడు. ఇటీవల జరిగిన ఈ ఘటనపై నాయుడుపేట పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కాగా ఆ బాలికను తండ్రే కాకుండా మరో ముగ్గురు లైంగిక దాడి జరిపినట్లు పోలీసులు తెలిపారు. నాయుడుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సీఐ రత్తయ్య, ఎస్సై రవినాయక్ నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. నాయుడుపేట మండలం మేనకూరు గిరిజన కాలనీకి చెందిన బాలికపై ఆమె కన్నతండ్రి లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పారు. అతను రెండో భార్య సుబ్బమ్మతో విడిపోయి కూతురితో మేనకూరులో జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కన్న కూతురిపై లైంగికదాడి చేశాడన్నారు.

అదే కాలనీకి చెందిన బండి శ్రీను, జడల చిన్నయ్య, ఈగా శ్రీను ఆ బాలికను బెదిరించి ఒకరికి తెలియకుండా మరొకరు లైంగికదాడికి పాల్పడ్డారని చెప్పారు. బాలిక తీవ్ర కడుపునొప్పితో కన్నతల్లి సుబ్బమ్మ వద్దకు వెళ్లగా ఆమె ఓజిలి మండలం వజ్జవారిపాళెంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా అక్కడి వైద్యులు గర్భిణిగా నిర్ధారించారన్నారు. ఆమేర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు తెలిపారు. గూడూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ పర్యవేక్షణలో నిందితులను నాయుడుపేట ఆర్టీసీ బ స్టాండ్ వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంలో ఏఎస్ఐ కె. శంకర్‌రాజు, హెడ్ కానిస్టేబుల్ కరీంసాహెబ్, సాబ్జాన్, కానిస్టేబుళ్లు కేపీ నరసయ్య, పి. మనోహర్, వై. విజయకుమార్, వెంకటేష్ సహకరించినట్లు సీఐ రత్తయ్య తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన మినీ లారీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్

బైక్‌ను ఢీకొన్న మినీ లారీ

● ఇద్దరు ఆంధ్రజ్యోతి సిబ్బందికి గాయాలు

గూడూరు (టౌన్) : గూడూరు పట్టణ శివార్లలోని తాళమ్మ దేవాలయం సమీపంలో మంగళవారం వేకువజామున ఓ మినీ లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆంధ్రజ్యోతిలో పని చేస్తున్న నూతన్, తాతయ్య అనే ఇద్దరు సిబ్బందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వాకాడుకు చెందిన నూతన్, తిరుపతికి చెందిన తాతయ్యలు నెల్లూరులోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో సోమవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై గూడూరు బయలుదేరారు. మార్గమధ్యంలోని తాళమ్మ ఆలయం వద్ద డంపింగ్ యార్డు సమీపంలో గేదెల లోడుతో నెల్లూరు వైపు వస్తున్న మినీ లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో నూతన్, తాతయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో వీరిని గూడూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి నెల్లూరులోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి నుంచి తాతయ్యను మాత్రం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



తిరుపతిలో చికిత్స పొందుతున్న తాతయ్య

బైక్‌ను ఢీకొన్న లారీ

● వెటర్నరీ ఉద్యోగి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని పశు వైద్యశాల సమీపంలో మంగళవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో వెటర్నరీ ఉద్యోగి మృతి చెందాడు. సంగం మండలంలోని సిద్ధీపురంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎర్రకోట మస్తానయ్య(59) నెల్లూరులో నివాసముంటూ ప్రతి రోజూ ఉద్యోగం నిమిత్తం సిద్ధీపురానికి వెళుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నెల్లూరు నుంచి బుచ్చికి వచ్చి దువ్వూరు వెటర్నరీ ఉద్యోగి కోటేశ్వరరావు బైక్‌పై విధులకు బయలుదేరారు. మస్తానయ్య బైక్ నడుపుతుండగా కోటేశ్వరరావు వెనుక కూర్చొని ఉన్నాడు. బుచ్చిరెడ్డిపాళెంలోని పశువుల ఆసుపత్రి సెంటర్ వద్ద నెల్లూరు నుంచి సంగం వైపు వెళుతున్న ఏపీ02టీబీ1142 నంబరు గల లారీ వీరి బైక్‌ను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మస్తానయ్య శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. కోటేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకొన్న ఎస్ఐ నాగశివారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మస్తానయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమాదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నెల్లూరు (రూరల్) : నెల్లూరు - పొదలకూరు రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే మండల కేంద్రం అనంతసాగరం వాసి మహేష్ (23) నెల్లూరులోని తడికల బజారులో తాత్కాలికంగా నివాసం ఉంటున్నాడు. ఆయన సెల్‌టవర్ల వద్ద టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పొదలకూరు నుంచి నెల్లూరుకు స్కూటర్‌పై వస్తున్న ఆయనను వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవరూ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహేష్



వేసిన ఆరు నెలలకు అడ్డంగా పగుళ్లిచ్చిన సిమెంట్‌రోడ్డు

నాణ్యతకు తిలోదకాలు

సిమెంట్ రోడ్లంటే పది కాలాలపాటు పటిష్టంగా ఉంటాయనేది నమ్మకం. ప్రస్తుతం కాలం మారిపోయింది. నిర్మాణ పనులు జరుగుతుండగానే రోడ్లు నెర్రెలు బారుతున్నాయి. సిమెంటు రోడ్డు పనుల్లో ప్రతిపాదనల దశనుంచి, క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు, బిల్లులు చెల్లింపు వరకు అడుగడుగునా ముడుపులు ముట్టజెప్పాల్సి రావడం, వారికి ఇచ్చింది పోను తమకు మిగలాల్సిన మొత్తాన్ని ముందుగానే బేరీజు వేసుకుని, అందుకు అనుగుణంగా పనులు చేస్తున్నారు. ఫలితంగా పనుల్లో నాణ్యత లోపించి, రోడ్లు వేసిన మూన్నాళ్లకే పగుళ్లిచ్చి, రాళ్లుతేలి అధ్వానంగా మారుతున్నాయి ఇదీ.. నియోజకవర్గంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణాల్లో సాగుతున్న తంతు. - ఉదయగిరి రూరల్

- సిమెంటు రోడ్డు పనుల్లో ముడుపుల జాతర
- కొద్ది కాలానికే పగుళ్లు
- పట్టించుకోని అధికారులు



రోడ్లకు వాడుతున్న నాసిరకం ఇసుక

2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉదయగిరి సబ్ డివిజన్‌లోని సీతారామపురం, వింజమూరు, వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో రూ.19.11 కోట్లతో 57.98 కిలోమీటర్ల సిమెంటు రోడ్ల ఏర్పాటుకు 400 పనులు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటివరకు రూ. 7.15 కోట్ల వ్యయంతో 26.13 కిలోమీటర్ల పొడవైన 151 పనులు పూర్తి చేశారు. దుత్తలూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో రూ.30 కోట్లతో 40 కిలోమీటర్ల రోడ్లు మంజూరు కాగా, కేవలం రూ.7.5 కోట్లతో 21 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే పూర్తయ్యాయి

అడుగడుగునా పర్సంటేజీ

పంచాయతీరాజ్‌లో ప్రతి పనికి పర్సంటేజీ ఇవ్వాల్సిందే. ప్రతి పనికీ అంచనా మొత్తంలో 10 శాతం పంచాయతీరాజ్ అధికారులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ పది శాతం మొత్తం కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు చెల్లించాల్సి ఉంటుంది. రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత తనిఖీల నిమిత్తం వచ్చే క్వాలిటీ కంట్రోల్ అధికారులకు కారు బాడుగతోపాటు, అదనంగా ఖర్చులు చెల్లించాల్సి ఉందని కాంట్రాక్టర్లు బహిరంగంగా చెబుతున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

ప్రభుత్వ నిబంధనల మేరకు 50 శాతం ఉపాధి, 50 పంచాయతీరాజ్ నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. కానీ పంచాయతీల్లో 14వ ఆర్థిక సంఘం నిధులు కొరవవడంతో సిమెంట్ రోడ్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పంచాయతీలకు వచ్చే నిధులు ఇతర ఖర్చులకే సరిపోతుండడంతో ఇక సిమెంట్‌రోడ్ల నిర్మాణాలకు ఎక్కడ నుంచి తీసుకురావాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం 2 వేల జనాభా పంచాయతీల్లో ఉన్న 90-10 శాతం, 3 వేల జనాభా ఉన్న పంచాయతీలో 70-30 శాతంతో పనులు చేపట్టాలని జీవో జారీ చేసింది. కానీ అది ఇంకా పూర్తిగా అమలు కాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. కొన్ని పంచాయతీల్లో అధికారులు కుమ్మక్కై ఉపాధి హామీ నిధులతో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిసింది.

పనులు చేసేదిలా...

రోడ్డు ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని చదును చేసి, ప్రతిపాదించిన ఇసుక, సిమెంట్, కంకరతో ఏడు అంగుళాల మందంతో సిమెంట్ రోడ్డు వేయాలి. ఒక బస్తా సిమెంట్‌కు 20 ఎంఎం కంకర నాలుగు గమాళ్లు, 12 ఎంఎం కంకర రెండు, ఇసుక నాలుగు గమాళ్లు వేయాలి. కానీ, ఈ నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. నాసిరకం ఇసుక, కంకర వాడుతున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు రోడ్డు పనుల పర్యవేక్షణకు అవగాహన లేని వారిని నియమిస్తుండడంతో కాంట్రాక్టర్లు సిమెంట్ తక్కువ, ఇసుక ఎక్కువ వేస్తుండడంతో పనుల్లో నాణ్యత లోపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వేసిన క్యూరింగ్ సరిగా చేయకపోవడం, రోడ్లకిరువైపులా మట్టిని తోలకపోవడంతో, కొంత కాలానికే రోడ్లు ఛిద్రమవుతున్నాయి. తారు రోడ్డు కంటే సిమెంట్‌రోడ్డు ఎక్కువ కాలం మన్నుతుందని ప్రభుత్వం సైతం పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నా, అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో అవి మూణ్నాళ్లకే దెబ్బతింటున్నాయి.



మధ్యలో ఎత్తుగా మట్టిపోసి ఏర్పాటు చేస్తున్న సిమెంట్‌రోడ్డు

రోడ్డుకు ఆ చివర, ఈ చివరన లోతుగా తవ్వి మధ్య భాగంలో మట్టి ఎత్తుగా వేశారు. దీంతో, రోడ్డు చివర్లను పరిశీలిస్తే ఏడు అంగుళాల మందం ఉన్నట్లు కనిపిస్తుంది. మధ్యలో మాత్రం తక్కువ మందం ఉంటుంది. ఆ మేరకు మెటీరియల్ ఖర్చు కాంట్రాక్టర్‌కు మిగులుతుంది.



పనులు పూర్తైన నాలుగు నెలలకే కంకర తేలిన రోడ్డు

సీతారామపురం మండలంలోని ఈ రోడ్డు వేసి నాలుగైదు నెలలు మాత్రమే కావస్తోంది. అప్పుడే కంకర తేలి, గుంతలమయమవుతోంది. ఇలాంటి నాసిరకం రోడ్లు ఆ మండలంలో చాలానే దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు తిరిగే రోడ్డు సైతం దెబ్బతినడంపై అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఇలా నాసిరకం రోడ్లు నిర్మించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అవినీతికి పాల్పడితే డిస్మిస్సే

● కలెక్టర్ ముత్యాలరాజు



సమీక్షిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

వాకాడు: అవినీతికి పాల్పడితే ఏ శాఖ అధికారైనా డిస్మిస్సేనని కలెక్టర్ రేవు ముత్యాలరాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి నెల రోజులుగా జరుగుతున్న రెవెన్యూ రికార్డుల సవరణపై తహసీల్దారు లావణ్య, వీఆర్వోలతో సమీక్షించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గట్టి ఆదేశాలు ఉన్నాయని అవినీతికి పాల్పడిన ఏ శాఖ అధికారినైనా సస్పెండ్ కాదు ఏకంగా ఉద్యోగం నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రికార్డుల సవరణ డిసెంబరు 31 కల్లా పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకెళుతున్నామని, ఆ దిశగా జిల్లాలోని 5 డివిజన్‌లలో గూడూరు డివిజన్ మొదటిస్థానంలో ఉందన్నారు. రికార్డుల సవరణ పూర్తియిన తర్వాత జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వం పేదవారికి ఇచ్చిన సీజేఎస్ఎఫ్ భూములు, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భుములపై సర్వే నిర్వహించి, ఆక్రమణలకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. గృహ నిర్మాణాలకు ఇసుక పెద్ద సమస్యగా ఉందన్న కారణంతో ఎక్కడి నుంచైనా గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇసుక ఉచితంగా తరలించుకోవచ్చునన్నారు. కాంట్రాక్ట్ పనులకు, ప్రైవేటు పరిశ్రమలకు మాత్రం తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. అలాగే ఇసుక డంపులు సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబు, ఎంపీడీవో ప్రమీలరాణి పాల్గొన్నారు.

'నవరత్నాల' సభకు విష్ణు, వంటేరు డుమ్మా

● సభకు ఎమ్మెల్యే ప్రతాప్ ఆధ్వర్యం ● ఆద్యంతం స్వోత్కర్ష.. పరనింద



సభకు వస్తున్న ఎంపీ మేకపాటి, ఎమ్మెల్యేలు కాకాణి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

కావలి: వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు హామీల కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం కావలి ఆర్ఎస్ఆర్ కల్యాణమండపంలో సభ జరిగింది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి డుమ్మా కొట్టడం చర్చినీయాంశమైంది. ఆ ఇద్దరి నేతలకూ స్వాగత ఫ్లెక్సీలు కూడా కట్టారు. వారిద్దరు గైర్హాజరు వైసీపీలో విభేదాలను మరో సారి వెలికితెచ్చింది. సభలో నేతలు మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని దుర్వినియోగం చేసి, నల్లధనాన్ని ఓటర్లకు పంచి గెలుపొందడం నిజమైన గెలుపు కాదన్నారు. సీఎం, టీడీపీపై విమర్శలు గుప్పించారు. 2019 ఎన్నికలకు వైఎస్ జగన్ ప్రవేశపెడుతున్న నవ్యాంధ్రకు నవరత్నాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలను మరచిన విషయాన్ని గుర్తు చేస్తూ ఇంటింటా ప్రచారాన్ని చేయాలన్నారు.

'ఉపాధి'లో రూ.13.74 లక్షలు స్వాహా



విచారణ జరుపుతున్న డ్వామా ఏపీడీ నాసర్‌రెడ్డి

కలువాయి: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.13.74లక్షలు అవినీతి జరిగినట్లు డ్వామా అధికారులు వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2016 మే 1 నుంచి 2017 మే 31 వరకు జరిగిన రూ.5.44 కోట్లతో నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు అందజేసిన నివేదికపై డ్వామా ఏపీడీ నాసర్‌రెడ్డి ఉపాధి సిబ్బందిని విచారించారు. సామాజిక తనిఖీ బృందాల వారు అందజేసిన నివేదికల ఆధారంగా రూ.13.74లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారులు పనులకు సంబంధించి రికార్డులు అందజేయలేదని, ఆ పనులకు సంబంధించి రూ.3.14లక్షలు, రూ.7.11లక్షలు విలువైన నాలుగు పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ప్రధానంగా మాదన్నగారిపల్లె పంచాయతీలో రూ.3.90లక్షలు, చింతలపాళెంలో రూ.2.32లక్షలు రికవరీకి అదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసరావు, క్వాలిటీ కంట్రోలు అధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి

● తూపిలి తీరంలో యువకుడి గల్లంతు



వేణుగోపాల్(ఫైల్)

వాకాడు: తూపిలి పాళెం తీరంలో గణేష్ నిమజ్జనంలో ఉత్సాహంగా పాల్గొన్న ఓ యువకుడు గల్లంతయ్యాడు. చిల్లకూరు మండలం పున్నపువారిపాళెం దళితవాడకు చెందిన కొత్తపల్లి వేణుగోపాల్(20) తన స్నేహితులతో కలసి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు తూపిలిపాళెం చేరుకున్నారు. నిమజ్జనం అనంతరం అందరూ సముద్రంలో మునుగుతుండగా అలల తాకిడికి వేణుగోపాల్ మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు పక్కనే ఉన్న పోలీసులకు సమాచారం అందించడంతో వారు గజఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టారు. కానీ అతని ఆచూకీ లభించలేదు.

● టీజీపీ రాపూరు సర్కిల్‌లో అక్రమాలు? ● ఇష్టానుసారంగా 'కండలేరు' ముంపు పరిహారం ● లోటుపాట్లపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు

● విచారించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశం ● ప్రస్తుతం రూ.2కోట్ల పంపిణీకి బ్రేక్

పరిహారం.. పరిహాసం



తెలుగు గంగ ప్రాజెక్ట్ (టీజీపీ) రాపూరు సర్కిల్‌లో రైతుల పరిహారంలో అక్రమాలు జరిగాయా? దానిమ్మ చెట్ల పేరుతో పలువురు రైతులు ప్రభుత్వం నుంచి భారీగా లబ్ధి పొందారా? ఇందుకు అధికారులు కూడా సహకరించారా? అంటే ఎన్నో సందేహాత్మక సమాధానాలు వినిపిస్తున్నాయి. కండలేరు డ్యాం నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇచ్చింది. అయితే, ఎక్కువ పరిహారం వస్తుందన్న ఉద్దేశంతో పలువురు రైతులు అప్పటికప్పుడు దానిమ్మ మొలకలు తెచ్చి నాటి, భారీగా పరిహారం పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై అప్పట్లోనే ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించగా, ఇంకా ఈ కేసు నడుస్తోంది. అయితే, దానిమ్మ చెట్లకు పరిహారం అందని కొందరు రైతులు కోర్టు మెట్లు ఎక్కారు. కోర్టు ఆదేశాల ప్రకారం మిగిలిన వారికి కూడా పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. ఈ నేపథ్యంలో గతేడాది విడుదలైన సుమారు రూ.8 కోట్లను రైతులకు పంపిణీ చేశారు. కాగా మరో రూ.2 కోట్లను ప్రభుత్వం ఇటీవల విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. అయితే, ఇదే సమయంలో గతంలో పంపిణీ చేసిన పరిహారంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ వ్యవహారంపై విచారణ జరపాల్సిందిగా ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం పంపిణీ చేయాల్సిన రూ.2 కోట్ల పరిహారాన్ని నిలిపి ముందు విచారణ చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. విచారణాధికారిగా తెలుగు గంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ ప్రశాంతిని నియమించారు. కాగా విచారణ ప్రారంభించిన ఆమె ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారని సమాచారం. ఈ నేపథ్యంలో పూర్తి విచారణ జరిపే వరకూ పరిహారాన్ని పంపిణీ చేయలేమని రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించడంతో పాటు కోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. **- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)**

● మొక్కల మాటున అక్రమాలు?

బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో 1983లో ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 68 టీఎంసీల సామర్థ్యంతో కండలేరు డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాపూరు, కలువాయి, పొదలకూరు మండలాల్లో 23 గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. అదేవిధంగా పంట భూములకు కూడా అప్పటి విలువను బట్టి పరిహారం పంపిణీ చేయడం ప్రారంభించారు. ఈ రెండు ప్రక్రియలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వీటిల్లో భారీగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నట్లు మొదటి నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ భూముల్లో ఉన్న పంటను కూడా లెక్కించి దానికి కూడా పరిహారం ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పలువురు బడా రైతు లు, రాజకీయ నాయకులు, అధికారులు అక్రమాలకు తెరతీసినట్లు విమర్శలు ఉన్నాయి. ఇందులో భాగంగా కొంత భూమిలో దానిమ్మ మొక్కలు నాటినట్లు తెలుస్తోంది. ఈ తోటలు ఉన్నట్లయితే భారీగా పరిహారం పొందవచ్చన్న ఉద్దేశంతో చిన్న మొక్కలను తెచ్చి పొలాల్లో నాటి పెద్ద తోటలు ఉన్నట్లు అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించి భారీ అవినీతికి తెరలేపినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో చాలా మంది ప్రభుత్వ పరిహారాన్ని పొందేశారు. అయితే ఇలా ప్రయత్నించిన ఇంకొంత మందికి మాత్రం వివాదాల నేపథ్యంలో పరిహారం అందలేదు. వీరు కోర్టు ద్వారా ఇటీవల పరిహారం చెల్లించేలా ఆదేశాలు తెచ్చుకున్నారు. ఇలా సుమారు రెండు దశాబ్దాలు గడిచింది. ఈ మధ్య లో సీబీసీఐడీ కేసు కూడా ఈ వ్యవహారంలో నడుస్తోంది. ఇటువంటి సమయంలో ఏ ప్రాతిపాదికన పరిహారం పంపిణీ చేశారు? సీబీసీఐడీ కేసు పూర్తి కాకుండా ఎలా పంపిణీ చేశారు? అన్నది అనుమానాలకు తావిస్తోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలను కోర్టు కు, ప్రభుత్వానికి గతంలో అధికారులు సరిగ్గా వివరించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో వారి పాత్ర కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది విడుదలైన సుమారు రూ.8 కోట్లను రైతులకు పంపిణీ చేశారు. ఇటీవల విడుదలైన రూ.2 కోట్ల పరిహారాన్ని పంపిణీ చేయకుండా ప్రస్తుత కలెక్టర్ ముత్యాలరాజు, టీజీపీ స్పెషల్ కలెక్టర్ ప్రశా ంతి ముందు విచారణకు పూనుకోవడం చూస్తుంటే గతంలో అక్రమాలు జరిగాయన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. ఏది ఏమైనా దానిమ్మ చెట్లకు పరిహారంపై ప్రస్తు తం స్పెషల్ కలెక్టర్ స్థాయిలో విచారణ ప్రారంభమవడం ఆయా వర్గాలను కలవరపెడుతోంది. ప్రాథమిక నివేదిక సమర్పించిన అనంతరం మరింత లోతుగా విచారణ జరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో సీబీసీఐడీ నుంచి కూడా రికార్డులు తెప్పించుకుంటున్నారు. మొద ట్లో అసలు ఏం జరిగింది? ఆ తర్వాత ఇప్పటి వరకూ ఎటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి? పరిహారం పంపిణీ ఎలా జరిగింది? అన్న విషయాలపై ప్రస్తుతం రికార్డులను పరిశీలిస్తున్నారు. విచారణ పూర్తయితే పలు అక్రమాలు బట్టబయలయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

> కండలేరు డ్యాం ముంపు భూముల్లో దానిమ్మ చెట్లకు సంబంధించిన పరిహారం పంపిణీపై విచారిస్తున్నాం కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో పంపిణీ చేసిన విధానంపై కూడా దృష్టి సారించాం. ఆ వ్యవహారానికి సంబంధించి సీబీసీఐడీ కేసు నడుస్తుండటంతో అది పూర్తయ్యే వరకు ప్రస్తుతం విడుదలైన రూ.2 కోట్లను పంపిణీ చేయలేమని ప్రభుత్వానికి, కోర్టుకు నివేదించనున్నాం. సీబీసీఐడీ నుంచి కూడా రికార్డులు తెప్పించుకుంటున్నాం. విచారణ పూర్తయితే నిజనిజాలు వెలుగులోకి వస్తాయి.
>
> **- ప్రశాంతి,**
> **టీజీపీ స్పెషల్ కలెక్టర్**

రెండు, మూడు రోజుల్లో ప్రాథమిక నివేదిక

పశు వైద్యుల సంఘం
జిల్లా అధ్యక్షుడిగా వసంతరాయులు



నూతన కమిటీని అభినందిస్తున్న జేడీ

నెల్లూరు (వ్యవసాయం) : పశుసంవర్ధక శాఖ వైద్యుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఆర్ వసంతరాయులు విజయం సాధించారు. ఆ సంఘం ఎన్నికలు మంగళవారం నెల్లూరులోని జేడీ కార్యాలయ ప్రాంగణంలో జరిగాయి. ఉదయ చైతన్యపై వసంతరాయులు 73 ఓట్లతో గెలుపొందారు. అనంతరం కార్యదర్శిగా సీవీ రెడ్డి, కోశాధికారిగా సుబ్బానాయుడు, ఐదుగురు సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పశుసంవర్ధక శాఖ ఏడీఈలు జయచంద్ర, మురళీకృష్ణ వ్యవహరించారు. అనంతరం అధికారులతో జేడీ రవీంద్రనాథ్ ఠాగూర్ సమీక్షించారు. నూతన కమిటీని అభినందించారు. పశుసంవర్ధక శాఖలో వృద్ధి రేటు పెరుగుదలకు దోహదపడాలని కోరారు. మంగళవారం ఉదయం నుంచి ఉత్కంఠ రేపిన ఈ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీసు కస్టడీకి క్రికెట్ బుకీ కృష్ణసింగ్

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుల్లో ప్రధాన నిందితుడు జాతీయ బుకీ కృష్ణసింగ్‌ను మరోసారి పోలీసు కస్టడీకి తీసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. కృష్ణసింగ్‌తోపాటు ఉట్టుకూరు వెంకట రమేష్ అలియాస్ డీటీఎస్ రమేష్ కూడా తమ కస్టడీకి తీసు కునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కావలి పోలీసులు నలుగురు ప్రధాన బుకీలపై నమోదు చేసి కేసులన్నీ నెల్లూరు కోర్టుకు బదలాయించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఆ నలుగురిని కూడా మరోసారి పోలీసు కస్టడీకి తీసు కునేందుకు కోర్టుకు పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు సేకరించిన సమాచారాన్ని మరోసారి ఈ ప్రధాన బుకీల నుంచి వివరాలు తీసుకుని మరి కొందరిపై కేసులు పెట్టి అరెస్టు చేయనున్నారు. అలాగే నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్‌ను మరో మారు విచారించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఆయన ప్రధాన అనుచరుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ యాదవ్‌ను ఇప్పటికే విచారించిన పోలీసులు కొన్ని సాక్ష్యాలు సేకరించారు.

● పోలీసు కస్టడీకి అప్పగించండి

ఈనెల 3న జాతీయ బుకీలు దేవళం కృష్ణసింగ్‌తోపాటు మరో ఎనిమిది మందిని నెల్లూరు, కావలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన సంగతి తెలిసిందే. అంతకుముందే వీరిని అదుపులోకి తీసుకుని అన్ని విధాలా పోలీసులు బెట్టింగ్‌ల వ్యవహారంపై పూర్తి వివరాలు రాబట్టిన సంగతి తెలి సిందే. వీరు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా వ్యాప్తంగా సబ్ బుకీలు, పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లు సుమారు 300 మంది వరకు పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, బెట్టింగ్ సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు నాయకుల పేర్లు కూడా ప్రస్తావనకు రావడంతో వారిని కూడా విచారించేందుకు 160 సీఆర్‌పీఎస్ నోటీసులు జారీ చేసి నెల్లూరు సిటీ, రూరల్ వైసీపీ ఎమ్మెల్యేలు అనిల్, కోటంరెడ్డిలను విచారించారు. ముందుగానే రూపొందించు కున్న ప్రశ్నావళి ప్రకారం వీరి నుంచి సమాధానాలు రాబ ట్టారు. అంతకుముందే ఈనెల 11న ప్రధాన బుకీ కృష్ణ సింగ్‌తో పాటు మరో నలుగురు ప్రధాన బుకీలను పోలీసు కస్టడీకి తీసుకుని మూడురోజుల పాటు విచారించి కొంత సమాచారం సేకరించారు. ఆ తరువాత ఈ నెల 17న కావలి లో అరెస్టు అయిన మన్నెం శ్యాంప్రసాద్, మరో ముగ్గురు ప్రధాన బుకీలను ఒక రోజుపాటు విచారించి తిరిగి కోర్టులో హాజరుపరిచారు. జిల్లావ్యాప్తంగా అరెస్టయిన బుకీలను ప్రజా ప్రతినిధుల నుంచి సేకరించిన సమాచా రాన్ని మరోసారి క్రోడీకరించేందుకు మరోసారి ప్రధాన బుకీలను విచారించా లని పోలీసులు నిర్ణయించారు. ఈ మేరకు కోర్టులో పిటిషన్ వేసి నెల్లూరు పోలీసులు అరెస్టు చేసిన దేవళం కృష్ణసింగ్, ఉట్టుకూరు వెంకట రమేష్, డీటీఎస్ రమేష్‌లను మాత్రమే పోలీసు కస్టడీకి తీసుకునే విధంగా కోర్టును కోరారు. బుధ వారం కోర్టు ఈ అభ్యర్థను పరిశీలించి పోలీసు కస్టడీకి వీరిద్దరిని ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకుంటుందని సమాచారం. 15 రోజులపాటు పోలీసు కస్టడీకి వీరిద్దరిని అప్పగించాలని దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

త్వరలో సిటీ ఎమ్మెల్యే అనిల్ విచారణ

తొలి విడత విచారణకు హాజరైన సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఈనెల 27న జరిగే రెండో విడత విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్‌యాదవ్‌ను విచారించిన తరువాత ఎమ్మెల్యే అనిల్‌ను విచారించాలని పోలీసులు నిర్ణయించి తాత్కాలికంగా రెండో విడత విచారణ వాయిదా వేశారు. సోమవారం రూప్ కుమార్‌ను విచా రించిన పోలీసులు కృష్ణసింగ్ నుంచి రూ. 5 లక్షలు తీసుకో వడంపై ప్రశ్నించారు. తన ఎన్నికల కోసం ఆ సొమ్ము తీసు కున్నట్లు రూప్‌కుమార్ ఒప్పుకోవటం ఆ మేరకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. రూప్ ఇచ్చిన సమా చారంతోపాటు ఇతర వర్గాల నుంచి మరి కొంత సమా చారం సేకరించడం రెండో విడత విచారించనున్న కృష్ణసింగ్ నుంచి సేకరించే సమాచారం అన్నింటిని కలిపి మరో నాలుగు రోజుల్లో ఎమ్మెల్యే అనిల్‌ను రెండో విడత విచారణ చేపట్టి పలు వివరాలపై సమా ధానాలు రాబట్ట నున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. పక్కా సమాచారంతో అడుగులేస్తోన్న పోలీసులు ఈ విచారణలు ముగిసిన తరువాత ఇందులో భాగస్వామ్యం ఉన్న కొం దరి ప్రజా ప్రతినిధులపై కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

కావలి ప్రధాన బుకీల కేసు నెల్లూరు కోర్టుకు

కావలి పోలీసులు అరెస్టు చేసిన మన్నెం శ్యాంప్రసాద్, మరో ముగ్గురి కేసులను ప్రస్తుతం కావలి కోర్టులో నడుస్తుండగా ఆ కేసులన్నీ నెల్లూ రు కోర్టు పరిధిలోకి తెచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఒక రోజు విచారణతో సరిపెట్టిన మన్నెం శ్యాంప్రసాద్, మరో ముగ్గురిని రెండోసారి పోలీసు కస్టడీకి తీసుకునేందుకు కోర్టు లో పిటిషన్ వేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లోగా ఈ నలుగురిని కూడా పోలీసు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. ఈ కేసుల్లో రెండో విడత పోలీసు కస్టడీ విచారణ ఎంతో కీలకంగా మారుతుందన్నది సమాచారం.

సోమశిలకు జలకళ

జిల్లా రైతన్నల జీవనాడిగా ఉన్న సోమశిల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరుగుతోంది. గత ఏడాది కన్నా ఈ సారి ఇన్‌ఫ్లో, నీటి నిల్వ మెరుగ్గా ఉండడంతో పెన్నా డెల్టా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం కన్నా 98.2 శాతం అధికంగా వర్షం కురవడంతో భూగర్భ జలాలు కాస్త పెరిగాయి. కాని చెరువులు, కుంటల్లో మాత్రం నీరు కనిపించటం లేదు. సోమశిల ప్రాజెక్టు కింద ఈ రబీలో 5 లక్షల ఎకరాల వరకు తొలి పంట కింద సాగు చేస్తారు. అక్టోబరు నుంచి మొదలయ్యే వరినార్లకు సరిపడే నీరు చేరుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇదే విధంగా వర్షాలు కురిస్తే మూడేళ్ల నాటి కరువు ఛాయలు తొలగి జిల్లా అంతటా పంటలు సాగవుతాయని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

5 లక్షల ఎకరాల సాగు

సోమశిల ప్రాజెక్టు కింద రబీ (తొలి పంట) లో 5 లక్షల ఎకరాల వరకు రైతన్నలు వరి సాగు చేస్తారు. ఇందులో పెన్నాడెల్టా, కనుపూరు, కావలి, నార్త్, సౌత్ ఫీడర్ల ఛానల్ల కింద సాగు చేయాలంటే కనీసం 58 టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. గత ఏడాది రబీలో 4.32 లక్షల ఎకరాల వరకు మాత్రమే సాగునీరు పారించాలని నిర్ణయించారు. నవంబరు 8న జరిగిన ఐఏబీ సమావేశం నాటికి సోమశిల ప్రాజెక్టులో 40 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో తదితర వాటిని లెక్కించి 50 టీఎంసీల వరకు నీరు అందుబాటులో ఉంటుందని ఆనాటి ఐఏబీలో తీర్మానించి 4.32 లక్షల ఎకరాలను సాగు చేయాలని రైతులను కోరారు. ఏదో విధంగా నీటి యాజమాన్య పద్ధతులు పాటించి ఎట్టకేలకు పెట్టిన ప్రతీ ఎకరాను పండించి రైతన్నలను గట్టెక్కించారు. రెండో పంట సమయానికి సోమశిలలో పది టీఎంసీలు కూడా నీరు నిల్వ లేకపోవడంతో క్రాప్ హాలిడే ప్రకటించారు. ఇక తొలి పంట సాగుకు సెప్టెంబరు ఆఖరు నుంచి అక్టోబరు వరకు నారు మళ్లు సిద్ధం చేసుకుని నార్లు పోసి ఆ తరువాత నవంబరు నుంచి వరినాట్లు వేయాల్సి ఉంది. ఇదే సీజన్‌లో వరి పంట సాగు చేస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నది రైతుల నమ్మకం. ఇదే విధంగా ఇప్పటి వరకు పెన్నాడెల్టాలో వరి పంట సాగు చేస్తూ వస్తున్నారు.

పెరుగుతున్న ఇన్‌ఫ్లో

జూన్‌లో నైరుతి జిల్లాను పలకరించినా ఆశాజనకంగా వర్షాలు కురవకపోవడంతో ఆగస్టు 20వ తేదీ వరకు 30 శాతం లోటు వర్షపాతం కొనసాగింది. తిరిగి రుతు పవనాలు పుంజుకోవడంతో పెన్నా పరివాహక ప్రాంతమైన కడప జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పెన్నాలో వరద కొనసాగుతోంది. కడప జిల్లా చెన్నూరు గేటు వద్ద ఇన్‌ఫ్లో లెక్కించగా, ఈనెల 22న తొలిసారి 509 క్యూసెక్కుల నీరు సోమశిలకు వస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రవాహం రోజు రోజుకు పెరుగుతూ 24వతేదీన 4,269, 27న 23,601 క్యూసెక్కులకు చేరింది. సోమవారం 8,273, మంగళవారం 12,286 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. ఈనెల 22న 6.500 టీఎంసీల నీరు నిల్వ ఉండడంతో రైతన్నల్లో ఆందోళన మొదలైంది. ఈసారి కూడా రెండో పంట లాగే తొలి పంటకూ క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వస్తుందేమోనని భయపడుతూ వచ్చారు. ఈ వారం రోజుల్లో వస్తున్న ఇన్‌ఫ్లో



ప్రభావంతో 4.500 టీఎంసీల నీరు ఒక్కసారిగా సోమశిలకు చేరడం డెడ్ స్టోరేజ్ అధిగమించి ప్రస్తుతం 10.742 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదే గత ఏడాది ఇదే రోజు 570 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డెడ్ స్టోరేజ్ పరిధిలోని 7.440 టీఎంసీల నీరే నిల్వ ఉంది. గతం కన్నా ఈ సారి ఇన్‌ఫ్లో పెరగడం సోమశిలలో జలకళ సంతరించుకోవడం పెన్నాడెల్టా రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇదే విధంగా పెన్నా పరివాహక ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలకు మరింత ఇన్‌ఫ్లో పెరిగి సోమశిలలో నీటి సామర్థ్యం పెరిగితే తొలి పంట సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని రైతులు పేర్కొంటున్నారు. గత ఏడాది సెప్టెంబరులో 24 టీఎంసీలు, అక్టోబరులో 10 టీఎంసీలు సోమశిలకు చేరడం గత ఏడాది తొలి పంట గట్టెక్కింది.

ఇప్పటికీ 5 మండలాల్లో లోటు వర్షపాతం

జూన్‌లో మొదలయ్యే నైరుతి రుతు పవనాల ప్రభావంతో ఇప్పటి వరకు 223.6 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉంది. జూన్, జులైలో సాధారణ వర్షపాతం చేరుకోవడమే కష్టమైంది. ఒక్క ఆగస్టులో ఇప్పటి వరకు 159.7 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో 41 మండలాల్లో అధిక వర్షపాతం ఉంది. రాపూరు, బాలాయపల్లి, వాకాడు, పెళ్లకూరు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతం ఉన్నట్లు అధికారులు పేర్కొంటు న్నారు. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 86.1 మి.మీ కాగా, ఇప్పటి వరకు 159.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 98.2 శాతం అధిక వర్షపాతం జిల్లాలో ఉన్నట్లుగా గుర్తించారు. ఇక జిల్లాలో జూన్ నుంచి తీసుకుంటే అధిక వర్షపాతం 36.5 శాతం ఉంది. కురిసిన వర్షపాతం పరిశీలిస్తే జిల్లా సాధారణ వర్షపాతాన్ని అధిగమించినా ఇప్పటికి చెరువులు, కుంటలు నీరు లేక బోసిపోయి దర్శనమిస్తున్నాయి. కండలేరు, కలిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లతోపాటు చెరువులు, కుంటలు నీళ్ల లేక బోసిపోయి ఉన్నాయి. మూడేళ్లుగా వీడని వర్షాభావం వల్ల పడిన దినుకును భూమే తాగేస్తున్నట్లుగా ఉంది. దీంతో చెరువులు, కుంటలకు చేరే కాలువల్లో నీటి ప్రవాహం పెద్దగా కనిపించడం లేదు. చెరువుల్లో, కుంటల్లో నీరు లేకపోయినా భూగర్భ జలాలు మాత్రం పెరగడం కొంత వరకు నీటి సమస్య తీరినట్లే. ఇక కురిసే వర్షాలతో వాగులు, వంకలలో నీరు ప్రవహించి చెరువులకు నీరు చేరితే జిల్లా అంతటా వ్యవసాయం మొదలవుతుంది.

- (నెల్లూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఒక్క ఎకరా బీడుగా లేకుండా చూడాలి

● వ్యవసాయ శాఖ జేడీ చంద్రనాయక్

గూడూరు: ఒక్క ఎకరా పొలం కూడా బీడు లేకుండా సాగులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ జేడీ చంద్రనాయక్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గూడూరు, వెంకటగిరి సబ్ డివిజన్ల పరిధిలోని అధికారులు, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్నాయన్నారు. విస్తరణాధికారులు గ్రామాలకు వెళ్లి రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా చూడాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభం కావడంతో అధికారులు సాగుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసి రైతులకు వ్యవసాయ సాగులో మేలకువలు, అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన పెసర వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో కండలేరు నీటిని అధికారులు విడుదల చేయనున్నారన్నారు. దీంతో వ్యవసాయ సాగు విరివిగా చేపట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీలు శివనాయక్, ఉషారాణి, ఏవోలు నాగమోహన్‌రావు, వేణుగోపాల్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రానాయక్

నిబంధనలు తుస్..!

● యూరియా ధరకు రెక్కలు
● ఎమ్మార్పీ రూ.295, విక్రయం రూ.330
● దోపిడీకి గురవుతున్న రైతులు

వెంకటగిరి(టౌన్): ఎరువుల దుకాణాల యాజమాన్యం నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఒక బస్తా యూరియాపై రూ.35 అదనంగా విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఇంకా అదనపు ధరకు అమ్మకాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పది రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురించి ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతోన్నారు. ఈ క్రమంలో పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందుగానే సిద్ధం చేసుకోవడం రైతులకు పరిపాటి. ఈ విషయాన్ని పసిగట్టిన వ్యాపారులు యూరియా కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా యూరియా ఎమ్మార్పీ రూ.295 ఉండగా రూ.330కు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే ఇంకా పెరిగే అవకాశం ఉందని, ట్రాన్స్‌పోర్టు, లోడింగ్, అన్‌లోడింగ్‌కు మా చేతిది పడుతోందని, ఈ క్రమంలో అధిక ధరలకు విక్రయించక తప్పదని వ్యాపారులు అంటున్నట్లు రైతులు వాపోతున్నారు. కొన్ని దుకాణాల ఎదుట ధరల పట్టిక కూడా కనిపించడం లేదు. ఎరువులకు బిల్లు అడిగితే తెల్లకాగితంపై రాసి ఇస్తున్నారని వాపోతున్నారు. మరో వైపు పురుగు మందులు అధిక ధరలపై వ్యవసాయ శాఖ అధికారుల హెచ్చరికలను కూడా లెక్క చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పురుగు మందుల వ్యాపారులపై పర్యవేక్షణ ఉంచి ధరలు నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.



యూరియా

ధర పెంచేశారు. రసాయన ఎరువులు వినియోగించనిదే రైతులు ఏ పంట సాగు చేయరు. ఈ నేపథ్యంలో ఎరువుల కొనుగోలుకు రైతులు ముందుగానే దుకాణాలకు వెళుతున్నారు. ఇప్పటికే నీటి వసతి ఉన్న రైతులు ఈ ప్రాంతంలో దాదాపు ఐదు వందల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. పట్టణంలో లైసెన్సు కలిగిన 17 షాపులు, సొసైటీల పరిధిలో 3 షాపులు ఉన్నాయి. ఈ షాపుల్లో పురుగు మందులు

బిల్లులు ఇవ్వడం లేదు

పురుగు మందులు కొన్న షాపుల్లో బిల్లు ఇవ్వడం లేదు. బిల్లు అడిగితే పది శాతం ఎక్కువ పడుతుం దంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులు అడిగితే వేరే మందులు ఇస్తున్నారు.

- రవీంద్ర

భారంగా మారింది

యూరియా రూ.330 అంటే భారంగా ఉంది. వ్యవసాయంలో రసాయన ఎరువులు లేనిదే పని జరగని పరిస్థితి. అయితే కొన్ని షాపుల్లో మాత్రం యూరియాను రూ.295కే ఇస్తున్నారు.

- పోలయ్య

అధిక ధరలు విక్రయిస్తే చర్యలు

ప్రతి ఒక్కరూ ఎఫ్‌సీసీ ప్రకారమే పురుగు మందులు విక్రయించాలి. అధిక ధరలకు విక్రయిస్తే షాపు సీజ్ చేస్తాం. రైతు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకి బిల్లు ఇవ్వాలి. అధిక ధరలపై రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం.

- శిరీష, వ్యవసాయ శాఖ ఏవో

తెట్టుపేట వద్ద పులికాట్ ముఖద్వారం తెరిపిస్తా

● తిరుపతి ఎంపీ వరప్రసాద్

సూళ్లూరుపేట : నిర్వీర్యం అవుతున్న పులికాట్ సరస్సును కాపాడేందుకు తెట్టుపేట వద్ద సముద్ర ముఖద్వారం తెరిపిస్తానని తిరుపతి ఎంపీ వరప్రసాద్ వెల్లడించారు. సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పులికాట్ దుస్థితిని గతంలో ప్రధాని దృష్టికి తాను తీసుకెళ్లానన్నారు. దీంతో ఎన్‌ఐవోటీ సంస్థచే సర్వే కూడా జరిగిందన్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా పరిశీలన చేసిందన్నారు. ప్రస్తుతం నవాబుపేట వద్ద ముఖద్వారం పూడిక తీయించారని అయితే సముద్రజలాలు, అతి తక్కువగా పులికాట్‌కు ఈ ముఖద్వారం ద్వారా చేరుతున్నాయన్నారు. కేవలం 20శాతం నీరుమాత్రమే నవాబుపేట ముఖద్వారం నుంచి వస్తోందని గుర్తించారన్నారు. అదే తెట్టుపేట వద్ద ముఖద్వారం ఏర్పాటు చేస్తే సమృద్ధిగా పులికాట్‌కు నీరు చేరుతుందని నిర్ధయించబడిందన్నారు. ఇందుకోసం నిధులు పెద్ద ఎత్తున అవసరం అవుతున్నాయని చెప్పారు. అందుకే తాను శ్రీహరికోటకు వెళ్లి షార్ డైరెక్టర్, కంట్రోలర్‌తో చర్చించామని చెప్పారు. ముఖద్వారాల కోసం కొంతశాతం నిధులు షార్ నుంచి కేటాయిస్తామని వారు హామీ ఇచ్చారని ఎంపీ వెల్లడించారు.



మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ వరప్రసాద్

రూ.18 కోట్లతో వాకాడు నుంచి తీరప్రాంతరహదారి : తీర ప్రాంత ప్రజలు పట్టణవాసాలకు రావాలంటే అవస్థలు పడుతున్నారని అందుకే తాను వాకాడు నుంచి సూళ్లూరుపేటకు తీరప్రాంత రహదారి నిర్మింపచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వరప్రసాద్ వెల్లడించారు. చిన్నతోట, వంట్రాంగం, పేర్నాడు మీదుగా ఈ రోడ్డు నిర్మించేందుకు 18 కోట్లు వ్యయం అవుతుందని అన్నారు. ఇందుకు అంచనాలు వేయించానని చెప్పారు. ఈ రహదారి కూడా షార్ అధికారులు కొంత నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. పులికాట్‌లో ఈ రహదారి నిర్మాణం జరగాల్సి ఉండటంతో వన్యప్రాణి విభాగం ఆంక్షలు అడ్డు అవుతాయికదా అని ప్రశ్నించగా అదే పెద్ద సమస్య అంటూ ఎంపీ చెప్పారు. ఆ ఆంక్షలను తొలగింపచేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో వైసీపీ నేత వంకా రామాంజనేయులు, దొరవారి సత్రం మాజీ మండలాధ్యక్షుడు పిల్లి చెంగయ్య, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్‌ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: సి
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: బి
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: ఎ
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: డి
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: డి
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: ఎ
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: బి
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: సి
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: ఎ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: సి
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: డి
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: డి
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: బి
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: డి
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ధాల్ సి) చిలక డి) థార్
సమాధానం: డి
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: సి
వివరణ: ఎల్లోరా మినహా మిగిలినవన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: బి
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. ఆయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటుమినస్
సమాధానం: ఎ
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) జోగ్రి
సమాధానం: డి
వివరణ: జోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. జోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: బి
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: ఎ
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: సి
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: డి
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: ఎ
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: ఎ
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: సి
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: డి
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: సి
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: డి
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతోవన్ డి) ఫారడే
సమాధానం: సి
వివరణ: బీతోవన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: డి
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: బి
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలి బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: డి
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: సి
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: బి
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: బి
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సోప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: ఎ
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నోయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు:** 2
అర్హత: బీఇ/ బీటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బీఇ/ బీటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బీఇ/ బీటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24
దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4
వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్
2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన నాయ్యమూర్తి
3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి
5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ
6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ
7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ
8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ
9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా
10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ
11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్
12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు
14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి
15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి
17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు
18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు
19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్



కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ
21. లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనప్పుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు
22. రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ
23. 1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
24. రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?
ఎ) హెర్బర్ట్ బెకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వెవేల్ సి) క్రిప్స్, లుటియన్స్
డి) పైవారందరూ
25. రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత
26. రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
27. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం
28. మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా
29. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ
30. ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్
5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4
31. ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ
32. 80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ఠ సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది
33. ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన తొలి వ్యక్తి?
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) భైరాన్‌సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు
34. భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ
35. తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్
36. భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ
37. భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్
38. భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ
39. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి
40. భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్
41. సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి
42. ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్
43. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్
44. ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17
45. రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్
46. ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా
47. జాకీర్ హుస్సేన్ మరణాంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా
48. రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు
49. ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
50. భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

సమాధానాలు

		15) ఎ	24) ఎ	33) సి	42) బి
		16) బి	25) సి	34) ఎ	43) సి
1) సి	8) బి	17) సి	26) బి	35) డి	44) బి
2) ఎ	9) సి	18) బి	27) ఎ	36) సి	45) డి
3) ఎ	10) బి	19) సి	28) డి	37) బి	46) ఎ
4) డి	11) ఎ	20) డి	29) డి	38) ఎ	47) బి
5) ఎ	12) సి	21) ఎ	30) ఎ	39) సి	48) సి
6) సి	13) సి	22) సి	31) సి	40) డి	49) ఎ
7) బి	14) డి	23) ఎ	32) బి	41) సి	50) సి

అడ్మిషన్స్

జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.
పీజీ కోర్సులు: ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పిహెచ్‌డి/ ఎమ్మెస్సీ - పిహెచ్‌డి డ్యూయెల్ డిగ్రీ
టెస్ట్ పేపర్స్ - కోడ్స్: బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పిహెచ్)
అర్హత: గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
జామ్ 2018 జరిగే తేదీ: 2018 ఫిబ్రవరి 11
ఫలితాల విడుదల: 2018 మార్చి 20
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10
వెబ్‌సైట్: www.jam.iitb.ac.in

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సిడిఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: 50 శాతం మార్కులతో బిఎస్సీ/ బిఫార్మసీ/ బిఎస్సీ - అగ్రి/ ఎంబిబిఎస్/ బివిఎస్సీ/బిడిఎస్/ బిహెచ్ఎంఎస్/ బిఎఎంఎస్/ బియుఎంఎస్/ బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసిఏ/ పిహెచ్‌డి పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16
వెబ్‌సైట్: www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net

కొనసాగుతున్న గణేష్ నిమజ్జనాలు

ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో మంగళవారం అత్యధికంగా గణనాధుల నిమజ్జనోత్సవాలు జరిగాయి. ఐదో రోజు కావడంతో సమీప మండలాల నుంచి మేళతాళాలతో పలు విగ్రహాలను తీరప్రాంతానికి తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత ఉత్సాహంగా కేరింతలు కొడుతూ విగ్రహాల వెంట సాగారు.

అవయవదానం

విడవలూరు: విడవలూరుకు చెందిన బెజవాడ వెంకటేశ్వర్లు రెడ్డి (50) అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం ఆయన అవయవాలను దానం చేశారు. కొద్దికాలంగా వెంకటేశ్వర్లు రెడ్డి ఆనారోగ్యంతో బాధపడుతుండగా నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లుకు బ్రెయిన్ డెడ్ కావటంతో కుటుంబసభ్యుల అనుమతి మేరకు వైద్యులు కిడ్నీలను, కళ్లను సేకరించారు.

విత్తనాలు మొలకెత్తకుండా జాగ్రత్తలు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త రాజన్

కోవూరు: వర్షానికి పంట నుంచి నేలరాలిన విత్తనాలు మొలకెత్తకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వ్యవసాయ శాస్త్రవేత్త రాజన్ కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షానికి నేలరాలుతున్న వరిలో గింజలు మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారి చేయాల్సిందిగా వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు కుప్పయ్య, ఏవో కల్యాణి, విస్తరణాధికారులు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

'గీతాంజలి'లో జాతీయ క్రీడాదినోత్సవం



క్రీడాకారులతో కళాశాల సిబ్బంది

కోవూరు: గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని కరస్పాడెంట్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడానైపుణ్యాన్ని అలవర్చుకోవాలన్నారు. యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచాల్సిందిగా కోరారు. విద్యార్థులకు క్రికెట్ కిట్స్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బారావు, పీడీ అశోక్‌కుమార్, వివిధ శాఖల విభాగాధిపతులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



వీరేంద్రకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

ఇందుకూరుపేట : తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరేంద్ర చౌదరి అన్నారు. పల్లెపాడులో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలంలో టీడీపీకి తొలినాళ్ల నుంచి పట్టు ఉందని అదేస్థాయిలో అత్యధికంగా సభ్యత్వం స్వీకరించడం అందుకు నిదర్శనమన్నారు. అనంతరం నంద్యాలలో టీడీపీ గెలుపుపై కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట రమణయ్య, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

విడవలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్రశస్త్ర వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మన సేవాసంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాలనీలన్నీ అభివృద్ధి చేశాం

● ఎమ్మెల్యే పోలంరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోలంరెడ్డి

కొడవలూరు: ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ కింద నియోజకవర్గంలో అన్ని కాలనీలను అభివృద్ధి చేశామని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. మండల కేంద్రమైన కొడవలూరులో దాదాపు రూ. 7 కోట్ల 5లక్షల అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు.అలాగే రూ. 15 లక్షల అంచనా వ్యయంతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం ఇరిగేషన్ బంగ్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మండలంలోని నార్తురాజుపాళెంలో రోడ్ల విస్తరణ చేపట్టి నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం త్వరలో జరుగుతుందన్నారు. అంతేకాకుండా కొడవలూరులో ఫ్లైఓవర్ బ్రిడ్జిని త్వరలో నిర్మిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని కొందరు అధికారుల వల్ల మిగిలినవారికి చెడ్డపేరు వస్తోందని మండలంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తన విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారిని ప్రభుత్వానికి హ్యాండోవర్ చేయాలని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని వాగ్దానాలను నెరవేర్చిన ఏకైక పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీయేనని ఆయన తెలిపారు. నంద్యాల ప్రజలు తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి పట్టం కట్టారని అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల మాదిరిగానే 2019 జరిగే ఎన్నికల్లో టీడీపీ అన్ని స్థానాల్లో టీడీపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసుంధర, తహసీల్దార్ బషీర్, టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేందర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాసిన ప్రసాదు, ఉపాధ్యక్షుడు చెముకుల వెంకయ్య, ప్రధాన కార్యదర్శి పాటూరు రమేష్, నీటి సంఘాల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, శివకుమార్, సతీష్‌రెడ్డి మల్లికార్జున, తెలుగు యువత మండల అధ్యక్షుడు గరికపాటి రాజా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మండల తువ్వర ప్రవీణ్, సర్పంచు వెంకటాద్రి, ఉప సర్పంచు శ్రీనివాసులు, నాయకులు వట్టూరు శ్రీనివాసయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. పడుగుపాడులోని నేతాజీనగర్‌లో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నిరుద్యోగ యువతను దృష్టిలోపెట్టుకొని భృతి చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేపట్టిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల్ని ముఖ్యంగా యువతను పార్టీలోకి ఆహ్వానించాల్సిందిగా కోరారు.ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సూరిశెట్టి శ్రీనివాసులు, రాధాకృష్ణ, చిన్నంగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఎంతో మధురం

● అష్టావధాని రాజశేఖర్



మాట్లాడుతున్న రాజశేఖర్



గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థినులు

కోవూరు:తెలుగుభాష ఎంతో మధురమైందని అష్టావధాని, విశ్రాంత అధ్యాపకుడు కోట రాజశేఖర్ అన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. తీయ తేనీయ తెలుగు అన్ని భాషల్లోకి గొప్పదన్నారు. పాశ్చాత్య దేశాల్లో సైతం తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రశంసిస్తారనీ చెప్పారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజహర్‌బేగ్, చెంచురామయ్య, రవికిరణ్, మధు, హరిప్రసాద్, రామకృష్ణ మాట్లాడారు.

ఇందుకూరుపేట : స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో తెలుగు మాతృభాషాదినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవీలక్ష్మీ అధ్వర్యంలో గిడుగు, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం పద్యాలు, పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. భాష ఆవశ్యకతపై విద్యార్థులు ఉపన్యసించడం విశేషం.

జీవించే హక్కును హరించవద్దు:సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

కోవూరు: రవాణా కార్మికుల జీవించే హక్కును అధికారులు హరించకూడదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోనె దయాకర్‌రావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ పేరుతో కార్మికుల జీవనోపాధిని అధికారులు హరించివేయడం తగదన్నారు. ఆటోలు, వాహనాల్ని నడుపుకొంటూ జీవించే రవాణా కార్మికులు ఇటీవల కాలంలో అధికారుల నిరంకుశత్వానికి గురై పనిదినాల్ని కోల్పోతున్నారనీ చెప్పారు. ప్రభుత్వం ధోరణిని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాల్ని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు గండవరపు శేషయ్య, భాస్కరయ్య, సురేష్, ఖాదర్‌బాష, మల్లికార్జున, హరి, శేషమ్మ తదితరులు మాట్లాడారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో నిరుపేద విద్యార్థులు ఎక్కువగా ఉండటంతో వారి బస్‌పాస్‌లకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు నగదు చెల్లించి వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భగవాన్‌దాస్, చాంపియన్ చంద్రారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకే జీపీఎస్

● ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకే గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ (జీపీఎస్)ను ట్రాక్టర్లకు అమర్చుతున్నారని ఇసుకరీచ్‌ల ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి డ్రైవర్లుకు వివరించారు. మండలంలోని మినగల్లు ఇసుకరీచ్‌లో మంగళవారం ఇసుకరవాణా చేస్తున్న పలు ట్రాక్టర్లకు ఆయన అధ్వర్యంలో ఫ్రీమాంట్ ఐటీ సోల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన సిబ్బంది జీపీఎస్‌లను అమర్చారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ట్రాక్టరుకు అమర్చే జీపీఎస్ పరికరాలకు సంబంధించి రెండు లాగిన్‌లుంటాయని, ఒకటి వాహనం యజమానికి, మరొకటి కలెక్టర్ పరిశీలనలో ఉంటుందని తెలిపారు. కాగా జిల్లాలోని పలు రీచ్‌ల నుంచి ఇసుకరవాణా చేసే వాహనాలు ఈ పరికరాల ద్వారా ఏసమయంలో ఎక్కడ ఉన్నాయి, ఏ రీచ్‌నుంచి ఎక్కడికి ఇసుక రవాణా చేస్తున్నాయన్న సమాచారాన్ని ఈ పరికరాల ద్వారా లాగిన్‌తో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చని తెలిపారు. పలు ట్రాక్టర్ల డ్రైవర్లు తమ యజమానులకు వివరించిన అనంతరం తమ వాహనాలకు జీపీఎస్‌లను అమర్చుకుంటామని చెప్పడంతో కొద్ది వాహనాలకే ఈ పరికరాలు అమర్చారు.



ట్రాక్టర్‌కు జీపీఎస్‌ను అమర్చుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసులు రెడ్డి

అంకితభావంతోనే ప్రభుత్వోద్యోగులకు గుర్తింపు

ఉదయగిరి: అంకితభావంతో విధులు నిర్వహిస్తే, తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో వీరాస్వామి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఉత్తమ ఉద్యోగి అవార్డు పొందిన సీనియర్ అసిస్టెంట్ గోపీనాథేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఎంఈవో మోహన్‌రావు, ఏఈలు సయ్యద్ కరీముల్లా, దయాల్, ఈవోపీఆర్డీ కళాధర్, సూపరింటెండెంట్ పణిపవన్‌కుమార్, ఇన్‌చార్జి ఏపీవో నరసింహారావు, పీటర్, మండల కోఆర్డినేటర్ తాహెర్, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శన



ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

వింజమూరు: స్థానిక నేతాజీ విక్రమ్ పాఠశాలలో తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. 1200 మంది విద్యార్థులు హాజరయ్యారు. డెమాన్‌స్ట్రేటర్ ధనుంజయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినుకు రాలితే.. నడక సాగునా?

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- అవస్థల్లో గ్రామీణ ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఉదయగిరి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షాలకు రహదారులు బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో వీధులు సిమెంట్ రోడ్లకు నోచుకోలేదు. మరోవైపు 2019 నాటికి ప్రతి గ్రామంలో సిమెంట్‌రోడ్లు ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు చెపుతున్నా, గుత్తేదారులు ముందుకురాకపోవడంతో వారి మాటలు అమలుకు నోచుకోవడం లేదు. ఉపాధి పథకం నుంచి 50 శాతం, పంచాయతీరాజ్ శాఖ నుంచి 50 శాతం చొప్పున నిధులు వెచ్చించి రోడ్లు వేయాలని సూచిస్తోంది. పంచాయతీల్లో నిధులు లేకపోవడం, చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో అంతర్గత రహదారులు సిమెంట్ రోడ్లకు నోచుకోలేదు. మండలంలోని అయ్యవారిపల్లి, సున్నంవారిచింతల, కృష్ణంపల్లి, ఆర్లపడియ, గుడినరవ, దాసరిపల్లి, అప్పసముద్రం, వడ్లమూడిపల్లి, కుర్రపల్లి, పుల్లాయపల్లి తదితర గ్రామాల్లో పలు వీధులు రాళ్ల తేలి, మోకాటిలోతు గుంతలతో అధ్వానంగా మారాయి. వర్షాల కారణంగా ఈ గోతుల్లో నీరు చేరి దోమలు పెరిగిపోవడంతో ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రహదారుల వెంట పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విషపురుగులకు నిలయాలుగా మారాయి. మరోవైపు గతంలో వేసిన సిమెంట్ రోడ్లు దెబ్బతినడం, పూర్తిగా మట్టిలో మునిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి గ్రామాల్లోని అంతర్గత రహదారులకు మరమ్మతులు చేయడంతోపాటు సిమెంట్‌రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అయ్యవారిపల్లిలో అంతర్గత రహదారి


గుడినరవలో గుంతల్లో చేరిన వర్షపు నీరు

ఘనంగా క్రీడా దినోత్సవం


బహుమతులు అందచేస్తున్న ఉపాధ్యాయులు

వింజమూరు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం చాకలకొండ ఆర్‌కే ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిహెచ్ఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం పొందవచ్చన్నారు. యోగాతో ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెలుగోటి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

మిలీనియం మార్చ్ గోడపత్రిక విడుదల


గోడపత్రిక విడుదల చేస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన అమరావతిలో ఉద్యోగులు, ఉపాధ్యాయ, కార్మికులు నిర్వహించే మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దారు వెంకటసునీల్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ మిలియన్‌మార్చ్ కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు బొమ్మతట్టు శ్రీహరి, నాయకులు శ్రీనివాసరాజు, పార్థసారథి, జిలాని, మల్లికార్జున, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల, సినిమాహాలు సెంటర్, యానియన్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీవో ఈశ్వరరాణి తనిఖీ చేశారు. రిజిస్టర్ల నిర్వహణలో అలసత్వవహించడం తావివ్వరాదన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భుజించేలా చూడాలన్నారు. కిశోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రాలు చిన్నారులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని సూచించారు.

రెవెన్యూ రికార్డుల్లో 21వేల సవరణలు గుర్తింపు

వింజమూరు: భూముల రికార్డుల్లో తప్పులను గుర్తించి సవరించాలని ఆత్మకూరు ఆర్డీవో బాపిరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రికార్డుల ప్యూరిఫికేషన్‌లో మండలంలో 21,692 సవరణలు గుర్తించామన్నారు. వీటిలో 18 రకాల తప్పులున్నాయన్నారు. 2-3 నెలల్లోపు ఈ తప్పులను సవరిస్తామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఎవరు ఆక్రమించినా, వీఆర్వోలు, వీఆర్ఏలపై చర్యలు తీసుకుంటామన్నారు. కాటేపల్లిలో సుమారు వంద ఎకరాల మేతపోరంబోకు ఆక్రమణకు గురైందని గుర్తించి 145 సెక్షన్ విధించాలని తహసీల్దారు మస్తానయ్యను ఆదేశించారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసు పెట్టాలని సూచించారు. తప్పు చేసిన ప్రతిఒక్కరు శిక్షార్హులేనన్నారు. సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో బాపిరెడ్డి

కోలాహలంగా వినాయక నిమజ్జనోత్సవం

ఉదయగిరి రూరల్: మండల పరిధిలోని గండిపాళెంలో మంగళవారం వినాయక నిమజ్జనం చేశారు. స్వామి వారిని ప్రత్యేక వాహనంలో విద్యుత్, పూలతో అలంకరించి మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టి ఉత్సవాల్లో యువకులు పోటాపోటీగా పాల్గొన్నారు.. మాజీ ఎంపీటీసీ, పీహెచ్‌సీ సభ్యుడు పాముల రమణయ్య అన్నదానం చేశారు. లడ్డూ వేలంలో యువకులు పోటీ పడ్డారు. గ్రామంలో పాముల సురేష్ 9 కేజీల లడ్డూను రూ.25 వేలకు, 5 కేజీల లడ్డూను గోను మహేష్ రూ.7 వేలకు పాటలు పాడి దక్కించుకున్నారు. ఉదయగిరి పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు నిమజ్జనం చేశారు


నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

సీతారామపురం: మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండపాల వద్ద అన్నదానాలు, ఉట్టి ఉత్సవాలు, లడూ వేలం నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ స్థానిక స్వామిచెరువులో నిమజ్జనం చేశారు.

వరికుంటపాడు: జీ.కొండారెడ్డిపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామం, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనం చేశారు. ఉట్టి ఉత్సవం, అన్నదానం నిర్వహించారు

వింజమూరు: వింజమూరు పట్టణంతోపాటు పలు గ్రామాల్లో నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఉట్టి ఉత్సవాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

అవెన్యూ ప్లాంటేషన్‌కు చర్యలు

ఉదయగిరి: గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ పనులు ముమ్మరం చేస్తున్నట్లు వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రత్నమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక క్లస్టర్‌కు ఐదు కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 20 కిలోమీటర్ల మేర మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో 25 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నట్లు వివరించారు. సీతారామపురం ఏపీఎం సైనారూత్ పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఏరియా కోఆర్డినేటర్ రత్నమ్మ

భూసార పరీక్షలు తప్పనిసరి

వింజమూరు: ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నల్లగొండ్ల, గుండెమడగల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్నందున ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ట్రాక్టర్ పనిముట్లు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం పంటలను పరిశీలించారు.

ప్రత్యామ్నాయానికి అనుకూలం

ఉదయగిరి: ప్రస్తుత వాతావరణం ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఎంతో అనుకూలమని వ్యవసాయాధికారి షేక్ జహీర్ తెలిపారు. ఉలవ, అలసంద, పెసర, అనుములు, జొన్న, సజ్జ పంటలు సాగు చేయాలని కోరారు.

సూచనలు పాటించాలి

వరికుంటపాడు: వరి నాటే సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలని ఏవో రాధ తెలిపారు. తూర్పుపాళెం, మహమ్మదాపురం గ్రామాల్లో వరి మళ్లను పరిశీలించారు. వరి నాటే సమయంలో ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్ వేయాలని సూచించారు. ముదిరిన నారు కొండలను కత్తిరిస్తే పురుగుల గుడ్లను నాశనం చేయవచ్చన్నారు. నాట్లు వేసిన వారం రోజుల్లో కార్టాప్ 4జీ గుళికలు ఎకరాకు 5 కేజీలు వేయడం వల్ల తెగుళ్లు నివారించవచ్చన్నారు.

ఉచితంగా సూక్ష్మ పోషకాలు

సీతారామపురం: దేవిశెట్టిపల్లి, అయ్యవారిపల్లెల్లో ఏవో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జింక్, జిప్సం, బోరాన్ వంద శాతం రాయితీపై సరఫరా చేస్తున్నామన్నారు.

పప్పుధాన్యాలు సాగు చేయండి

ఉదయగిరి రూరల్: ప్రస్తుత వాతావరణం పప్పుధాన్యాల పంటల సాగుకు అనుకూలంగా ఉందని ఏవో షేక్ జహీర్ తెలిపారు.గుడినరవ, దుంపవారిపల్లి గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ కంది, మినుము, పెసర, ఉలవ విత్తనాలు సబ్సిడీపై అందచేస్తున్నామన్నారు. కౌలు కార్డుల ఆధారంగా సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నామన్నారు.


దినఫలాలు




అదృష్టసంఖ్యలు : 3, 5



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.



మిథునరాశి: (మే21-జూన్21): ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కావేరి పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు

● అద్దె, సీట్ల ప్రాతిపదికన కేటాయింపు ● ఆర్‌ఎం రవివర్మ


మాట్లాడుతున్న ఆర్‌ఎం రవివర్మ

నెల్లూరు (క్యాంపస్) : వచ్చే నెల 12వ తేదీ నుంచి జరిగే కావేరి పుష్కరాలకు నెల్లూరు రీజియన్ తరపున ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని ఆర్‌ఎం సీవీ రవివర్మ తెలిపారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. కావేరి పుష్కరాలకు ఇప్పటి వరకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు నడిపింది లేదని, తొలిసారిగా జిల్లా నుంచి శ్రీరంగంకు బస్సులు నడపనున్నామని చెప్పారు. అద్దె, సీట్ల ప్రాతిపదికన బస్సులు నడిపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సీట్ల ప్రాతిపదికన అయితే సూపర్ లగ్జరీలో ఒకరికి రానూపోనూ రూ.2000, అల్ట్రా డీలక్స్‌లో రూ.1900, ఎక్స్‌ప్రెస్‌లో రూ.1500, ఆర్డనరీలో రూ.1100గా టిక్కెట్టు ధర ఖరారు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయన్నారు. మూడు రోజుల ప్రయాణంతో కావేరి పుష్కరాలకు వెళ్లి తిరిగి రావడం జరుగుతుందని తెలిపారు. అద్దె ప్రాతిపదికన కిలోమీటర్‌కు సూపర్ లగ్జరీకి రూ.49, ఎక్స్‌ప్రెస్‌కు రూ.52, అల్ట్రా డీలక్స్‌కు రూ.52, గరుడాకు రూ.93 వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఎక్కువ సంఖ్యలో కావేరి పుష్కరాలకు బస్సులు నడిపేందుకు చర్యలు చేపడుతున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం సత్యనారాయణ, ఒకటో డిపో మేనేజర్ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమ్మెకు సన్నద్ధం

- ఉద్యోగ భద్రత కోసమే
- ఇప్పటికే ఎస్‌ఈకి నోటీసులు
- గడువులోగా స్పందించకుంటే కరెంటు సరఫరాకు ఇబ్బందులు

నెల్లూరు (సిటీ) : జిల్లాలో విద్యుత్ శాఖలోని కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఉద్యోగ భద్రత కోసం పోరాటం చేస్తున్న వారు చివరి అస్త్రంగా సమ్మె బాటను ఎంచుకున్నారు. గడువులోగా వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను అధికారులు ఆపకపోతే విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. జిల్లాలోని దాదాపు 2వేల మంది కాంట్రాక్టు కార్మికులు అంచలంచెలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టి సమ్మె గంట మోగించేందుకు సన్నద్ధమయ్యాయి. సెప్టెంబరు 30లోపు డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెకు దిగడం ఖాయమని విద్యుత్ శాఖ ఎస్‌ఈకి నోటీసులను అందచేశారు.

వివిధ విభాగాల్లో 2వేల మంది..

జిల్లాలోని విద్యుత్ శాఖలో 2వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. షిఫ్ట్ ఆపరేటర్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మీటర్ల రీడింగ్, కంప్యూటర్ ఆపరేటర్లు, వాహనాల డ్రైవర్లు తదితర పనులు చేస్తున్నారు. వారందరికీ కాంట్రాక్టర్లే వేతనాలు అందచేస్తున్నారు. ప్రతి నెలా 5వ తేదీ కల్లా వేతనాలు ఇవ్వాలి. అందుకు భిన్నంగా మూడు, నాలుగు నెలలకోసారి వేతనాలు చెల్లిస్తూ వస్తున్నారు. తమకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని కోరుతూ కార్మికులు కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు..

ఒకే పని పర్మినెంట్, కాంట్రాక్టు సిబ్బంది చేస్తున్నా వారికిచ్చే వేతనాల్లో భారీ తేడాలు ఉన్నాయి. షిఫ్ట్ లైన్‌మాన్ నెల జీతం రూ. 65వేల నుంచి 70వేలు ఉంది. కాంట్రాక్టు షిఫ్ట్ ఆపరేటర్‌కు కేవలం రూ. 10,700 ఇస్తున్నారు. అది కూడా కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందే. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, మీటర్ల రీడర్లకు పీస్ రేటునకాకుండా వేతనాలు కల్పించాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండు చేస్తున్నారు. వాటి పరిష్కారం కోసం వారు సమ్మెకు సిద్ధమవుతున్నారు.

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు

కార్మికులు సమ్మెకు దిగితే కరెంట్ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడనున్నాయి. జిల్లాలో 188 సబ్ స్టేషన్లలో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. సమ్మె జరిగితే ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడనున్నాయి. కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి పర్మినెంట్ కార్మికులు మద్దతు తెలపనున్నారు. దాంతో కరెంటు కష్టాలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. అసలే సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న విద్యుత్ శాఖపై సమ్మె ప్రభావం అధికంగా పడే అవకాశం ఉంది. సమ్మెలోపు కార్మిక సమస్యల పరిష్కారంపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

ప్రేమ కిషోర్‌కు 'ఆటా' అవార్డు


ప్రేమకిషోర్

నెల్లూరు (సాంస్కృతికం) : ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు టీచర్స్ అసోసియేషన్(ఆటా) భద్రాచలం వారు ఏటా ప్రదానం చేసే పురస్కారానికి ఈ ఏడాది జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్న రావినూతల ప్రేమకిషోర్ ఎంపికయ్యారు. తనను ఉత్తమ రచయిత విభాగంలో ఎంపిక చేసినట్లు ఆటా జాతీయ అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారని ప్రేమ కిషోర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని వచ్చే నెల 8న భద్రాచలంలో తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్, తానా, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖలు సంయుక్తంగా అందజేస్తాయని తెలిపారు. తాను పలు నాటకాలు రచించానని, వాటికి గాను తొమ్మిది నంది అవార్డులు, పరుచూరి రఘుబాబు జాతీయ నాటకోత్సవాలల్లో 25కుపైగా అవార్డులు వచ్చాయన్నారు. అలాగే వివిధ నాటక పరిషత్తుల్లో తన ప్రదర్శనకు 150కి పైగా పురస్కారాలు అందుకున్నానన్నారు. అలాగే వివిధ సంస్థల నుంచి 18 అవార్డులు పొందినట్లు తెలిపారు.

భూసార పరీక్ష కేంద్రం ఏడీగా అనుసూయ

నెల్లూరు (వ్యవసాయం) : వ్యవసాయ శాఖ అనుబంధంగా ఉన్న భూసార పరీక్షా కేంద్రం సహాయ సంచాలకులుగా పీ అనుసూయ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఫెర్టిలైజర్సు కోడింగ్ విభాగంలో ఏవోగా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం ఇటీవల పదోన్నతి కల్పించి నెల్లూరుకు బదిలీ చేసింది. ఆ శాఖ ఇన్‌చార్జి ఏడీ సుమలత నుంచి పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ ఏడాది 66 వేల భూసార పరీక్షల నమూనాలను లక్ష్యంగా సర్కారు నిర్దేశించిందన్నారు.

మత్స్యశాఖ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి జేసీ వెంకట సుబ్బారెడ్డి

నెల్లూరు (కలెక్టరేట్) : మత్స్యశాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో మల్టీపర్పస్ ఫిషరీస్ అసిస్టెంట్ల నియామకానికి సంబంధించి కలెక్టరేట్‌లో మంగళవారం ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. గ్రీవెన్స్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో అభ్యర్థుల అర్హత, ధ్రువీకరణలను అధికారులు పరిశీలించారు. అనంతరం ఇన్‌చార్జి జేసీ వెంకట సుబ్బారెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. బోటనీ, జువాలజీ, ఫిషరీస్, జనరల్ నాలెడ్జి తదితర అంశాలలో ఆయన అభ్యర్థులను ప్రశ్నించారు. మొత్తం 11 ఖాళీలకు 90 మంది హాజరయ్యారు.

అక్టోబర్ 2న పొణకా కనకమ్మ విగ్రహ ఆవిష్కరణ

ఇందుకూరుపేట : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, పినాకినీ ఆశ్రమ వ్యవస్థాపకులు పొణకా కనకమ్మ విగ్రహ ఆవిష్కరణ అక్టోబర్ 2వ తేదీ చేస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. నిలువెత్తు కాంస్య విగ్రహానికి జగదేవిపేట వాసి, నెల్లూరు మాజీ శాసన సభ్యుడు జేకే.రెడ్డి లక్షా 50వేల రూపాయలు విరాళంగా అందజేశారని తెలిపారు. తెనాలిలో శిల్పులచే విగ్రహ తయారీ జరుగుతుందన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,854
సవర (8 గ్రాములు)	-	22,832
వెండి కిలో ధర	-	43,100
వెండి గ్రాము ధర	-	43.10

చికెన్ ధరలు



వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	93
లేయర్	82
స్కిన్ చికెన్	151
స్కిన్‌లెస్ చికెన్	178
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	102
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	166
స్కిన్‌లెస్	196
లేయర్	140

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.2,500 నుంచి రూ. 3,200 వరకు

పండ్లు: రూ.1,500 నుంచి రూ.2,000 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	10.742 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	12,286 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో :	50 క్యూసెక్కులు
ఆవిరి :	43 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట


నీటిమట్టం :	3 అడుగులు
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	250 క్యూసెక్కులు
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	-------------
నెల్లూరుచెరువుకాలువ :	50 క్యూసెక్కులు

తాతయ్య కోసం.. ఓ యాప్



క్లిక్ అండ్ ఫైండ్

ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.



కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంత్, క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.



'నేను ఎంతో మంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'

\- కావ్య

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'

\- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో


డాక్టర్: ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?

రోగి: (పర్సు తడుముకుంటూ): హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

సూక్తి

పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

రంగులు వేయండి




పదాలు గుర్తించండి

shoe, duck, doll, globe, block, green


x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



దారి కనుక్కోండి



చెప్పగలరా?


జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?



అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

చుక్కలు కలపండి



జంబ్లింగ్ వర్డ్స్

1. BWLO ▶ ....
2. LDOR ▶ ....
3. ALPM ▶ ....
4. TLAL ▶ ....

జంతర్ మంతర్

1. రాయంజకీ ▶ ....
2. అన్నతంత్యు ▶ ....
3. నీఅతివి ▶ ....
4. నంవమార్త ▶ ....

జవాబులు

చెప్పగలరా? : జాతీయం

జంతర్‌మంతర్ : 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం

జంబ్లింగ్ వర్డ్స్ : 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL



శతస్తంభాల కల్యాణ మండపం

శిల్పకళా వైభవం...

- జీవకళ ఉట్టిపడుతున్న దేవాలయం
- 31 నుంచి 12 వరకు బ్రహ్మోత్సవాలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

చిట్టమూరు : 11వ శతాబ్ధంలో చోళరాజులు కళాతృష్ణకు, నాటి అపురూప శిల్పుల అద్భుత నైపుణ్యానికి ప్రతీకగా శ్రీ వల్లీదేవసేన స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం చిట్టమూరు మండలంలోని మల్లాం గ్రామంలో నిలిచి ఉంది. ఆలయ రాతిగోడలపై తమిళంలో లిఖించి ఉన్న శాసనాలు స్వామి వృత్తాంతాన్ని, శిల్పుల నైపుణ్యాన్ని వివరిస్తాయి. నూరు స్తంభాల కల్యాణ మండపం రాతిరథం శిల్పకళ వైభవాన్ని చాటి చెబుతుంది.

నాటి నుంచి నిత్య నైవేద్యాలు : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ జరిగినప్పటి నుంచి మల్లాంలో స్వామివారికి నిత్యం దూపదీప నైవేద్యాలు నిరాటంకంగా జరుగుతున్నాయి. ప్రతి మంగళ, ఆదివారాల్లో స్వామి అమ్మవార్లకు పాలు, పండ్లతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. స్వామి కుడి, ఎడమ వైపుగా శ్రీ వల్లీదేవసేనమ్మ ఆలయాలు ఇక్కడ చూడవచ్చు. స్వామి మూల విరాట్ పక్కనే స్వయంభుగా వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రెండు చేతులు తెగిన రాతి విగ్రహం ఇక్కడ మనకు దర్శనమిస్తుంది. ప్రతిఏటా భద్రపదం మాసంలో 11 రోజులపాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకొని వెళుతుంటారు. ఈ బ్రహ్మోత్సవాలలో ఏటా కుల మతాలకు అతీతంగా స్వామి కల్యాణ మహోత్సవం రోజు సామూహిక వివాహాలు జరగడం విశేషం.

అద్భుతం... నూరు కాళ్ల మండపం : నాటి రాజుల పాలనలో పిలవబడిన తిరువాంబూరు కాలక్రమేణ తిరుగుడు మల్లాంగా మారి ప్రస్తుతం మల్లాంగా స్థిరపడింది. చోళరాజుల కాలంలో పాండ్యభూపతిరాజు ఆలయాన్ని నిర్మించే సమయంలో పెద్ద శిల్పి, అతని కుమారుడు నూరు కాళ్ల మండపాన్ని అద్భుతంగా నిర్మించారు. తమిళ రాష్ట్రంలోని తిరువాంబూరు అనే గ్రామంలోని తన ప్రేయసి కోరిక మేరకు శిల్పి కుమారుడు రథానికి ఏర్పాటు చేసిన గుర్రాలకు ప్రాణం పోసి తమిళనాడు వైపు మళ్లించాడు. ఈ విషయం తెలుసుకొన్న పెద్ద శిల్పి గుర్రాల కాళ్లను నరికివేయడంతో నూరుస్తంభాల ఈ రాతిరథం దక్షణం వైపుగా ఉన్నట్లు కల్యాణ మండపం చరిత్ర శాసనాల్లో పొందుపరచి ఉంది. అప్పటి నుంచి తిరుగుడు మల్లాంగా పిలుస్తున్నారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

కలగా మిగిలిన గాలి గోపురం : మల్లాంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద గాలిగోపురం ఏర్పాటు కలగా మిగిలిపోయింది. వీటి ఏర్పాటుపై దాతల కోసం ఎదురుచూస్తున్నారు. ఆలయం ముందు నిర్మాణంలో ఉన్న కోనేరు నిధుల కొరతతో పనులు ఆగిపోయాయి. ప్రసిద్ది చెందిన ఈ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

31 నుంచి బ్రహ్మోత్సవాలు : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 12వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటి చైర్మెన్ పాపారెడ్డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. అందులో భాగంగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ఈ బ్రహ్మోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించామని తెలిపారు. 31న అంకురార్పణం, 1న ధ్వజారోహణ, 5న ఫలాభిషేకం, నందిసేవ, 6న రథోత్సవం, 7న షణ్ముకస్వామి కల్యాణం, 8న కల్యాణ రాయబారం, 9న వల్లీదేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 10న వసంతోత్సవం, 11న అలకలదోపు, వల్లీ పరిణయం, 12న ఊంజల సేవ, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన పేర్కొన్నారు.



నూరుస్తంభాల మండపం ముందు కాలు తెగి ఉన్న అశ్వ విగ్రహం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జేసీ వెంకట సుబ్బారెడ్డి

యువత క్రీడల్లో రాణించాలి

ఇన్‌చార్జి జేసీ వెంకటసుబ్బారెడ్డి

నెల్లూరు (క్యాంపస్) : యువతి, యువకులు ఏదో ఒక క్రీడలో రాణించాలని, క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఉత్తేజం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా యువజన సర్వీసుల శాఖ, క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా మంగళవారం నెల్లూరులో భారీ ర్యాలీ చేపట్టాయి. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి యువత క్రీడా మైదానాల్లో కనిపించడం లేదని, తరగతి గదులకే పరిమితం అవుతున్నారన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ ప్రముఖ హాకీ క్రీడాకారుడని, ఆయన మూడు సార్లు ఒలంపిక్స్‌లో బంగారు పథకం సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈవో సుబ్రహ్మణ్యం, డీఎస్‌డీవో పీవీ రమణయ్య, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ జాతర తొలి చాటింపు



జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర తొలి చాటింపు సంప్రదాయబద్ధంగా బుధవారం రాత్రి వేయనున్నారు. పోలేరమ్మ జాతరలో ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను పాటించడం ఆనవాయితీ. జాతర చాటింపు వేసినప్పటి నుంచి పట్టణంలో ఎలాంటి శుభకార్యాలు నిర్వహించకూడదని అనాదిగా వస్తున్న ఆచారం. సెప్టెంబరు 6వ తేదీన రెండో చాటింపు, 10న ఘటోత్సవం, 13, 14వ తేదీల్లో జాతర నిర్వహిస్తారు. ముందుగా వెంకటగిరి రాజా కుంటుబీకుల నుంచి జాతర నిర్వహణకు అనుమతి తీసుకుంటారు.

- వెంకటగిరిటౌన్

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు (క్యాంపస్) : జాతీయ స్థాయి జంషీర్ కరాటే చాంపియన్‌షిప్ అండర్- 10, 14 విభాగాల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నట్లు కరాటే మాస్టర్ ఇబ్రహీం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మంగళవారం నెల్లూరు శెట్టిగుంటరోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ ఇటీవల కావలిలో జరిగిన ఏపీ స్టేట్ లెవల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో అండర్- 10 కేటగిరిలో కే సూర్యతేజ, అండర్-14లో జీ తారక్‌నాథ్ గెలుపొందారన్నారు. వారు అక్టోబర్ 4, 5, 6 తేదీలలో పశ్చిమ బంగాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఆ విద్యార్థులను పాఠశాల ఏజీఎం కొండారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ బీ శ్రీనివాస్, ఏవో పీ శివ, ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇబ్రహీం

సింధులా తయారవ్వాలి!

- సెట్నల్ సీఈవో సుబ్రహ్మణ్యం
- క్రీడాకారులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (క్యాంపస్) : బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధులాంటి క్రీడాకారులు జిల్లాలో ఎందరో తయారవ్వాలని సెట్నల్ సీఈవో సుబ్రహ్మణ్యం ఆకాంక్షించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. నెల్లూరులోని ఏపీ టూరిజం హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిన్న చిన్న దేశాల క్రీడాకారులు ఎన్నో బంగారు పతకాలు సాధిస్తుండగా, కోట్ల మంది జనాభా ఉన్న మన దేశం ఒకటి, రెండు పతకాలతో సరిపెట్టుకోవాల్సి రావడం బాధాకరమన్నారు. క్రీడాకారులు తమలోని ప్రతిభకు పదునుపెట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ వారు అందిస్తున్న ప్రోత్సాహం క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఫౌండేషన్ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా క్రీడాకారులకు పురస్కారాలు అందజేస్తున్నామని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో పీవీ రమణయ్య, ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి పసుపులేటి రామ్మూర్తి, శిక్షకుడు సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందుకున్న క్రీడాకారులు

ప్రతి చిన్నారికి ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరి

ఏఎస్‌పేట: ప్రతి చిన్నారికి ఎమ్మార్ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్ హెచ్‌ఎంవో సుధీర్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన ఏఎస్‌పేట జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మార్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వ్యాక్సిన్ ఆవశ్యకతను వివరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఏఎన్‌ఎం పద్మ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి అభినందించారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ రామకృష్ణ, హెచ్‌ఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

సమస్యల వలయంలో గురుకులం

● ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

● విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

ఆత్మకూరు: పట్టణంలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన గురుకుల బాలికల పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 2012లో ఆత్మకూరు పట్టణంలోని టెంకాయతోపులో ఉన్న ఎన్‌డీసీసీబీకి చెందిన రేకులషెడ్డులో తాత్కాలికంగా గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి ఆర్థిక శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో అప్పటి కలెక్టర్ బి.శ్రీధర్ రేకులషెడ్ల మరమ్మతులకు రూ.7 లక్షలు మంజూరు చేయించి తాత్కాలికంగా తరగతి గదులను ఏర్పాటు చేశారు. నాలుగేళ్లుగా వసతులు మెరుగుపడకపోవడంతో గురుకుల బాలికల పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల వసతి సమస్యాత్మకంగా మారింది.



రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్న గురుకుల బాలికల పాఠశాల

ప్రస్తుతం ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో 307 మంది విద్యార్థినులు ఉన్నారు. ప్రస్తుతం మూడు పెద్ద రేకుల షెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక విద్యార్థినుల విద్యాబోధనకు ఆరు రేకుల గదులు ఉన్నాయి. ఇక స్నానపు గదులు, మరుగుదొడ్లు సైతం విద్యార్థినులకు సరిపడా లేవు.

● ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

గురుకుల పాఠశాల భవన నిర్మాణం కోసం అప్పటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రూ.13 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. అయితే భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. ఎట్టకేలకు గత ఏడాది నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనైనా అన్ని హంగులతో సిద్ధమై, అందుబాటులోకి వస్తుందని ఆశించిన విద్యార్థులకు నిరాశే ఎదురైంది.



గురుకుల పాఠశాల నూతన భవనం

● వెంటాడుతున్న సిబ్బంది కొరత

307 మంది విద్యార్థినులకు విద్యాబోధన చేసేందుకు తగిన స్థాయిలో ఉపాధ్యాయుల నియామకం లేదు. నాలుగేళ్లుగా తాత్కాలిక ఉపాధ్యాయులతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో మెరుగైన విద్యాబోధనకు కొంత మేర అంతరాయం కలుగుతోంది.

పనులు పూర్తి కావాల్సి ఉంది



భవన నిర్మాణం పూర్తైతే అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశించాం. విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంక్, ప్రహరీ నిర్మాణం పూర్తయితే నూతన భవన సముదాయంలోకి వెళ్తాం.

- ఎం. సుధారాణి, ప్రిన్సిపాల్

● ఇంటర్వ్యూ



భూసార పరీక్షలు తప్పనిసరి

కిషోర్‌బాబు, వ్యవసాయాధికారి

?. అనంతసాగర మండలంలో ఎన్ని ఎకరాలకు భూసార పరీక్షలు నిర్వహించారు

!. మండలంలోని పలు గ్రామాల్లో 800 ఎకరాలకు భూసార పరీక్షలు నిర్వహించాం. ఇందులో 70 ఎకరాల్లో పోషక లోపాలు గుర్తించాం. వీరికి 100 శాతం సబ్సిడీతో జిప్సం అందజేస్తున్నాం.

?. మండలంలో ప్రస్తుతం ఏఏ పంటలుసాగవుతున్నాయి

!. 590 హెక్టార్లలో వేరుశనగ, 100 హెక్టార్లలో పత్తి, 765హెక్టార్లలో వరి పంటలు సాగవుతున్నాయి. తెగుళ్ల నివారణకు ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తున్నాం.

?. సబ్సిడీపై ఏం పంపిణీ చేశారు?

!. ఇటీవల జీలుగలు 66 క్వింటాళ్లు, పిల్లిపెసర 50 క్వింటాళ్లు సబ్సిడీపై అందించాం

?. వేరుశనగలో కలుపు నివారణకు సూచనలు ఇస్తున్నారా

!. వర్షాల కారణంగా వేరుశనగలో కలుపు ఎక్కువైంది.1లీటర్ నీటికి ఏంజీతైఫెన్ 1.6మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలి

- అనంతసాగరం

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2017-18 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబర్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డాక్టర్ ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాల కో-ఆర్డినేటర్ టీఎస్ఎస్‌ఆర్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఏపీఓఎస్ పూర్తి చేసిన వారు నేరుగా డిగ్రీలో ప్రవేశం పొందవచ్చన్నారు. ఏపీ ఆన్‌లైన్ కేంద్రం నుంచి దరఖాస్తు చేసుకున్న వారు తమ పూర్తి బయోడేటా వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

సంగంలో 23.2 మిమీ వర్షపాతం

సంగం: సంగంలో సోమవారం రాత్రి గాలివానతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో 23.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి ముందు భారీ గాలులు వీయడంతో సుమారు గంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ వర్షంతో వీధులన్నీ జలమయమయ్యాయి.

డివిజన్‌లో 2.35 లక్షల తప్పులు గుర్తింపు



విలేఖరులతో మాట్లాడుతున్న ఆర్డీవో బాపిరెడ్డి

ఏఎస్‌పేట: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో ఇప్పటి వరకు రెవెన్యూ రికార్డుల్లో 2.35 లక్షల తప్పులను గుర్తించామని ఆర్డీవో బాపిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఏఎస్‌పేట తహసీల్దారు కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాండ్ ప్యూరిఫికేషన్‌పై తహసీల్దారు, వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లు, ఖాతా నెంబర్లు, సర్వే నెంబర్లు, భూ విస్తీర్ణం, తదితర అంశాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు డివిజన్‌లో 80 శాతం పూర్తి చేశామని, వారం రోజులలోగా 100 శాతం తప్పుల గుర్తింపు కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. ఏఎస్‌పేట మండలంలో 33 తప్పులను గుర్తించామని తెలిపారు. తప్పులగుర్తింపు పూర్తయిన తర్వాత విచారణ చేపట్టి రెండు, మూడు నెలల్లోగా సవరణ పూర్తి చేస్తామన్నారు. దీంతో రెవెన్యూ రికార్డుల్లో వివిధ సవరణల కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజు, ఆర్ఐ మురళీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంగం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ల్యాండ్ ప్యూరిఫికేషన్ పనులను ఆత్మకూరు ఆర్డీవో బాపిరెడ్డి పరిశీలించారు. వీఆర్‌వోలతో సమీక్షించారు. వీఆర్వోల సందేహాలను నివృత్తి చేశారు. త్వరలో ల్యాండ్‌ప్యూరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఉమాదేవి, డిప్యూటీ తహసీల్దారు షఫీమాలిక్, ఆర్ఐ రమాదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీ షాలినీదేవి

ఏఎస్‌పేట: రికార్డులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని గుంటూరు రీజనల్ డైరెక్టర్ షాలినీదేవి వైద్య ఆరోగ్య సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం ఆమె చిరమన పీహెచ్‌సీ పరిధిలో ఉన్న హసనాపురం ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. రికార్డుల నమోదు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యులు గోపినాధ్, చిరమన పీహెచ్‌సీ వైద్యుడు రామకృష్ణ, హెచ్‌ఈవో సుబ్బారెడ్డి, ఏఎన్‌ఎం చంద్రకళ ఉన్నారు.

చేజర్ల: గ్రామాల్లోని పేదప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని వైద్య ఆరోగ్యశాఖ గుంటూరు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ షాలినీదేవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చేజర్లలోని ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. చేజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రమీలరాజకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

అనంతసాగరం: అనంతసాగరంలోని సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం బద్వేల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీస్ రోడ్డులో దిగబడింది. రోడ్డు పక్కనే ప్రైవేట్ నెట్‌వర్క్ ఏర్పాటుకు తీసిన గోతులు సరిగా పూడ్చలేదు. బద్వేలు నుంచి సోమశిలకు వస్తున్న బస్సు ఎదురుగా వస్తున్న ట్రాక్టరును తప్పించే యత్నంలో రోడ్డు దిగిన బస్సు ఈ గుంతలో ఇరుక్కుపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.



ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

మాతృభాషను మరువద్దు



బహుమతులు అందచేస్తున్న ఎంఈవో జ్యోతి, లైబ్రేరియన్ నారాయణరావు

ఏఎస్‌పేట: ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా మాతృభాషను మరువరాదని ఎంఈవో జ్యోతి, లైబ్రేరియన్ నారాయణరావు తెలిపారు. మంగళవారం వారు ఏఎస్‌పేటలోని కేజీబీవీలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆంగ్ల మాధ్యమంలో చదివేందుకే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారని, తప్పనిసరిగా ప్రతి ఒక్కరు తెలుగును రాయడం, చదవడం నేర్చుకోవాలని, అదే తెలుగుభాషకు మనం ఇచ్చే గౌరవమన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగుభాషపై పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి లక్ష్మీదేవి, హెడ్స్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై సీఐటీయూ ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

సంగం: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆటో కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. స్పెషల్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీల పేరుతో ఆటో కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు కె.సురేష్ మాట్లాడుతూ ఎందరో యువకులు ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారిని లైసెన్సుల పేరుతో స్పెషల్‌పార్టీ పోలీసులు వేధిస్తున్నారన్నారు. దీంతో 8వ తరగతి వరకూ చదువుకోని డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం తహసీల్దారు ఉమాదేవికి వినతిపత్రం అందచేశారు.యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి సురేష్, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు బాలకృష్ణ, షేక్ నాయబ్‌రసూల్, రంతుల్లా, బుజ్జయ్య, యెహోవా పాల్గొన్నారు.

ఎర్రచందనంపై అవగాహన సదస్సు

మర్రిపాడు: చుంచులూరులో మంగళవారం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వై.రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఎర్రచందనం ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎర్రచందనం రవాణా చేస్తూ పట్టుబడితే, ఐదేళ్ల జైలు, రూ.3 లక్షలు జరిమానా విధిస్తారన్నారు. రవాణా చేస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ లైసెన్సు రద్దు చేస్తారని తెలిపారు. నిందితుల ఆస్తులు జప్తు చేసి, వారి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఎర్రచందనం అక్రమ రవాణాపై 18004250425 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

భూసేకరణకు త్వరలో నోటిఫికేషన్



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

చేజర్ల: చిత్తలూరు, వావిలేరు గ్రామాల్లో కాలువ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్ త్వరలో విడుదల చేయనున్నట్లు తెలుగుగంగ భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటరమణ తెలిపారు. మంగళవారం చిత్తలూరులో పొలాలను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలువాయి మండలం తోటపల్లి వద్ద నిర్మించే రిజర్వాయర్ కాలువలకు ముందస్తు ప్రకటన విడుదల కాకముందే, చిత్తలూరు రైతులు స్వచ్ఛందంగా ముందుకురావడం సంతోషకరమన్నారు. ప్రతి రైతుకు పూర్తి పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతుల వివరాల్లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. తెలుగుగంగ ఎస్ఈ రమణ, సర్పంచు ఎం.పెంచల నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మోదేపల్లి నవకృష్ణచౌదరి పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

అనంతసాగరం: మండలంలోని పలు గ్రామాల్లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వినాయకచవితి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. సోమశిల, శంకరనగరం, మంచాలపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ప్రత్యేక వాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ సోమశిల జలాశయం వద్దకు నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టి ఉత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. శంకరనగరంలో లడ్డూ వేలానికి పోటీ నెలకొంది. ఎం.పెద్దపెంచలనాయుడు రూ.65,500లకు లడు ప్రసాదం దక్కించుకున్నారు. విగ్రహం వద్ద ఉంచిన వరి ధాన్యాన్ని అదే గ్రామానికి చెందిన ఎన్.అంజప్పనాయుడు రూ.20 వేలకు దక్కించుకున్నారు.

ఏఎస్‌పేట: అనుమసముద్రం గ్రామ వినాయకసెంటర్‌లో మంగళవారం మహిళలు, చిన్నారులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందచేశారు. అనంతరం వినాయక విగ్రహన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి పూలు, విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేసి నిమజ్జనానికి తరలించారు. కమిటీసభ్యులు హజరత్తయ్య, చిన్నయ్య, సుబ్బారావు, ఓబులేసు, శాంతమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

మర్రిపాడు: మర్రిపాడులోని ఎస్సీకాలనీ, మిక్స్‌డ్ కాలనీల్లోని గణనాథులకు యువత కేరింతలు, మేళతాళాలు, డప్పులు, బాణాసంచా సందడి నడుమ గ్రామోత్సవాలు నిర్వహించారు.

చేజర్ల: మండలంలోని ఉలవపల్లి, నాగలవెల్లటూరు, తదితర గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించగా మంగళవారం నిమజ్జనం చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, ఉట్టిమహోత్సవాలను నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని బంగ్లాసెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. భక్తుల కేరింతల మధ్య పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

సంగం: సంగంలోని వడ్డిపాళెం, శివాలయం సెంటర్, చెక్‌పోస్టు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం నిమజ్జనం చేశారు. విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి పూలతో సుందరంగా అలంకరించారు. యువకులు, పెద్దలు కేరింతలు కొడుతూ గ్రామోత్సవం నిర్వహించి పెన్నానదిలో నిమజ్జనం చేశారు.



సంగం: నిమజ్జనోత్సవంలో గణనాథుడు



ఆత్మకూరులో నిమజ్జనోత్సవం



సోమశిలలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



చేజర్ల: నిమజ్జనోత్సవంలో యువత కేరింతలు

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఆత్మకూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడా నైపుణ్యం పెంపొందించుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఆర్‌పల్లి జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ సోమా వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తమవంతు చేయూత అందిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయురాలు సుమతిని సన్మానించారు. ఎస్ఎంసీ చైర్మన్ కె.చిన్నయ్య, ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీరాములు, ఉపాధ్యాయులు కల్పన, శోభ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మర్రిపాడు: మర్రిపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు స్నేహకుమార్‌ను మంగళవారం ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఏనిమిదేళ్ల పాటు పాఠశాలలో సేవలందించిన ఆయన, బదిలీ కావడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఆర్‌జీ రాజేంద్రకుమార్, ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే చర్యలు

చేజర్ల: లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బాబిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆదురుపల్లి ప్రధానకూడలి వద్ద వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేని వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. ఏఎస్ఐ రమేష్‌బాబు, పోలీసుసిబ్బంది ఉన్నారు.

పెద్దలే చిన్నారులకు ఆదర్శం

ఆత్మకూరు: పట్టణంలోని రవీంద్రభారతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్‌డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తాతయ్య, అమ్మమ్మలు, నాన్నమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ కె. రాఘవేంద్రరావు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల, ప్రవర్తనపై పెద్దల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జోనల్ ఇన్‌చార్జి వై.శ్రీహరి, డీన్ బి.సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఏఎస్‌పేట: చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు



ఆత్మకూరు: చెక్కులు పంపిణీ చేస్తున్న రాగి వనమ్మ

ఏఎస్‌పేట: పలు వ్యాధులతో అవస్థలు పడుతున్న రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కులను మంగళవారం టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమసముద్రం గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ రఫీకి రూ.20 వేలు, ఏఎస్‌పేట గ్రామానికి చెందిన షేక్ నజీర్ అహ్మద్‌కు రూ.30 వేలు, కావలియడవల్లికి చెందిన చల్లా వెంకటేశ్వర్లుకు రూ.40 వేలను చెక్కుల రూపంలో అందచేసినట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాల్యాద్రి నాయడు, రాజవోలు సొసైటీ చైర్మన్ నారసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ షబ్బీర్, నాయకులు వివేకానంద రెడ్డి, కోటిరెడ్డి, మాధవరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణానికి చెందిన జాగర్లపూడి సుబ్రహ్మణ్యంశర్మకు రూ.1.16 లక్షలు, ఇరుకుమాటి శివకుమార్ రూ.70 వేల చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ రాగి వనమ్మ చేతుల మీదుగా టీడీపీ నేతలు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కోశాధికారి గోగుల మహేంద్ర, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చేజర్ల: టీడీపీ మండల అధ్యక్షుడు మోదేపల్లి నవకృష్ణచౌదరి ఆధ్వర్యం లో కాకివాయికి చెందిన కమ్మ నరసయ్యకు రూ.60,520, బిల్లుపాడుకు చెందిన కొమ్మి చిన్న పెంచలయ్యకు రూ. 1,15,846లు, కమ్మ నరసయ్య కు రూ.60,520లకు చెక్కులు పంపిణీ చేశారు. చేజర్ల సర్పంచు రావి లక్ష్మీనరసారెడ్డి, నాయకులు రాంబాబు, అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, ఉడతా హజరత్తయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చేజర్ల: చెక్కులు అందచేస్తున్న టీడీపీ నాయకులు

రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఖాళీ ఖాయం

ఆత్మకూరు: టీడీపీపై నమ్మకంతోనే నంద్యాల ప్రజలు పట్టంకట్టారని టీడీపీ పట్టణాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడుని తిడితే ఓట్లు రావని వైసీపీ నేతలు గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోగా వైసీపీ ఖాళీ అవడం ఖాయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాగి వనమ్మ మాట్లాడుతూ చంద్రబాబు పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మరో సారి స్పష్టమైందన్నారు.

ఏఎస్‌పేట: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు మాల్యాద్రి నాయుడు, రాజవోలు సొసైటీ చైర్మన్ నారసింహారెడ్డి, నాయకులు వివేకానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నిక అందుకు పునాది అని తెలిపారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా టీడీపీ ఘనవిజయం ఖాయమన్నారు. ఎంపీటీసీ షబ్బీర్, కోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

కొడుకు అన్నం పెట్టడం లేదు

● పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు



నరసయ్య

చేజర్ల: కుమారుడు తనను పట్టించుకోవడం లేదంటూ లేబాక నరసయ్య (75) అనే వృద్ధుడు మంగళవారం చేజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంపై వచ్చే ఆదాయాన్ని తీసుకుంటున్న కుమారుడు లేబా క సుందరయ్య, తన పోషణను మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు అన్నం పెట్టేవారు కూడా లేరని, తనకు వచ్చే రేషన్‌బియ్యం కూడా ఇవ్వకపోవడంతో పూట గడవడం కష్టంగా మారిందని వాపోయాడు. పోలీసులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

మర్రిపాడులో పిడుగుపాటు

సంగం: మర్రిపాడులో సమీపంలోని పొలాల్లో సోమవారం రాత్రి పిడుగుపడింది. దీంతో ముళ్ల పొదలకు మంటలు అంటుకున్నాయి. జన సంచారం లేని ప్రాంతంలో పడడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

శిక్షణ తరగతులకు టీడీపీ నేతలు

అనంతసాగరం: ప్రకాశం జిల్లా కందుకూరులో జరుగుతున్న టీడీపీ శిక్షణ తరగతులకు మండలంలోని లింగంగుంట, మంచాలపల్లి, ముస్తాపురం, పాతాళపల్లి, గౌరవరం గ్రామాలకు చెందిన నేతలు తరలివెళ్లారు. టీడీపీ బలోపేతమే లక్ష్యంగా తాము పని చేస్తామని లింగంగుంటకు చెందిన ఎం.సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, తదితరులు తెలిపారు

వెళ్లిరావయ్యా.. గణనాథా..

● ఐదవ రోజు నిమజ్జనోత్సవం


వాకాడు: నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు

తూపిలిపాళెం(వాకాడు): మండలంలోని తూపిలి పాళెం సముద్ర తీరంలో మంగళవారం ఐదవ రోజు నిమజ్జనానికి భక్తులు తరలి వచ్చారు. తీరంలో అన్ని భారీ విగ్రహాలే దర్శనమివ్వడం ఆకర్షణగా మారింది. దాదాపు నిమజ్జనాలు చివరి రోజు కావడంతో భక్తుల సంఖ్య ఎక్కువగా కనిపించింది. వారిలోనూ అధిక సంఖ్యలో మహిళా భక్తులు తీరంలో సందడి చేశారు. అదేవిధంగా మహిళలు సముద్ర స్నానాలు చేసి సముద్రపు ఇసుకను ముద్దలుగా చేసి పసుపు, కుంకుమతో అలంకరించి, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

గోవిందపల్లిపాళెం(కోట): మండలంలోని గోవిందపల్లి పాళెం, కొత్తపట్నం, శ్రీనివాససత్రం గ్రామాల సమీపంలోని బంగాళాఖాతంలో మంగళవారం గణనాథుల నిమజ్జనాలు జరిగాయి. పలు మండలాలకు చెందిన యువత కేరింతలు కొడుతూ వినాయక విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా వీరారెడ్డిసత్రం, ప్రకాశం కాలనీలలో వినాయక విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. ప్రకాశం కాలనీలో గణనాథుడి ఊరేగింపు సమయంలో మహిళలు ఆటపాటలతో అలరించారు. పలు గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


గూడూరు: కోనేటిమిట్టలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


గూడూరు: సత్రపువీధిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

గూడూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదో రోజైన మంగళవారం నిమజ్జనానికి తరలించారు. స్వామి వారికి ముందుగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక కుమ్మరవీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దూర్జటినగర్, రాణీపేట, ముత్యాలపేట, అశోక్‌నగర్, సత్రపువీధి, కోనేటిమిట్ట తదితర కూడళ్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆటోలు, ట్రాక్టర్లలో విగ్రహాలను ఉంచి ఆర్చిలు కట్టి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి యువకుల చిందుల మధ్య బాణసంచా పేలుస్తూ బ్యాండు మేళాలతో సందడిగా కదిలాయి. బ్యాండ్ మేళాల మధ్య రంగులు చల్లుకుంటూ తరలించారు. పలు చోట్ల ఉట్టి మహోత్సవాలు నిర్వహించారు. కోనేటి మిట్ట వినాయక విగ్రహం వద్ద ఉంచిన లడ్డూ వేలం పాటలో కోటకు చెందిన ఉప్పాల మణి రూ.6700 పాడుకుని భక్తులకు పంచిపెట్టారు. నిమజ్జనానికి వినాయక విగ్రహాలను వాకాడు మండలం తూపిలిపాళెంకు తరలించడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.


వాకాడు: పూజలు చేస్తున్న మహిళలు


గూడూరు: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


కోట: నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు


కోట: విద్యానగర్‌లో చిందులేస్తున్న మహిళలు

తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు

గూడూరు(రూరల్): భారతీయ శిక్షణ మండలి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. శిక్షణ మండలి సభ్యుడు ప్రజేంద్రరెడ్డి, హెచ్‌ఎం రవి చంద్రారెడ్డిలు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు గ్రాంధిక భాషలో ఉన్న ప్రజల భాష అయిన తెలుగును వ్యవహారిక భాషగా తీసుకు వచ్చేందుకు 30 ఏళ్లు కష్టపడ్డారన్నారు. హాకీ క్రీడలో ధ్యాన్‌చంద్ దేశంలోని క్రీడాకారులకు ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువులు, క్రీడలలో రాణించాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చక్రపాణి, మురళీమోహన్, భాస్కర్ పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడాదినోత్సవాలు నిర్వహించి విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, రబ్బాని, శ్రీకాంత్ పాల్గొన్నారు. స్థానిక రోటరీ భవన్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు పాఠశాలలకు క్రీడలలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జానికిరామిరెడ్డి, మునిగిరీష్, బాలకృష్ణంరాజు, దశరధరామిరెడ్డి, హరిప్రసాద్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


వాకాడు: గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో


కోట: జ్యోతి వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణమోహన్‌రావు

చిల్లకూరు: పారిచెర్లవారిపాళం, పున్నపువారిపాళెం, రెట్టపల్లి, తిక్కవరం, చిల్లకూరు పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి 150వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సురేంద్ర మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వరిదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కళ్యాణి, వీవీ కుమార్, శివరామిరెడ్డి, చంద్రమ్మ పాల్గొన్నారు. తిక్కవరం ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా జడ్పీటీసీ యమునమ్మ క్రీడాజ్యోతిని వెలిగించి విద్యార్థులకు క్రీడాపోటీలు ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, పిచ్చయ్యనాయుడు, రమేష్‌బాబు పాల్గొన్నారు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజా, పీడీ అమ్మాజీ, ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రగతి విద్యాసంస్థలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగాధిపతులు డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ గాదె శ్రీనివాస్, విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాకాడు: తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాశీపురం ప్రాథమిక పాఠశాలలో గిడుగు రాంమూర్తి పంతులు చిత్రపటానికి ఎంఈవో బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రాంమూర్తి చేసిన సేవలు కొనియాడారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. అదేవిధంగా నెల్లిపూడి ప్రాథమిక పాఠశాలలో ఎంవీరావ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిడుగు రాంమూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఐవీ రమణయ్య, కిషోర్ పాల్గొన్నారు.


గూడూరు(రూరల్): నివాళులర్పిస్తున్న విద్యార్థులు


గూడూరు(రూరల్): నృత్యం చేస్తున్న విద్యార్థినులు


చిల్లకూరు: క్రీడాజ్యోతిని వెలగిస్తున్న యమునమ్మ

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	వివేకం
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	విఐపి 2
సంగం:	అర్జున్‌రెడ్డి

కోట

ఆర్‌ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే పాశం



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు: నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చొరవ చూపాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మంగళవారం నెల్లూరులో కలెక్టర్ ముత్యాలరాజుకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్కాగృహాల నిర్మాణాలకు ఆయా గ్రామాలలో అందుబాటులో ఉన్న రీచ్‌ల నుంచి ఇసుక తరలించుకునేలా వెసులుబాటు కల్పించాలన్నారు. అదేవిధంగా పొజిషన్ సర్టిఫికెట్లు త్వరిగతిన లబ్ధిదారులకు అందించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట పాపారెడ్డి మనోజ్‌రెడ్డి ఉన్నారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించానన్నారు.

పకడ్బందీగా భూముల ప్యూరిఫికేషన్

● పరిశీలనలో 12 లక్షల దరఖాస్తులు ● కలెక్టర్ రేవు ముత్యాలరాజు

కోట: భూ సమస్యలు తగ్గించేందుకు చేపట్టిన భూముల ప్యూరిఫికేషన్ కార్యక్రమం పకడ్బందీగా ఉండాలని, ఎలాంటి లోపాలు జరిగినా సహించేది లేదని కలెక్టర్ రేవు ముత్యాలరాజు హెచ్చరించారు. కోట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం భూముల ప్యూరిఫికేషన్‌పై వీఆర్‌వోలు, ఆర్‌ఐలు, తహసీల్దార్‌తో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ భూముల ప్యూరిఫికేషన్ భూ సమస్యలు ఉన్న రైతుల కోసం కలక్టరేట్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశామన్నారు. భూముల కొనుగోళ్లు, విక్రయాలు వంటి వాటిలో లోపాలు సరిదిద్దేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా జిల్లాలో భూ సమస్యలు అత్యధికంగా ఉన్న పలు మండలాల రైతులకు ఇది వరం లాంటిదన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలోని పలు మండలాల నుంచి 12 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా దరఖాస్తులన్నీ చిన్నచిన్న తప్పులు సరిదిద్దుకోవడం కోసమేనన్నారు. ఇందుకోసం జిల్లాలో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామని, వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను ఈ టీమ్ ద్వారా తహసీల్దార్లకు వెళతాయన్నారు. ఈ ప్రక్రియను డిసెంబర్ 31లోపు పూర్తి చేస్తామన్నారు. గూడూరు డివిజన్‌లో భూముల రికార్డులలో తప్పులు, తడకలు సరిచేసేందుకు 2.77లక్షల అర్జీలు వచ్చాయన్నారు. అందులో కోట మండలంలోని 16 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 35,719 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో 288 దరఖాస్తులు అప్‌లోడ్ చేశామన్నారు. ఈ విధంగా జిల్లా మొత్తం మీద వచ్చిన 12లక్షల అర్జీలకు సంబంధించి 1.91లక్షల దరఖాస్తులను పరిష్కార మార్గం దిశగా అప్‌లోడ్ చేశామన్నారు. 4లక్షల దరఖాస్తులు పాసుపుస్తకాలలో పట్టాదారు, అనుభవ దారుడిపేరు సక్రమంగా లేవని, మరో 35వేల దరఖాస్తులలో ఆధార్ నెంబర్లు తప్పులు తడకలుగా ఉన్నాయని వచ్చాయన్నారు. మరో 1.75 లక్షల దరఖాస్తులలో పట్టాదారుడు ఉన్నప్పటికీ అనుభవ దారుడి పేరుతో భూమి ఉన్నట్లు ఖాతాదారు నెంబర్లు పూర్తిగా మారిపోయినట్లుగా దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలో 77వేల ఎకరాల మాగాణి, మెట్ట భూముల్లో సర్వేచేసి రైతులకు వారి పాసుపుస్తకాలలో ఉన్న భూములను కేటాయిస్తామన్నారు. ఇలాంటి ప్రక్రియ జరిగే సమయంలో రైతులు రెవెన్యూ అధికారులకు, మరే ఇతర శాఖల అధికారులకు ఎలాంటి నగదు చెల్లింపులు చేయవద్దన్నారు. అలా చెల్లించాలని రైతులపై వత్తిళ్లు తెస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు చేపడుతానన్నారు. అదేవిధంగా జిల్లాలో 28 ఇసుక రీచ్‌లు ఉన్నాయన్నారు. ఆ రీచ్‌ల ద్వారా ఇసుకను మైనింగ్ ఏడీ అనుమతితో రవాణా చేసుకోవచ్చన్నారు. ఇసుక రీచ్‌లో దిగే ప్రతి వాహనం కచ్చితంగా జీపీఎస్ సదుపాయం కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆర్డీవో అరుణ్ బాబు, తహసీల్దార్ రోజ్ మాండ్, ఎంపీడీవో బ్రహ్మయ్యతో కలెక్టర్ ముత్యాలరాజు ప్రత్యేకంగా చర్చించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు

‘నారాయణ’లో జాతీయ క్రీడల దినోత్సవం



మాట్లాడుతున్న రమణ

గూడూరు: స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడాకారుడు మేజర్ ధ్యానచంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి సంచాలకులు రమణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలల్లోనూ రాణించాలన్నారు. క్రీడలపై దృష్టి సారించడం ద్వారా మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. క్రమంగా వ్యాయామం చేయడం వలన మేథో సంపత్తి కలిగి సమాజానికి ఉపయోగపడే పౌరుడుగా మారుతారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత నిస్తున్నాయన్నారు. ప్రతి జల్లా నుంచి క్రీడాకారులను వివిధ పోటీలకు పంపుతూ వారికి సదుపాయాలు అందిస్తుందన్నారు. ధ్యాన్‌చంద్ తన క్రీడా ప్రతిభతో హాకీ క్రీడకు తలమానికంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం పంపిణీ

గూడూరు(రూరల్): మండల పరిధిలోని గోగినేనిపురం విద్యుత్ కార్యాలయంలో వాకాడు మండలం గంగనపాళెం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన కాంట్రాక్టు సిబ్బంది కామిరెడ్డి సురేష్‌రెడ్డి కుటుంబానికి మంగళవారం విద్యుత్ శాఖ ఆర్థిక సహాయం అందించింది. సంస్థ నుంచి రూ.2 లక్షలు చెక్కును పరిహారం కింద మృతుడి భార్య కామిరెడ్డి సుధకు విద్యుత్ శాఖ డీఈ అనిల్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, కోటారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడులో వైద్యశిబిరం

కోట: మండలంలోని చిట్టేడులో మంగళవారం క్రీమ్ లైన్ డెయిరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పాడి రైతులు వచ్చి పశువులకు పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. పశువులలో వచ్చే వ్యాధులు, వాటి నివారణపై పశు వైద్యుడు బాల బ్రహ్మం సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

అద్దేపల్లి(చిల్లకూరు): మండలపరిధిలోని అద్దేపల్లి గ్రామంలో మంగళవారం మేకల రంగమ్మ గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం మేరకు రంగమ్మ కుటుంబ కలహాలతో మనస్తానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న రంగమ్మను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతులకు అవగాహన సదస్సు

గూడూరు(రూరల్): మండల పరిధిలోని పురిటిపాళెం గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏవో నాగమోహన్‌రావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవడం ద్వారా రైతులు ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హైమావతి, నాగమణి, గాయత్రి, శివయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీల పెత్తనం సహించం

కోట: ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌ల నుంచి మంజూరు చేసే రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో జన్మభూమి కమిటీలు పెత్తనం చెలాయిస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని, వారి పెత్తనాన్ని సహించమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పనబాక కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. మండలానికి మంజూరైన యూనిట్లకు సుమారు 1500 మంది దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారులకు అధికారులకు బదులు జన్మభూమి కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించడం బాధాకరమన్నారు. దీని వల్ల అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల విషయంలో నేదురుమల్లి పద్మనాభరెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిల మధ్య వివాదం వారి కుటుంబ సమస్య అని, ఈ విషయాన్ని పార్టీకి అంటకట్టకూడదన్నారు. కొంతమంది బీజేపీ పేరు చెప్పుకుని ఆ వివాదాన్ని పెద్దది చేసేందుకు పత్రికల్లో ఖండన ఇవ్వడం సబబుకాదన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ పాదర్తి కోటారెడ్డి, దళితమోర్చా అధ్యక్షుడు సుబ్బరామయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పామంజి కృష్ణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పనబాక కోటేశ్వరరావు

మిలియన్ మార్చ్ గోడపత్రిక ఆవిష్కరణ

గూడూరు(టౌన్): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం సెప్టెంబరు ఒకటిన విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను తహసీల్దారు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇస్తున్న పెన్షన్ విధానాన్ని రద్దు పరిచి సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సీపీఎస్ విధానాన్ని రద్దు పరిచి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని కోరుతూ చేపడుతున్న మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్, ప్రసాద్, అజ్మతుల్లా ఖాన్, కమలాకర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మిలియన్ మార్చ్ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు

నాగార్జున జన్మదిన వేడుకలు

కోట: పట్టణంలోని ప్రభుత్వ 30 పడకాల ఆసుపత్రిలో సినీ నటుడు అక్కినేని నాగార్జున 59వ పుట్టినరోజు వేడుకలు మంగళవారం చెందోడుకు చెందిన ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, నిర్వాహకులు లీలామోహన్, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

Before the Honourable Deputy Registrar of Chits at Gudur
D.C.P.No.3/2017
Vajrankura Chit Funds Pvt.Ltd., Naidupet Branch, rep.by its Legal officer ... Disputant
Vs
1. Gaddam Suneel and 3 Others ... Opponents
Notice
To,
Opp-3: Mylavarapu Venkata Balaji Sukumar S/o. M.V.Narayana, Occ:- Senior Asst. U.P.H.C. Balireddypalem, Nellore District. R/o. D.No. 3/48, East Street, Opp:- Excise Police Station, Vakadu, Nellore District.
Opp-4: Naruboina Kondaiah S/o. N.Nagaiah, Occ:- J.S.W. At D.S.R. Govt. District Head quarters hospital, Nellore. R/o. D.No. 11-33-636, Near:- Enughelam church, Balakrishna Reddy Nagar, Kavali, Nellore District.
పై నెంబరున డిస్‌ప్యూటెంట్ పైన తెలిపిన గూడూరు డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం **తే.08-09-2017దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం 11.00 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుకోవల సినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
సి.రఘునాథరెడి, B.A., B.L.,
డిస్‌ప్యూటెంట్ తరపు అడ్వకేట్, గూడూరు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

తడ : సెప్టెంబరు 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 1వ తేదీ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ఆటలపోటీలను నిర్వహించనున్నామని ఎంఈవో పూర్ణచంద్రరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ ఆటలపోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం రోజు బహుమతుల ప్రదానం చేస్తామని ఆయన ప్రకటనలో తెలియజేశారు.


రామకృష్ణాపురంలోని వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువత

కోలాహలంగా..

● కొనసాగుతున్న వినాయక విగ్రహ నిమజ్జనాలు

వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా 5వ రోజు నాయుడుపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వివిధ రూపాల వినాయక విగ్రహాలను నిమజ్జనానికి మంగళవారం భారీగా తరలివెళ్లాయి. వినాయకస్వామి నిమజ్జనానికి తరలివెళ్లే మునుపు అనేక చోట్ల ఉట్టి మహోత్సవాలను నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువత ఎంతో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. వినాయకస్వామి విగ్రహాలు ఏర్పాటు చేసిన చోట అన్నదానాలు నిర్వహించారు. రామకృష్ణాపురంలో వినాయకస్వామి లడ్డు 26,100 రూపాయలు ధర పలికింది. మురారి సెంటర్‌లో లడ్డును 10వేల రూపాయలకు షేక్. అన్వర్, అలీమ్, సీహెచ్ సాయి, ఎం. సాయి, సాయికుమార్ దక్కించుకున్నారు. రామకృష్ణాపురం, రాజగోపాలపురంలోని విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా జరిగింది. ఆయా కార్యక్రమాల్లో వంశీ, వెంకటాద్రి, బాలాజీ, సాధుమోహన్, హంస అశోక్, శివ, మదన్ తదితరులు పాల్గొన్నారు. - నాయుడుపేట


రాజగోపాలపురంలో మంగళవాయిద్యాల నడుమ వినాయక విగ్రహ ఊరేగింపు

నాయుడుపేటలో

సంపూ సందడి

● సెల్ఫీలతో చుట్టుముట్టిన అభిమానులు

నాయుడుపేట : సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు నాయుడుపేటలో మంగళవారం సందడి చేశారు. తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకొని తిరిగి హైదరాబాదుకు రోడ్డు మార్గంలో వెళుతూ నాయుడుపేటలో కొద్దిసేపు ఆగారు. నాయుడుపేట పాతబస్టాండ్ వద్ద గుడ్‌మార్నింగ్ టీస్టాల్ నిల్చున్న సంపూర్ణేష్ బాబును అభిమానులు చుట్టుముట్టారు. అభిమానులు ఆయనతో మాట్లాడటంతోపాటు షేక్‌హ్యాండ్‌లిచ్చారు. యువకులు మాత్రం సంపూతో సెల్ఫీలు దిగారు.


సంపూర్ణేష్ బాబుతో సెల్ఫీ దిగుతున్న అభిమాని

సినిమా గైడ్

నాయుడుపేట

సీఎస్‌తేజ : వివేకం
మురారి : వీఐపీ-2
శ్రీవెంకటేశ్వర : అర్జున్‌రెడ్డి

సూళ్లూరుపేట

శ్రీలక్ష్మి : అర్జున్‌రెడ్డి
ఎన్‌వీఆర్ : వివేకం

విద్యాలయాల్లో ధ్యాన్‌చంద్‌కు ఘననివాళి


వాలీబాల్ ఆడుతున్న శ్రీచైతన్య విద్యార్థులు


చిట్టమూరులో..

నాయుడుపేట : నేడు ప్రపంచంలో అన్ని రంగాలలో తీవ్ర ఒత్తిడి నెలకొందని అందుకు ప్రత్యామ్నాయంగా మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.సరళ కుమారి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాల వ్యాయామా అధ్యాపకులు పి. నారాయణ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ధ్యాన్‌చంద్ హాకీ పోటీలో ఎనలేని విజయాలు సాధించి దేశానికి వన్నె తెచ్చారన్నారు. శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ అంబటి రవీంద్ర, ఏజీఎం శ్రీకాంత్, పీఈటీలు మహేష్, అనిల్ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్టమూరు : స్థానిక గణపర్తి మార్కెండేయల నాయుడు ఉన్నత పాఠశాలలో మంగళవారం హాకీ మాంత్రికడు మేజర్ ధ్యాన్‌చంద్ 113వ జయంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నబీయుల్లా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ధ్యాన్‌చంద్ భారతదేశానికి ఏన్నో పతకాలు తీసుకొచ్చి కీర్తి పెంచారన్నారు. ఫిజికల్ డైరెక్టర్ భరత్‌మహిపతి ధ్యాన్‌చంద్ చరిత్రను విద్యార్థులకు వివరించారు. క్రీడల ద్వారా ఆరోగ్యం, చదువు, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్ర్యకమంలో పద్మావతి, మేరీరూత్, వెంకటేశ్వరావు, చక్రవర్తి, సురేందర్ రెడ్డి, సుభాషిణి, అజ్మతుల్లాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

చిట్టమూరు : మండల పరిధిలోని పలు పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఆర్టీసీ ఆర్టీసీ బస్‌పాస్‌లు అందజేశారు. ఈశ్వరవాక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఆలేటిపాడు, మన్నెమాల ప్రాథమిక పాఠశాలలో 180 మంది విద్యార్థులకు ఆర్టీసీ అధికారుల ఆధ్వర్యంలో బస్‌పాస్‌ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యా ర్థుల బస్‌పాస్‌లకు అవసరమైన నిధులు సమకూర్చిన జన్మభూమి కమిటీ సభ్యులు టీడీపీ నేతలు కస్తూరయ్య, జనార్థన్‌రెడ్డి చేతులు మీదుగా ఈ పాసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఎస్ఆర్ చంద్రయ్య, సుబ్రహ్మణ్యంనాయుడు, హెచ్ఎం శ్రీనివాసులుమూర్తి, లీలారాణి, తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో బస్‌పాస్‌ల దాతలు

తడలో పెరుగుతున్న జ్వరపీడితులు

తడ : తడ మండలంలో జ్వరపీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. మండల పరిధిలోని ఇరకం, ఇరకంకుప్పం, భీముల వారిపాళెం, రామాపురం, తడ, తడకండ్రిగల్లో వీరి సంఖ్య అధికంగా ఉంది. ఇటీవల వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలుతున్నాయని వైద్యాధికారులు నిర్ధారణకు వచ్చారు. అలాగే బీవీపాళెంలో టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. జ్వరపీడితులు ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అలాగే తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఆరంబాకం, ఎలాఊరు ప్రాంతాలలో విషజ్వరాలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి.

జాతీయ రహదారిపై మినీలారీ బోల్తా

ఓజిలి: ఓజిలి మండలం రాజుపాళెంకు సమీపంలో జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారుజామున మినీ లారీ బోల్తాపడింది. నెల్లూరు నుంచి చెన్నైవైపు పచ్చి మామిడి కాయల లోడుతో వెళుతున్న మినీ లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనతో లారీలోని మామిడి కాయలు రోడ్డంతా పడిపోయాయి. దీంతో ఆవైపు వెళ్లే వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. కాగా ఈసంఘటనపై లారీ యజమాని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేందుకు నిరాకరించి లారీని తీసుకుని వెళ్లిపోయాడు.

శ్రీశైలంలో కైకాల అన్నదాన సత్రం ఏర్పాటు


కైకాల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న వీరమల్లికార్జున్‌రావు

నాయుడుపేటరూరల్ : శ్రీశైలంలో కైకాల అన్నదాన సత్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘ నాయకులు వీరమల్లికార్జున్‌రావు తెలిపారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలంలో శ్రీ భమరాంబ మల్లికార్జున కరికాల భక్త కైకాల కైకోలిన్ అన్నదాన సత్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పాల్గొన్న పలువురు భవన సత్రం ఏర్పాటుకు ఆర్థిక చేయూతనందించారు. జడ్పీటీసీ శ్రీరామ్ ప్రసాద్ కైకాల సోషల్ వెల్ఫేర్‌కు పేద విద్యార్థుల విద్యాభ్యాసాల తోడ్పాటుకు 50వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కైకాల సంఘ నాయకులు నరసింహారావు, శ్రీరామమూర్తి, శివరామ ప్రసాద్, సత్యనారాయణ, రామభద్రరాజు, వెంకటేశ్వర్లు, గోపాల్, సూరి, ప్రకాశం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేకే పాళెంలో 'పొలం పిలుస్తోంది'

చిట్టమూరు: మండలంలోని బురదగాలి కొత్తపాళెం, కుమ్మరిపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ పాల్గొని కౌలుదారులు, సాగు ధ్రువీకరణ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈవో ఎర్రబోతు సురేష్, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్

నేడు మండల సమావేశం

ఓజిలి: ఓజిలి మండల సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు పసుపులేటి రమేష్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో విద్య, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, రెవెన్యూ, ఎన్ఆర్ఈజీఎస్, అంగన్‌వాడీ, విద్యుత్, పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

రెడ్‌క్రాస్‌చే విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు పాస్‌లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. ఆర్టీసీ ఉచితంగా విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించినా పాసుల కోసం ఒక్కొక్కరు 40 రూపాయల చొప్పున ఖర్చు చేయాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు ఎక్కువగా ఉండటంతో వారి బస్ పాస్‌లకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు నగదు చెల్లించి వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భగవాన్‌దాస్, చాంపియన్ చంద్రారెడ్డి, వెంకటేష్, ఐ. శ్రీధర్, ఆర్టీసీ అధికారిణి హరీకారెడ్డి, యూనియన్ నేత శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సాంప్రదాయాలకు అద్దం పడతాయి



మహిళలకు బహుమతులు అందజేస్తున్న కలికి

నాయుడుపేటరూరల్ : పండుగలు భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దంపడతాయని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి అన్నారు. నాయుడుపేట ఎన్ఎస్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం స్థానికులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఆటలపోటీలలో ప్రతిభ కనపరచిన వారికి మాధవరెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఉత్సవం అనంతరం అన్నదానం నిర్వహించి విగ్రహ నిమజ్జనానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువత జిల్లా ఉపాధ్యక్షులు పోట్లపూడి రాజేష్, రామ్‌లక్ష్మణ్, జెమిని తదితరులు ఉన్నారు.

మన్నారుపోలూరులో వైద్యశిబిరం

సూళ్లూరుపేట : మన్నారుపోలూరు గ్రామంలో మంగళవారం నారాయణ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

జీవించే హక్కును హరించవద్దు

కోవూరు: రవాణా కార్మికుల జీవించే హక్కును అధికారులు హరించకూడదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోనె దయాకర్‌రావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ పేరుతో కార్మికుల జీవనోపాధిని అధికారులు హరించివేయడం తగదన్నారు. ఆటోలు, వాహనాల్ని నడుపుకొంటూ జీవించే రవాణా కార్మికులు ఇటీవల కాలంలో అధికారుల నిరంకుశత్వానికి గురై పనిదినాల్ని కోల్పోతున్నారనీ చెప్పారు. ప్రభుత్వం ధోరణిని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాల్ని ఎదుర్కొవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు గండవరపు శేషయ్య, భాస్కరయ్య, సురేష్, ఖాదర్‌బాష, మల్లికార్జున, హరి, శేషమ్మ తదితరులు మాట్లాడారు.

తేనెలూరే తెలుగు గొప్పదనం



నాయుడుపేట: తెలుగుతనం ఉట్టిపడేలా సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు



సూళ్లూరుపేట: కవితల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గురుకుల ఉపాధ్యాయులు

నాయుడుపేట : దేశభాషలందు తెలుగులెస్స... తేనెలూరే తెలుగు పద జాలం... తెలుగుభాష గొప్పదం... ప్రతి తెలుగువాడు గర్వించదగ్గ విషయమని శ్రీచైతన్య ప్రిన్సిపాల్ అంబటి రవీంద్ర అన్నారు. తెలుగు మాతృ భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో మంగళవారం తెలుగుతనం ఉట్టిపడేలా తెలుగు సంప్రదాయ వేషధారణలతో చిన్నారులు అలరించారు. తెలుగుగొప్పతనాన్ని చాటుతూ విద్యార్థులు అనేక పద్యాలు, గేయాలు, నృత్యాలు, నాటికలతో అలరించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ మాతృభాష తెలుగును ప్రతి ఒక్కరు అమ్మలాగ గౌరవించాలని అన్నారు. ప్రపంచదేశాలను శాసిస్తున్న ఆంగ్ల పదాలు కేవలం 26 అక్షరాలు మాత్రమే ఉండగా తెలుగులో దాదాపు 56 అక్షరాలతో సంపూర్ణ భావ వ్యక్తికరణ, భావోద్వేగాలకు, ఆనందోత్సాహాలు ఉంటాయన్నారు. గతంలో తెలుగువారికి గ్రంథాలు, పుస్తకాలు కేవలం సంస్కృతం, గ్రాంధికంలోనే ఉండేవన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగు సంస్కృతి పెంపొందించేందుకు గిడుగురామమూర్తి సరళమైన రీతిలో తెలుగుభాషాభివృద్ధిని చేశారన్నారు. పూడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శశిధర్, జి. వెంకటేశ్వర్లు, తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు భాషా ప్రావీణ్యంపై



చిట్టమూరులో..

పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం ప్రిన్సిపాల్ జి. సరళ కుమారి, తెలుగు విభాగాధిపతి ఎం. భీమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విన్నమాల ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె. లక్ష్మినారాయణరాజు తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా సాంప్రదాయ దుస్తుల వేషాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ కవుల పరిచయ చిత్రాలను విద్యార్థినులు ప్రదర్శించారు. తెలుగుబాలుడు నీవు తెలుసుకో అనే చిన్న కవితల పుస్తకాన్ని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పెంచల్ లక్ష్మి ఆవిష్కరించారు. అలాగే క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు లావణ్య, మణెమ్మ, ప్రసన్న, లత, సుబ్బమ్మ, నీల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం గిడుగురామమూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృభాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత తెలుగు అధ్యాపకులు రాష్ట్ర, జాతీయ, ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్. జనార్ధన్‌రావు తెలుగువిశిష్ఠతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ సాయిరాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏజీఎం శ్రీకాంత్, డీన్ వెంకటేశ్వర్లు, రాధిక, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు : మండలంలోని మెట్టు, చిట్టమూరు, అరవపాళెం, గునపాడు, ఆరూరు, మల్లాం, మొలకలపూడి, యాకశిరి, ఈశ్వరవాక ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ఆలపాటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పంటకాలువల్లోకి మురుగునీరా..!

● అధికారులను ప్రశ్నించిన ఎంపీ



పంటకాలువను పరిశీలిస్తున్న ఎంపీ వరప్రసాద్

సూళ్లూరుపేట : పంటలకు నీరందించే నెర్రికాలువలోకి సూళ్లూరుపేట మురుగునీరు వదిలితే ఎలా అంటూ తిరుపతి ఎంపీ వరప్రసాద్ మున్సిపల్ డీఈ నాగేశ్వరరావును ప్రశ్నించారు. నెర్రికాలువలోకి పేట డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో ఇటీవల రైతులు ఆగ్రహించి ఆందోళన చేసిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం నెర్రికాలువను పరిశీలించారు. వినాయక గుడివద్ద మురుగునీరు కాలువలోకి వదులుతుండటాన్ని పరిశీలించారు. తాను కలెక్టర్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

లక్ష్మయ్యకు సింహపూరి స్పోర్ట్స్ ఫౌండేషన్ అవార్డు

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట లక్ష్మణ్‌నగర్‌కు చెందిన దివ్యాంగ జాతీయ క్రీడాకారుడు మామిడి లక్ష్మయ్యకు సింహపూరి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఉత్తమ క్రీడాకారుడు అవార్డు అందజేసింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డు అందించారు. నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. స్థానిక నాయకులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.



జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నుంచి అవార్డు అందుకుంటున్న లక్ష్మయ్య

క్రైస్తవుల శ్మశాన వాటిక ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న విజయభాస్కర్ రెడ్డి

నాయుడుపేట: నాయుడుపేటలో సార్వత్రిక క్రైస్తవ శ్మశాన వాటిక ఏర్పాటుకు కృషిచేస్తామని మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ శిరసంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలోని అగ్రహారపేట ఈసీఐ చర్చిలో పాస్టర్స్ అండ్ లే లీడర్స్ ఫెలోషిప్ ద్వితీయ వార్షికోత్సవ మహాసభకు ఆయన హాజరయ్యారు. ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ. డేవిడ్‌రాజు అధ్యతన జరిగిన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటి సమావేశంలో ఈ మేరకు శ్మశాన వాటిక అంశాన్ని అజెండాలో చేర్చి తీర్మానం చేస్తామన్నారు. అదే సమయంలో స్థలం కేటాయించడం విషయంలో రెవెన్యూ అధికారులతో మాట్లాడతామని పాస్టర్లకు హామీఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మైలారి శోభారాణి, డీసీసీబీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న బిషప్ చంద్రన్, కుమరన్‌వేలు వాక్యోపదేశం అందించిన అనంతరం రెవ. తిమోతిలతో కలసి హాజరైన పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు.

నూకాలమ్మ ఆలయంలో చోరీ

వెంకటాచలం: మండల పరిధిలోని పూడిపర్తి గ్రామ నూకాలమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పూడిపర్తి గ్రామం నూకాలమ్మ ఆలయానికి పూజారి సోమవారం రాత్రి 7 గంటలకు తాళాలు వేసి వెళ్లాడు. అయితే మంగళవారం ఉదయం ఆలయం తెరిచేందుకు వచ్చిన పూజారికి తలుపుల తాళాలను పగులగొట్టి ఉండాన్ని గమనించాడు. లోనికి వెళ్లి చూడగా రెండు హుండీలు మాయమైనట్లు గుర్తించాడు. ఈ రెండు హుండీల్లో సుమారు రూ.20 వేలు ఉంటాయని పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవహారిక భాషోద్యమకర్త గిడుగు రామ్మూర్తి

- ఘనంగా తెలుగు భాష దినోత్సవం
- విద్యార్థులకు ఆటల పోటీలు
- విజేతలకు బహుమతులు


పొదలకూరు : 'గిడుగు' చిత్రానికి పలువురి నివాళులు


పరుగు పోటీకి సిద్ధంగా విద్యార్థులు

పొదలకూరు: 20వ శతాబ్దపు ప్రారంభంలో గ్రాంధిక భాషను కాదని సామాన్య ప్రజలు మాట్లాడే వ్యావహారిక భాషావ్యాప్తి కోసం నిర్విరామ కృషి చేసిన గొప్ప పండితుడు గిడుగు రామ్మూర్తి పంతులని ఎంఈవో బాలకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం గిడుగు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ గిడుగు జయంతిని తెలుగు భాష దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సవరజాతి కోసం ప్రత్యేకంగా వాచకాలు, నిఘంటువులు రాసి, పాఠశాలలు నెలకొల్పిన మహనీయుడు గిడుగు అని కొనియాడారు. తెలుగుభాష కోసం ఆయన చేసిన సేవలకు ప్రభుత్వం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించిందన్నారు. అలాగే జాతీయ ఆటల దినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యార్థినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల దినోత్సవం

మండలంలోని తాటిపర్తి వైకేకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవిప్రసాద్ మాట్లాడుతూ ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ సేవలను కొనియాడారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాల క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషాదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తేనె కంటె తీయనిది తెలుగు

వెంకటాచలం : తేనె కంటే తెలుగుభాష తీయనిదని సర్వేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జ్ఞానరత్నం పేర్కొన్నారు. తెలుగుభాషాదినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తెలుగు భాష వికాసానికి గిడుగు రామ్మూర్తి ఎంతో కృషి చేశారని అందువల్ల ఆయన పుట్టినరోజును ఏటా తెలుగుదినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. మాతృభాష అయిన తెలుగును విస్మరించవద్దని ఆయన హితవు పలికారు. అవసరం కోసం ఇతర భాషలను నేర్చుకోవడం తప్పుకాదని, అవే తమ మాతృభాషలుగా పరిగణించడం మంచిది కాదని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

'గిడుగు'ను మరిచారు

మనుబోలు : మండల పరిధిలో ఒక్క ప్రభుత్వ పాఠశాలలో కూడా తెలుగుబాషా దినోత్సవం మంగళవారం నిర్వహించనేలేదు. మండలంలో 37 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, ఐదు ఉన్నత పాఠశాలలున్నాయి. పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నా ఉపాధ్యాయులు ఎడచెవిన పెట్టారు. ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి నిదురపోయే వరకు గలగల తెలుగు పదాలు వాడేస్తుంటాం. అలాంటిది తెలుగు భాషా దినోత్సవం నాడు మాతృభాష ఆవశ్యకతను, దాని గొప్పతనాన్ని గురించి పిల్లలకు తెలియచేయాల్సిన ఉపాధ్యాయులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించారు. ఇలాగైతే రానున్న రోజుల్లో తెలుగుభాష ప్రభుత్వ పాఠశాలలో నేర్పుతారో, లేదో అన్న సందేహాలు తల్లిదండ్రులకు కలగక మానదు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పొదలకూరు: రైతులు సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సురేఖ తెలిపారు. మండలంలోని సూరాయపాళెం, ఎర్రబల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు వరి విత్తనాలు శుద్ధి చేసుకోవాలన్నారు. విత్తనాలను అనుమతి పొందిన డీలర్ల నుంచి కొనుగోలు చేయాలన్నారు. సూక్ష్మపోషకాలుగా జింకు, బోరాన్, జిప్సం వాడాలన్నారు. వీలైనంతవరకూ సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏడీ దేవసేన, మండల వ్యవసాయాధికారి యూ గీతాకుమారి, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఆర్ ఏడుకొండల నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో జాతీయ క్రీడాదినోత్సవం

తోటపల్లిగూడూరు : మండలంలోని ఈదూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ వెంకటేశ్వర్లురెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు దత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నిందితుడి అరెస్ట్

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు పంచాయతీ చిన్నపల్లిపాళెం గ్రామానికి చెందిన కేలిమేటి కిరణ్‌కుమార్, నెల్లిపూడి వెంకటేష్, కావలి నాగార్జునలను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు ఈ నెల 26వ తేదీన అదే గ్రామానికి చెందిన పేట మురళీతో వివాదపడి దాడి చేసిన కేసులో నిందితులు. అరెస్ట్ చేసిన నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు స్టేషన్‌హౌస్ ఆఫీసర్ హసనయ్యమూర్తి తెలిపారు.

నిందితులపై కేసు నమోదు

తోటపల్లిగూడూరు : ఇంట్లో ఒంటరిగా ఉన్న గిరిజన మహిళపై అత్యాచార యత్నానికి ప్రయత్నించిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని ఇస్కపాళెం గిరిజన కాలనీకి చెందిన 30 ఏళ్ల గిరిజన మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన తోటపల్లిగూడూరు గమళ్లపాళెంకు చెందిన మన్నెం హరి, మన్నెం మదన్ ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. ఆమె కేకలు వేయడంతో కులంపేరుతో దూషించి దాడిచేసి అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ హసనయ్యమూర్తి తెలిపారు.

ఎంఆర్ టీకాతో రెండు వ్యాధులు దూరం

పొదలకూరు: తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు ఒకే ఒక్క టీకా వేసి మీజిల్స్, రూబెల్లా వ్యాధులను దూరం చేసేందుకు ప్రభుత్వం ఎంఆర్ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందజేస్తోంది. ఇందులో భాగంగా పొదలకూరు విఘ్నేశ్వరపురం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య కార్యకర్తలు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఖరీదైన ఈ ఎంఆర్ వ్యాక్సిన్ ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. తల్లిదండ్రులు 15 ఏళ్ళ లోపు పిల్లలందరికీ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ టీకాను కార్యాచరణ ప్రణాళిక ప్రకారం వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎం రాధాకుమారి, హెల్త్ అసిస్టెంట్ సాని శివప్రసాద్ పాల్గొన్నారు.


చిన్నారికి ఎంఆర్ టీకా వేస్తున్న ఆరోగ్య కార్యకర్త

ఇరువర్గాల ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామంలోని వడ్డిపాళెంలో సోమవారం అర్ధరాత్రి ఇరు వర్గాలకు చెందిన వారు దాడులు చేసుకుని గాయాల పాలయ్యారు. ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లు, బండి అశోక్, బండి శ్రీను, బండి అమరావతి, బండి అనుప్రియ ఒక వర్గం కాగా, ఉప్పు కిష్టయ్య, బండిసాయి, బండిశాంతకుమార్‌లు మరో వర్గంకు చెందినవారు. ఇరువర్గాల మధ్య గతంలో నుంచి ఇంటి స్థలాల విషయంలో కక్షలు ఉన్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకుని స్థల వివాదంపైనే ఘర్షణలకు దిగారు. ఈ దాడులలో బండి సాయి, ఉప్పు కిష్టయ్యలకు తీవ్ర గాయాలు కాగా, బండి వెంకటేశ్వర్లుకు స్వల్పగాయాలయ్యాయని ఇరువురిని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారావు మంగళవారం తెలిపారు.

వస్త్ర వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన

నెల్లూరు (సాంస్కృతికం) : వస్త్ర వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన సదస్సు మంగళవారం నెల్లూరులోని ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన వ్యాపారం చేసే వారికి ఈ చట్టం ఎంతో శ్రేయస్కరమన్నారు. వస్త్ర వ్యాపారానికి పన్ను కొత్తేమి కాదన్నారు. వినియోగదారుల నుంచి వసూలు చేసిన పన్నులు సక్రమంగా ప్రభుత్వానికి అందనందునే జీఎస్టీ అమలులోకి వచ్చిందన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం రిటన్స్ ఎలా వేయాలి అనే విషయాన్ని విశదీకరించారు. పన్ను ఎగవేతకు పాల్పడితే రెండింతల పన్ను, జరిమానా, జైలు ఉంటాయని హెచ్చరించారు. వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఎన్ కామేశ్వరరావు, ఏపీ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఆకుల వెంకటేశ్వర్లు, జీఎస్టీఎన్ కమిటీ సభ్యుడు సీఏ సుబ్బారావు, ఏపీ సేల్స్‌టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీఎస్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సెట్ పాయే... సెల్‌ఫోన్ వచ్చే!

మనుబోలు : ఈ చిత్రంలో కనిపించే పరికరం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కనబడుతుంది. ఈ పరికరం ద్వారానే జిల్లా కేంద్రంలో కలెక్టర్ స్థాయి నుంచి వివిధ శాఖల అధికారులు, కింది స్థాయి అధికారులకు పరిపాలన నిర్వహణకు దిశానిర్దేశం చేసేవారు. దీనిని అధికారులు వారి పరిభాషలో సెట్ కాన్ఫరెన్స్ అనేవారు. సెట్ కాన్ఫరెన్స్ అనగానే అధికారులంతా కార్యాలయానికి చేరుకుని హడావుడి చేసేవాళ్ళు. ఇదంతా గతం.. నేడు సెల్‌ఫోన్ కాన్ఫరెన్స్ వచ్చేసింది. మండలంలోని కార్యాలయాలకు తక్షణమే సమాచారం అందించాలన్నా, క్షేత్ర స్థాయిలో పథకాల వివరాలు తెలుసుకోవాలన్నా సెల్‌ఫోన్‌లో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. గతంలో సెట్ కాన్ఫరెన్స్‌ను అధికారులు విధులు నిర్వహించే సమయాల్లో మాత్రమే అమలు చేసేవారు. ఇప్పుడు సెల్‌కాన్ఫరెన్స్‌ను ఎప్పుడు సమాచారం అవసరమో క్షణాల వ్యవధిలోనే జిల్లా యంత్రాంగాన్ని సెల్‌ఫోన్‌ల దగ్గర కూర్చో పెడుతున్నారు.

ప్రస్తుతం కేవలం పోలీసు స్టేషన్లలోనే సెట్ కాన్ఫరెన్స్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో చాలా వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో సెట్ కాన్ఫరెన్స్ పరికరాలు మూలన పడిపోతున్నాయి. మరల వీటిని అందుబాటులోకి తీసుకువస్తారో..మరో సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళతారో వేచి చూడాల్సిందే.


మండలకార్యాలయంలోని సెట్ పరికరం

వైభవంగా గణేశ నిమజ్జనం

వెంకటాచలం : వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గణేశ నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. వెంకటాచలం, కంటేపల్లి గ్రామాల్లో తాత్కాలిక మంటపాలలో ఏర్పాటు చేసిన వినాయకుడి భారీ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపు ఎదుట యువకులు నృత్యాలు చేస్తూ, పరస్పరం రంగులు చల్లుకుంటూ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

ఆంధ్రజ్యోతి
బుధవారం,
30 ఆగస్టు 2017

విద్యార్థి గణనపై అవగాహన

వెంకటగిరి: మండలంలో విద్యార్థుల గణనపై మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో సర్వశిక్షా అభియాన్ సహాయ గణంకాధికారి పీవీ రమేష్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సాధికార సర్వేలో మండలంలో బడిఈడు పిల్లలు 1035 మంది నమోదైనట్లు చెప్పారు. వీరిలో పాఠశాలల్లో ఉన్న వారు 369 మంది కాగా వలస వెళ్లిన వారు 220, వయస్సు పైబడిన వారు 198, చనిపోయిన వారు 20, బడిబయట పిల్లలు 34 మందిగా గుర్తించినట్లు వివరించారు. ఈ వివరాలను 31వ తేదీ లోగా జిల్లా అధికారులకు అందించనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వరావు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు, సహిత విద్యా బోధకులు పాల్గొన్నారు.

బడికి వెళ్లాలంటే బురద తొక్కాల్సిందే!

- పాఠశాలల ప్రాంగణాలు రొచ్చురొచ్చు

బాలాయపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లోకి అడుగు పెట్టాలంటే బురద తొక్కాల్సిందేనని విద్యార్థులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లో మౌలిక వసతి కల్పించడంతో పాటు వాటి అభివృద్ధికి అధిక సంఖ్యలో నిధులు ఖర్చు చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నప్పటికీ చినుకు పడితే మండలంలోని ఎంఈవో కార్యాలయం, వెంగమాంబపురం జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, బీసీ బాలుర వసతి గృహం, బాలాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాలు రొచ్చురొచ్చుగా మారాయి. ఈ విషయాన్ని ఆయా శాఖల ఉన్నతాధికారులు దృష్టికి, సర్పంచుల దృష్టికి తీసుకువెళ్లగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద మట్టిని తోలి చదును చేస్తామని చెబుతున్నారే గానీ ఆచరణకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చినుకుపడితే బాలయపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారులను తీసుకుని పోవాలంటే నీటి మడుగు దాటాల్సిందేనని వాపోతున్నారు. వెంగమాంబాపురం ఉన్నత పాఠశాల, జూనియర్ కళశాల, ఒకే ఆవరణంలో ఉన్నాయి. అయితే వీటి ముందు లోతట్టుగా ఉండటం వల్ల నీరు చేరుతుంది. దీంతో ఎటూ పోలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాలు, పాఠశాలు ముంగిట చదును చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఇంతటి దుస్థితి నెలకొంటే మరి గ్రామాల్లో ప్రజల సమస్యలు పట్టించుకునే నాథుడు ఎవరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రజాప్రతి నిధులు ప్రభుత్వ కార్యాలయాల దుస్థితిపై శీతకన్ను చూపడం ఏమిటని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చెరువులా వెంగమాంబపురం పాఠశాల


ఎంఈవో కార్యాలయం ఎదుట మురుగు

చదును చేస్తామంటున్నారు



మూడేళ్లుగా ఎంఈవో కార్యాలయ ప్రాంగణలో ఉపాధి హామీ పథకం కింద చదును చేస్తామని చెబుతున్నారు తప్ప ఆచరణకు నోచుకోలేదు. దీంతో కార్యాలయంలోకి వెళ్లాలంటే మురుగు తొక్కుకుని వెళ్లాల్సి వస్తుంది.

- చలపతిరావు, ఎంఈవో

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



పాఠశాల ముంగిట లోతట్టుగా ఉండటంతో చిన్నపాటి వర్షనికే నీటి నిల్వ చేరుతుంది. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి రావాలంటే బురద తొక్కి రావాల్సిందే. పాఠశాల ఆవరణం చేస్తే బాగుంటుంది.

- కుమార్, హెచ్‌ఎం

వెంబులూరులో అధికారులు రాత్రి బస


గ్రామస్థుల నుంచి సమస్యలు తెలుసుకొంటున్న అధికారులు

డక్కిలి: మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో అధికారులు సోమవారం రాత్రి బస చేసి స్థానిక సమస్యలు తెలుసుకొన్నారు. వెంబులూరు పంచాయతీలో ప్రత్యేక అధికారి ఉమాదేవి, పలుగోడులో తహసీల్దార్ సయ్యద్ మునీర్‌బాషా, తీర్థంపాడులో ఎంపీడీవో విజయలక్ష్మి రాత్రి బస చేసి గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. మంగళవారం తెల్లవారు జామున ఈ బృందాలు ఇంటింటికి తిరిగి మరుగుదొడ్డి వాడకాన్ని పరిశీలించారు. ఆరుబైట మలవిసర్జన చేసే వారికి అవగాహన కల్పించారు. పలుగోడు సర్పంచు ఆదిరెడ్డి అమరావతి, వెంబులూరులో టీడీపీ నాయకులు పాయసం ఈశ్వరయ్య, గోపాల్, పోట్టా మునెయ్య, దామునాయుడులు అధికారులకు స్థానిక సమస్యలు వివరించారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

వెంకటగిరి: మండలంలోని వల్లివేడు గ్రామంలో వారం రోజులుగా వైష్ణవి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వి ద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రమణారెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, రోడ్డు వెంబడి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాసులు, ఆధ్యాపకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలి

కలువాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈవో జీ.సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం కలువాయి తూర్పు ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎస్‌ఎంసీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్య నా యకుడు పువ్వాడి మల్లికార్జున కుమార్తై వైష్ణవి జన్మదినం పేద విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రికార్డులు పక్కాగా ఉండాలి

- గూడూరు ఆర్టీవో అరుణ్‌బాబు


మాట్లాడుతున్న ఆర్డీవో అరుణ్‌బాబు

వెంకటగిరి: గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూముల రికార్డులు పక్కాగా ఉంచాలని ఆర్టీవో అరుణ్‌బాబు వీఆర్‌వోలకు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. మంగళవారం వెంకటగిరికి విచ్చేసిన ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కలెక్టర్ కొత్తగా అమలు పరిచిన గ్రామ రికార్డుల కార్యక్రమంపై వీఆర్‌వోలు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లతో సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా అడంగల్‌లో సవరణ, గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూముల గుర్తింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ సభకు తరలిరండి

డక్కిలి: వెంకటగిరిలో ఈ నెల 31వ తేదీన జరిగే టీడీపీ సమన్వయ కమిటీ సమావేశానికి శ్రేణులు తరలిరావాలని టీ డీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవా రం ఆయన డక్కిలిలో విలేఖర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కళాశాల మైదానంలో జరిగే ఈ సభ కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ పాల్గొంటారన్నారు.

సినిమా గైడ్

వెంకటగిరి

త్రిభువని: లై
జ్యోతిమహల్: నేనే రాజు నేనే మంత్రి
భ్రమరాంభ : జయ జానకి నాయక

రాపూరు

శ్రీనివాసమహల్: లై
వేంకటేశ్వరమహల్: జయ జానకి నాయక

పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం

వెంకటగిరి: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో గిడుగు రాంమూర్తి పంతులు జయంతిని పురష్కరించుకొని మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె పరంధామయ్య మాట్లాడారు. తెలుగ వర్ణ మాలతో తయారు చేసిన వేంకటేశ్వర స్వామి చిత్రపటం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఏవో రమణ, అకడమిక్ డీన్ పీ నిరంజన్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రాపూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వేపినాపి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గిడుగు వెంకటరాంమూర్తి జయంతి వేడుకలు, జాతీయ క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. గిడుగు చేసిన సేవలను కొనియాడారు. హెచ్‌ఎంలు భాస్కరరావు, ఎం. జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలువాయి: రాజుపాళెం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

మద్యం సీసాల పట్టివేత

రాపూరు: రాపూరు ఎక్సైజ్ సర్కిల్‌స్టేషన్ పరిధిలోని చేజర్ల మండలం ఆదూరుపల్లి వద్ద మంగళవారం మద్యం విక్రయాలు సాగిస్తున్న శీనయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమణ తెలిపారు.


పట్టుబడిన మద్యం సీసాలు

నేడు చింతగుంటలో వైద్యశిబిరం

చింతగుంట(వెంకటగిరి): మండలంలోని చింతగుంటలోని శ్రీరామ మందిరం వద్ద బుధవారం కాలే చెంచునరసింహారావు బ్రదర్స్ ఆధ్వర్యంలో నెల్లూరు నారాయణ హాస్పిటల్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

రాపూరు: పట్టణంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక గణేష్‌కు మంగళవారం సాయంత్రం నిమజ్జనం చేశారు. మేళతాళాలు, బ్యాండు, బాణసంచా పేలుళ్లల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని నిమజ్జనం చేశారు.

డక్కిలి: స్థానిక కమ్మపల్లి రోడ్డు సెంటరులో యూత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహించారు. ముందు ఉట్టి కొట్టి గణేష్ విగ్రహాన్ని తీసుకెళ్లి తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు.

కలువాయి: మండలంలో గణేష్ నిమజ్జనం కోలాహలంగా జరిగింది. ఉట్టి మహోత్సవాలు, లడ్డూ వేలం నిర్వహించారు. అనంతరం పెన్నాలో నిమజ్జనం చేశారు.

త్వరలోనే ప్రభుత్వాసుపత్రి భవనాల ప్రారంభం

రాపూరు: పట్టణంలో రూ.4కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వాసుపత్రి భవనాలను త్వరలోనే ప్రారంభిస్తామని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నువ్వుల శివరామకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వసతులతో కూడిన ఏర్పాట్లు చేస్తున్నామని, ఖాళీలను భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలె వైద్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నువ్వుల శివరామకృష్ణ

హిందూ ధర్మం గొప్పది

వెంకటగిరి(టౌన్): హిందూ ధర్మం చాలా గొప్పదని కమలానంద భారతి స్వామి అన్నారు. మంగళవారం జంగాలపల్లి, పత్రపల్లి, ముద్దపల్లి, అమ్మపాళెం, పాపామాంబపురం, కందనాలపాడు, వర్ధనపల్లి, యాచసముద్రం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రతి రోజు ధూప, దీపారాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామచంద్రయ్య, సమరసత సేవా ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారక్ శేషాద్రి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కుల్లూరు విద్యార్థి

కలువాయి: కుల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కె.గురుసాయిసాకేత్ జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ సెమినార్‌లో పాల్గొనే అర్హత సాధించాడని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.